

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com




సంపుటి11 | సంచిక 76
మంగళవారం | 9 జనవరి 2018 | హైదరాబాద్ | పేజీలు 12+12 | వెల: రూ. 5.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్య మాసం, బహుళ పక్ష తిథి : అష్టమి రా.8.51, చిత్త పూర్తి, వర్జ్యం మ.2.47 నుంచి 4.26 వరకు,
రాహుకాలం: మ.3.00 నుంచి 4.30 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుంచి 9.12 వరకు, తిరిగి రా.10.46 నుంచి 11.36 వరకు, సూర్యోదయం : ఉ. 6.52 గం; సూర్యాస్తమయం: సా. 5.54 గం.


పల్లెల్లో ప్రచార హోరు





అప్పుడే ఎన్నికలను తలపిస్తున్న నేతల యాత్రలు





- ఏపీలో సీఎం సొంత జిల్లాలో జగన్ ప్రజా సంకల్ప యాత్ర
- పోలవరం కోసం కాంగ్రెస్ పాదయాత్ర
- నడక ప్రారంభించిన కేవీపీ రామచంద్రరావు
- జన్మభూమితో జనం చెంతకు అధికార పార్టీ
- బిజీగా తిరుగుతున్న చంద్రబాబు
- తెలంగాణాలో కాంగ్రెస్ బస్సు యాత్రకు రెడీ
- జోరుగా ఆత్మీయ సమావేశాలతో కార్యకర్తలకు జోష్
- జనంలోకి బీజేపీ నేతలు

తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే ఎన్నికలు జరుగుతున్నాయన్నట్లుగా రాజకీయ పార్టీలు హడావుడి చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉన్నప్పటికీ ఇప్పటినుంచే కదనరంగంలోకి దూకాయి. రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న టీఆర్ఎస్, టీడీపీలు ప్రభుత్వ పథకాలకు పదును పెడుతూ జనంలో మమేకం అయితున్నాయి. ఏపీలో అధికార పార్టీ జన్మభూమి కార్యక్రమం పేరుతో ప్రజలకు చేరువ అయ్యేందుకు ప్రయత్నిస్తుండగా ప్రతిపక్ష వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రను సీఎం సొంత జిల్లాలో కొనసాగిస్తున్నారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కూడా పాదయాత్రను నిర్వహిస్తున్నది. తెలంగాణాలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ అడుగులు వేస్తున్నది. ఇప్పటి వరకు కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు నిర్వహించి కార్యకర్తల్లో జోష్‌ను నింపింది. ఇక ఇప్పుడు తెలంగాణా వ్యాప్తంగా బస్సుయాత్రను నిర్వహించేందుకు సిద్ధమైంది. అధికారపార్టీ అయిన టీఆర్ఎస్ మాత్రం మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ,

(సూర్యప్రధానప్రతినిధి) : గ్రామగ్రామాన పార్టీల జెండాల రెప రెపలు...కార్యకర్తల నినాదాలు మైకుల హోరు కనిపిస్తోంది. నవ్యాంధ్రలోని 13 జిల్లాల్లో అప్పుడే ఎన్నికలు జరుగుతున్నాయా అన్న చర్చ సాగుతోంది. అధికార పార్టీ ఇప్పటికే జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమాల్లో భాగంగా ప్రతి జిల్లాల్లో ప్రజా ప్రతినిధులు, మంత్రులు కార్యక్రమాలతో బిజీగా కనిపిస్తుండడంతో కార్యకర్తల్లో కొత్త జోష్ కనిపిస్తోంది. అన్ని గ్రామాల్లో పసుపు జెండాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రజా సంకల్పయాత్ర పేరుతో జగన్ ముఖ్యమంత్రి

మిగతా 6లో





కేసిఆర్ వల్లే ఐటి దూకుడు

- సీఎం కేసీఆర్ పటిమ వల్లే అద్భుత ప్రగతి
- ఐటీ ఎగుమతులు రెట్టింపు
- మూడేళ్లలో లక్ష ఉద్యోగాలు కల్పించాం
- తెలంగాణ రాక ముందు రూ. 56 వేల కోట్ల ఐటి ఎగుమతులు
- మూడేళ్ల తెలంగాణాలో రూ. 87 వేల కోట్ల ఎగుమతులు
- రెండో శ్రేణి నగరాల్లో ఐటి పరిశ్రమలు
- కరీంనగర్‌లో ఐటి పార్కుకు శంకుస్థాపన
- యువత మేధస్సుకు పదును పెట్టాలి
- మంత్రి కే తారక రామారావు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళ్తోందని ఐటీ, పరిశ్రమలు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు. ఐటీ రంగంలో మూడేళ్లలోనే లక్ష వరకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు వచ్చాయన్నారు. రాష్ట్ర యువతకు పని చేసే చోటే ఉపాధి అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని దిగువ మానేరు జలాశయం పరిధిలోని ఉజ్వల పార్క్ వద్ద రూ. 25 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఐటీ టవర్ నిర్మాణానికి ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్‌తో కలిసి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రూ. 56 వేల కోట్ల ఐటీ ఎగుమతులు ఉన్నామయని మంత్రి గుర్తు చేశారు. గతేడాది ఐటీ ఎగుమతులు రూ. 87 వేల కోట్లకు చేరాయని తెలిపారు. ఐటీ రంగంలోనే వేలాది సంఖ్యలో ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించామని చెప్పారు. తెలంగాణ యువతకు

మిగతా 6లో

2019లో అధికారం మాదే



- టీఆర్ఎస్ సర్కారు పాలన అస్తవ్యస్తం
- విమర్శలు గుప్పించిన కుంతియా
- ఏ సమస్య వచ్చినా ఫోన్ చేయండి
- పాలమూరులో క్లీన్ స్వీప్ : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- అందరం కలిసి సాగుతాం : కోమటిరెడ్డి

వివరాలు 6లో

భారత్ పరాజయం



- దక్షిణాఫ్రికా చేతిలో పరాభవం
- రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుదేలు
- ఆరు వికెట్లతో చెలరేగిన ఫిలాండర్
- 72 పరుగుల తేడాతో ఓటమి పాలు
- సత్తా చాటని విరాట్ కోహ్లీ

వివరాలు 12లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

కోడి రె'ఢీ'

చాప కింద నీరులా ప్రయత్నాలు

- చురుకుగా సాగుతున్న ఏర్పాట్లు
- వెలుస్తున్న బరులు
- సుప్రీం బరిలో 'పందెం' కోడి
- పగ్గాలు పడేనా?
- అధునాతన హంగులతో నిర్వహణ
- కొత్తపుంతలు తొక్కిస్తున్న పందెం వీరులు
- హైకోర్టు ఆదేశాలతో ఉత్కంఠ



వివరాలు 6లో

పోలరణం



- పోలవరాన్ని మేమే ప్రారంభిస్తామంటున్న కాంగ్రెస్
- మూడురోజుల పాటు కొనసాగనున్న పాదయాత్ర
- అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- ట్రాన్స్‌ట్రాయ్ యంత్రాలను సీజ్ చేసిన బ్యాంకు అధికారులు
- దేనా బ్యాంక్‌కు రూ.120 కోట్ల ఎగ్గొట్టిన యాజమాన్యం
- కోర్టు అనుమతితో చర్యలు ప్రారంభించిన దేనా బ్యాంకు

వివరాలు 12లో

అంతే ఇంతే!



వచ్చేది ఎన్నికల సంవత్సరం. ఇప్పుడన్నీ భూమి పూజలు శిలాఫలకాలే కనిపిస్తాయ్.

బాబు మళ్లీ వస్తే అనర్థమే

- చిత్తూరు డైయిరీని పద్ధతి ప్రకారం మూతపడేలా చేశారు
- ముఖ్యమంత్రి తీరుపై వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్వజం
- పూతలపట్టుకు చేరుకున్న ప్రజా సంకల్ప యాత్ర
- అడుగడుగునా వైఎస్ జగన్ రెడ్డి పాదయాత్రకు జననీరాజనం
- జనంతో మమేకమవుతున్న వైసీపీ నేత

పూతలపట్టు నుంచి సూర్యపొలిటికల్‌బ్యూరో: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే చాలు.. సహకార రంగంలోని ఫ్యాక్టరీలు మూతబడుతాయని, అందుకు తాజా నిదర్శనం చిత్తూరు జిల్లాలోని చక్కర ఫ్యాక్టరీలేనని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. చంద్రబాబు తీరు కారణంగా చిత్తూరు జిల్లాలో సహకార రంగంలో ఉన్న రెండు చక్కర ఫ్యాక్టరీలు మూతపడే పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. అదేవిధంగా చిత్తూరు పాలడైరీని కూడా ఒక పద్ధతి ప్రకారం చంద్రబాబు మూసివేయించారని, తన హెరిటేజ్ పాల ఫ్యాక్టరీకి లాభాల కోసం చిత్తూరు డైరీని పద్ధతి ప్రకారం మూతపడేలా చేశారని ధ్వజమెత్తారు. రైతుల జీవితాన్ని నాశనం చేసే కార్యక్రమాన్ని చంద్రబాబు పెట్టుకున్నారని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా సోమవారం చిత్తూరు



జిల్లా పూతలపట్టు చేరుకున్న వైఎస్ జగన్‌కు ఘనస్వాగతం లభించింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు వైఎస్ జగన్‌కు నీరాజనాలు పట్టారు. ఈ సందర్భంగా బహిరంగ సభను ఉద్దేశించి వైఎస్ జగన్ ప్రసంగించారు. ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు పొద్దుటి నుంచి ఎండను ఖాతరు

మిగతా 6లో

సూర్య
హైదరాబాద్
మంగళవారం
9 జనవరి 2018

రాజకీయాలలో నూతన ఒరవడి సృష్టించింది ఎన్టీఆర్ : ఎల్.రమణ

స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు కల్పించింది టీడీపీయే

ప్రజా సమస్యలపై అవగాహన కోసమే ఈ శిక్షణ తరగతులు

హైదరాబాద్, మేజర్‌న్యూస్: రాజకీయాలలో నూతన ఒరవడి సృష్టించిన ఎన్టీఆర్, పార్టీ శ్రేణులలో నాయకత్వాన్ని పెంపొందించడానికే ఆనాడే శిక్షణ తరగతులను ప్రారంభించారని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. సోమవారం ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ప్రారంభమైన రెండవ బ్యాచ్ శిక్షణ తరగతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై అవగాహన పెంచుకొని సమాజానికి అంకిత భావంతో పార్టీ శ్రేణులు సేవ చేయాలనే ఉద్దేశంతో 1982లో ఎన్టీఆర్ శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. వాటిని చంద్రబాబు నాయుడు నిరంతరం కొనసాగిస్తూ శ్రేణులకు శిక్షణ తరగతులను కొనసాగిస్తున్నారని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న నేతలు లోక్‌సభ స్పీకర్, కేంద్రమంత్రులు అయ్యారని చెప్పారు. స్థానిక సంస్థలలో టీడీపీ రిజర్వేషన్లు కల్పించడం వల్లే గ్రామాలలో సామాజిక న్యాయం జరిగిందని ఈ సందర్భంగా రమణ గుర్తు చేశారు. నాలాంటి వారు సైతం రాజకీయాలలో ఎదిగారంటే అది ఎన్టీఆర్, చంద్రబాబు వల్లేనని రమణ స్పష్టం చేశారు. అలాగే మన రాష్ట్ర క్యాబినెట్ కూర్పు ఎలా ఉంటుందో తెలియని ఈటెల రాజేందర్ ఆర్థిక మంత్రి అని రమణ ఎద్దేవా చేశారు. మహిళలకు, మాల, మాదిగలకు క్యాబినెట్‌లో ఎందుకు స్థానం కల్పించలే దని ఆయన ప్రశ్నించారు. రాబోయే పంచాయతీ ఎన్నికలకు కేసీఆర్ కొత్త వ్యూహంతో వస్తున్నాడని, పంచాయతీ వ్యవస్థపై క్యాబినెట్ కమిటీ వేశారని, అందులో కేటీఆర్, హరీశ్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు ఉన్నారని, ఈ కమిటీలో ఒక్క బీసీ మంత్రి గానీ, ఎస్సీ, ఎస్టీ మంత్రి గానీ లేరని తెలిపారు. టీఆర్ఎస్ పాలన ఏ విధంగా సాగుతుందో అందుకు ఇదొక ఉదాహరణ మాత్రమేనని రమణ తెలిపారు. 2019 ఎన్నికలల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టినప్పుడే ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అని రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రావుల చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, బొట్ల శ్రీనివాస్, బిఎన్ రెడ్డి, బక్కని నర్సింహులు, ఎం.అమర్‌నాథ్ బాబు, కాశీనాథ్ శిలువేరు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కాంగ్రెస్ బస్ యాత్ర

- రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన
- రోజుకు మూడు నియోజకవర్గాలలో యాత్ర
- సంక్రాంతి తరువాత టిపిసిసి కమిటీ
- తెలంగాణలో కచ్చితంగా కాంగ్రెస్‌కే అధికారం ఖాయం
- టిఆర్ ఎస్ మునిగేపోయే నావ
- మీడియా చిట్‌చాట్‌లో ఉత్తమ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి త్వరలో ప్రతి నియోజకవర్గానికి వెళ్ళి టిఆర్ ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలపైన పోరాటాలు చేస్తామని, రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున అన్ని నియోజకవర్గాలలో యాత్రలు నిర్వహిస్తామని ఈ యాత్రలో ముఖ్య నాయకులంతా కలిసి సభలలో పాల్గొంటామని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. సోమవారం నాడు గాంధీభవన్లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. రెండో సారి టిపిసిసి అధ్యక్షులుగా ఎన్నికయిన సందర్భంగా ఆయన గాంధీభవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. తెలంగాణ వ్యాప్తంగా ముఖ్యంగా, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలల నుంచి వేలాది మంది కార్యకర్తలు ఆయనకు నూల గుచ్చాలు ఇచ్చి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి, డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు, శాలువాలు కప్పి సన్మానాలు చేశారు. నాయకులు, కార్యకర్తలు సన్మనాలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మీడియాతో కొద్ది సేపు ముచ్చటించారు. రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ విజయాన్ని ఎవరు ఆపలేరని, 70 పైగా స్థానాలు సునాయసనంగా సాధిస్తామని అన్నారు. ప్రజలు టిఆర్ ఎస్ పాలన పట్ల తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నారని కాంగ్రెస్ క్యాడర్ చాల ఉత్సాహంగా పనిచేస్తున్నారని టిఆర్ ఎస్తో సహా ఎవరు సర్వేలు చేసినా కాంగ్రెస్ విజయం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని అన్నారు. ఈ రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం కూడా టిఆర్ఎస్ పాలన పట్ల సానుకూలంగా లేవని అయన అన్నారు. సంక్రాంతి తరువాత టిపిసిసి కొత్త కమిటీ పూర్తి స్థాయిలో వేస్తామని 13 మంది ఉపాధ్యక్షులు, ఉమ్మడి జిల్లాకు ముగ్గురు చొప్పున ప్రధాన కార్యదర్శులు, నియోజవకర్గానికి ఒకరు చొప్పున కార్యదర్శి ఉంటారని దాదావు గతంలో ఉన్నట్టగానే కమిటీ ఉన్నప్పటికీ పనిచేయని వారిని పక్కన పెట్టి ఉత్సహ వంతులకు అవకాశాలుంటాయని వివరించారు. వీటితో పాటు ఒక ప్రచార కమిటీ, ఒక మేనిఫెస్టో కమిటీ ఉంటుందని ఆయన వివరించారు. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన ఈ నెలఖరున కానీ ఫిబ్రవరి మొదటి వారంలో కానీ ఉంటుందని, రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన విషయంలో చాల ఆసక్తిగా ఉన్నప్పటికీ మేడారం జాతర సందర్భంగా సభలు నిర్వహించడం బాగుండదని ఆగుతున్నామని ఆయన అన్నారు. ఆ ముందు కానీ జాతర తరువాత కానీ సభ ఉంటుదని వివరించారు. టీఆర్ఎస్‌తోపాటు అనేక పార్టీల నుంచి తమ పార్టీలో కలిసేందుకు పెద్ద ఎత్తున వస్తున్నారని వారికి బేషరతుగా పార్టీలో చేరాలని షరతు పెడుతున్నామని చెప్పారు. టిఆర్ ఎస్ నావలో జనం ఎక్కువయ్యారని అది మునిగిపోయే నావ అని, అందుకే ఆ పార్టీల నుంచి చాల మంది బయటకు వచ్చేందుకు ఆసక్తి చూవుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ డిలీమిటేషన్ విషయంలో ఒక ఉమ్మడి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పంచాయతీ రాజ్ చట్టంలో వార్డు సభ్యుల నుంచి సర్పంచ్లను ఎన్నుకునే అవకాశం ఇస్తే మరింత రాజకీయ ఫిరాయింపులకు అవకాశముంటుందని అన్నారు. ఇప్పుడు కేసిఆర్ రాష్ట్రంలో ఏమి చేశారో, రేపు గ్రామాలలో అదే చేస్తారని ఆయన ఎద్దేవా చేశారు. కాగా..కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో కారేగావ్లో సాయిలు అనే గ్రామ సహాయకుడిని ఇసుక మాఫియా హత్య చేసిందని, ఇసుక అక్రమ రవాణాను అడ్డకున్నందుకే ఇలా చేశారని సాయిలు తల్లి దండ్రులు బోయిని ఈరవ్వ, శివయ్యలు, భార్య సాయవ్వలు అన్నారు. సోమవారం నాడు వారు పిల్ల పాపలతో కలిసి మాజీ ఎం.ఎల్.ఎ అరుణ తార, పిసిసి ప్రధాన కార్యదర్శి మహేశ్ కుమార్ గౌడ్లతో కలిసి గాంధీభవన్లో టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్కుమార్ రెడ్డి కలిసి వారి ఆవేధను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఇసుక మాఫియాకు ఈ పాలకులు అడ్డగోలుగా మద్దతు ఇస్తున్నారని అడ్డొచ్చిన వారిని హత్య చేస్తున్నారని ఆయన విమర్శించారు.

ప్రజల పక్షాన నిలవాల్సిన పాలకులు ఇలా ఇసక మాఫియాకు అండగా నిలవడం దారుణమని అన్నారు. చివరకు గవర్నర్ కూడా ఇసుక మాఫియాకు అండగా మాట్లడుతున్నారంటే పరిస్తితి ఎంత దారుణంగా ఉందో అర్ధం చేసుకోవచ్చని అన్నారు. రెవిన్యూ రికార్డులలో ఆయన విఆర్ ఎ గా పనిచేస్తున్నట్టు స్పష్టంగా ఉందని అయినా కూడా మృాఎతుడు సాయిలు ఉద్యోగి కాదని, తాగి రోడ్డు మీద పడుకుంటే ప్రమాదంలో మరణించారని అధికారులు, పాలకులు చెప్పడం అత్యంత పాశవికమని ఆయన విమర్శంచారు. ఈ విషయంలో అధికారులు ఇసుక మాఫియాపైన హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని, సాయిలు కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని, వారికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. పార్టీ తరపున తాము కూడా ఆ కుటుంబాని అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

చకచకా ఇక పోలవరం

- ఆటంకాలు తొలగడంతో పనుల్లో కళకళ
- ఎగువ కాఫర్ డ్యామ్ పనులకు పూజలు
- అగ్రిగేట్ కూలింగ్ ప్లాంట్ ప్రారంభించిన చంద్రబాబు



(పోలవరం నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి) : పోలవరం ప్రాజెక్టు ప్రధాన పనులపై నెలకొన్న సందిగ్ధత ఎట్టకేలకు తొలగింది. ముఖ్యంగా ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి కేంద్ర జల సంఘం అనుమతి ఇవ్వడంతో పనులను వేగిరం చేసే దిశగా జల వనరుల శాఖ అధికారులు వడివడిగా కదులు తున్నారు. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం శరవేగంగా జరగడంతో ప్రస్తుతం అధికారులు దృష్టి అంతా ఎగువ కాఫర్‌డ్యామ్ నిర్మాణంపై పడింది. పోలవరం ప్రాజెక్టు పనులను మరింత పరుగెత్తించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం వచ్చారు. ఎగువ కాఫర్‌డ్యామ్ పనులకు పూజలు చేసి శ్రీకారం చుట్టారు. అటు డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ పనులను మే నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే కృత నిశ్చయంతో ఎల్అండ్‌టీ బావర్ కంపెనీ గోదావరి నదిపై అడ్డుకట్ట వేసుకుంటూ ముందుకు కదులుతోంది. స్పిల్‌వేలో కాంక్రీట్, స్పిల్ ఛానల్ మట్టి తవ్వకం పనులకు పిలిచిన టెండర్లను తెరవడానికి కేంద్రం అనుమతించింది. మరో వారం రోజుల్లో వాటిని తెరిచేందుకు జల వనరుల శాఖ అధికారులు సమాయత్తమవుతున్నారు.

స్టిల్లింగ్ బేసిన్ : స్టిల్లింగ్ బేసిన్ నిర్మాణంలో 21.5స21.5 చ.మీటర్ల పరిమాణంలో 245 కాంక్రీటు దిమ్మెలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటి వరకు 106 దిమ్మెల నిర్మాణం పూర్తయింది.

లక్ష్యం : 4.43 లక్షల క్యూబిక్ మీటర్లు, చేసింది: 1.15 లక్షల క్యూబిక్ మీటర్లు, చేయాల్సింది: 3.28 లక్షల క్యూబిక్ మీటర్లు స్పిల్‌వే నిర్మాణం: స్పిల్‌వే నిర్మాణంలో 53 బ్లాకులు, 47 స్తంభాలు, ఎండ్‌వాల్స్, నిర్మాణాలు జరగాల్సి ఉంది.దీనిలో 53 బ్లాకులకు 40 బ్లాకుల నిర్మాణం ప్రస్తుతం జరుగుతోంది. 47 స్తంభాలకు 31 స్తంభాలు నిర్మిస్తున్నారు. ప్రధానంగా 161 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం పనులు నూరుశాతం పూర్తయింది.

కాంక్రీటు పనులు : లక్ష్యం : 11.61 లక్షల క్యూబిక్ మీటర్లు
చేసింది: 3.53 లక్షల క్యూబిక్ మీటర్లు
చేయాల్సింది: 8.08 లక్షల క్యూబిక్ మీటర్లు

డయాఫ్రమ్‌వాల్ : ఈ నిర్మాణం గోదావరి మధ్యన భూమి అంతర్భాగంలో 1.50 మీటర్ల వెడల్పున గోడ నిర్మాణం జరుగుతోంది. 1427 మీటర్లు పొడవుకు గాను 848.6 మీటర్లు మేర నిర్మాణం పూర్తయింది. దీనిలో 400 ప్యానల్స్ నిర్మాణానికి 191 పూర్తి చేశారు. ఇంకా 209 ప్యానల్స్ నిర్మాణం జరగాల్సి ఉంది. ఎగువ కాఫర్‌డ్యామ్ : డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రాంతానికి 400 మీటర్ల ఎగువన కాఫర్‌డ్యామ్ నిర్మాణానికి కేంద్ర జల సంఘం నుంచి అనుమతులు వచ్చాయి. 2300 మీటర్ల పొడవునా నిర్మించే కాపర్‌డ్యామ్ పనులకు ముఖ్యమంత్రి పూజలు చేశారు.

పవర్‌హౌస్ పునాది తవ్వకం పనులు : లక్ష్యం: 118 లక్షల క్యూబిక్ మీటర్లు, చేసింది: 94.18 లక్షల క్యూబిక్ మీటర్లు, చేయాల్సింది: 23.82 లక్షల క్యూబిక్ మీటర్లు, స్పిల్ ఛానల్ : స్పిల్ ఛానల్ నిర్మాణంలో 18 లక్షల క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీటు వేయాల్సి ఉంది. ప్రస్తుతం మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఆకృతులు ఖరారు కావాల్సి ఉంది.

మట్టి పనుల వివరాలు : లక్ష్యం : 595 లక్షల క్యూబిక్‌మీటర్లు, చేసింది: 4

అప్రోచ్ ఛానల్ : పైలెట్ ఛానల్ (మట్టి), లక్ష్యం: 181 లక్షల క్యూబిక్ మీటర్లు
చేసింది: 48.76 లక్షల క్యూబిక్ మీటర్లు
చేయాల్సింది: 132.24 లక్షల క్యూబిక్ మీటర్లు

దిగువ కాఫర్‌డ్యాం
జెట్ గ్రౌటింగ్ పని జరుగుతోంది (భూమి లోపల ఇసుకను గట్టిపరిచే పని)
లక్ష్యం : 1630.4 మీటర్లు పొడవు
డిసెంబరు 2017 నాటికి చేయాల్సింది: 1055.5 మీటర్లు పొడవు
చేసింది: 807మీటర్లు
చేయాల్సింది: 148.5 మీటర్లు

ఈ నిర్మాణంలో 703 కాలమ్స్‌కు 539 కాలమ్స్ వేయగా ఇంకా 164 నిర్మాణం జరగాల్సి ఉంది.

జంట సొరంగాలు : దేవరగొంది నుంచి మామిడిగొంది వరకు 779 మీటర్ల పొడవునా కొండల్లో సొరంగ మార్గం నిర్మాణం జరగాల్సి ఉంది. దీనిలో 750మీటర్ల మేర సొరంగాల తవ్వకం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తిచేసి లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది.

రేడియల్ గేట్ల నిర్మాణం : స్కిన్ ప్లేట్లు అమరిక: 48 (నూరుశాతం పూర్తయ్యాయి)

ఆర్మ్‌డ్ గెడ్డర్లు: 384 (నూరుశాతం నిర్మాణం పూర్తయ్యాయి)

హారిజాంటల్ గెడ్డర్లు : 192 (నూరుశాతం పూర్తయ్యాయి)

హైడ్రాలిక్ సిలిండర్లు: 96 (రావాల్సి ఉంది. ఆకృతుల అనుమతులు విషయమై సీడబ్ల్యూసీ పరిశీలనలో ఉంది)

సెల్ఫ్‌లూబ్రికేటింగ్ బుష్‌లు: 96కు 16 చేరుకున్నాయి. జపాన్ నుంచి మిగిలినవి రావాల్సి ఉంది.

అగ్రిగేట్ కూలింగ్ ప్లాంటు: గంటకు 550 క్యూబిక్ మీటర్ల కంకరను ఈ యంత్రం 4, 5 డిగ్రీల కనీస ఉష్ణోగ్రతలకు చల్లబరుస్తుంది. దీనిలోకి కంకర నేరుగా వెళ్లేందుకు సమీపంలోనే క్రషర్‌ను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ మొత్తం కంప్యూటర్‌తో అనుసంధానం చేశారు. చల్లబడిన కంకరను నేరుగా బ్లాచింగ్ ప్లాంటుకు వెళ్లే విధంగా నిర్మించిన అగ్రిగేట్ కూలింగ్ ప్లాంటును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. పి.రెగ్యులేటర్ : 9 గేట్ల అమరిక పూర్తయింది. పైన శ్లాబు పనులు జరుగుతున్నాయి. ఈ షడిల్ డ్యామ్: రెండు కొండల నడుమ జరుగుతున్న ఈ పనుల్లో డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం పూర్తయింది. రాయి, మట్టి నిర్మాణం జరుగుతోంది. ఎఫ్ షడిల్ డ్యామ్: నిర్మాణం పూర్తయింది. మామిడి గొంది నుంచి తోటగొంది వరకు 800 మీటర్ల పొడవునా జంటసొరంగాల తవ్వకం పూర్తయింది. లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. బండ్ 1, బండ్ 2 : తోటగొంది సమీపంలో ఆఫ్‌టెక్ రెగ్యులేటర్‌ను ఆనుకుని నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆఫ్‌టేక్ రెగ్యులేటర్ : తోటగొంది వద్ద జీరో పాయింట్‌లో ఓటి రెగ్యులేటర్ నిర్మాణం పూర్తి చేసి ఏడు గేట్లు పెట్టారు. దీనికి ఆనుకునే బండ్ 1 పని జరుగుతోంది.

కార్యాచరణకు పక్కా ప్రణాళిక : పోలవరం ఎస్ఈ వీ.ఎస్ రమేష్‌బాబు

కాంక్రీట్, మట్టి పనులకు సంబంధించి టెండర్లు ఖరారైన తర్వాత కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తాం. నిర్దేశిత గడువు లోగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేలా ముందుకు సాగుతున్నాం.

ఇప్పటి వరకు 30 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టు అనుబంధ పనుల్లో భాగంగా జంట సొరంగాలకు సంబంధించి లైనింగ్‌కు అవసరమైన సెంట్రింగ్ సామగ్రి హైదరాబాద్‌లో తయారవుతోంది. ఎనిమిది నెలల్లో లైనింగ్ పూర్తి చేసి అప్పగిస్తామని గుత్తేదారు చెబుతున్నారు.

ఏపీకి ప్రత్యేక హొదా చర్చలోనే లేదు

విశాఖ ఎంపీ హరిబాబు



విశాఖపట్నం,సూర్యబ్యూరో: ఏపీకి ప్రత్యేక హోదా చర్చలోనే లేదని విశాఖ బీజేపీ ఎంపీ హరిబాబు స్పష్టం చేశారు. హోదాకు ఏ మాత్రం తగ్గకుండా ప్రత్యేక ప్యాకేజీ ఉంటుందని అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక రైల్వే జోన్ కేంద్ర పరిశీలనలో ఉందని, దానిపై త్వరలోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకారం రాష్ట్రానికి ఏ విధంగా సహాయం చేయాలని నిర్ణయం జరిగిందో అందులో ప్రత్యేక హోదా ఉంటే, రాష్ట్రానికి ఏ విధమైన ఆర్థిక వెసులుబాటు ఉండేదో అది లెక్కించి, దానికి ఒక్క రూపాయి కూడా తగ్గకుండా కేంద్రం ఆర్థిక సహాయం చేయాలనే నిర్ణయం జరిగిందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయాన్ని ఇవ్వాలని తాము కోరామని, ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీని కూడా కలిశామని హరిబాబు స్పష్టం చేశారు.

కోడి పందాలపై సుప్రీంకోర్టుఆశ్రయించిన

బీజేపీ నేతరఘురామకృష్ణం రాజు



న్యూఢిల్లీ,సూర్యబ్యూరో: సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడిపందాలపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఓవైపు కోడి పందాలు ఆడేందుకు పందెంరాయుల్లు ఏర్పాట్లు చేసుకుంటుంటే మరోవైపు కోడిపందాలు నిర్వహించొద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో కోడిపందాలపై బీజేపీ నేత రఘు రామకృష్ణంరాజు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కోడి పందాలు నిర్వహించొద్దన్న హైకోర్టు ఉత్తర్వులపై రఘురామకృష్ణంరాజు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు గోదావరి జిల్లాల్లో కోడి పందాల సందడి ఇప్పటికే మొదలైన విషయం తెలిసిందే.

రాహుల్‌కు ధన్యవాదాలు తెలిపిన ఉత్తమ్



హైదరాబాద్, మేజర్‌న్యూస్: పీసీసీ చీఫ్‌గా రెండోసారి కొనసాగించాలని నిర్ణయించిన రాహుల్‌గాంధీకి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ నాయకత్వంలో కేంద్రంలోనూ అధికారంలోకి వస్తామని, కాంగ్రెస్ పార్టీలో కష్టపడేవారికి సముచితస్థానం ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తనకు ఫోన్ చేయాలని ఉత్తమ్ కోరారు.

పీసీసీ చీఫ్ ఆశించింది వాస్తవమే: కోమటిరెడ్డి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: తాను తెలంగాణ పీసీసీ పీఠాన్ని ఆశించింది వాస్తవమేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నా...ఎవరున్నా అందరం కలిసి పని చేస్తామని చెప్పారు. తలాకొన్ని నియోజక వర్గాలు పంచుకుని కాంగ్రెస్‌ను గెలిపిస్తామని, పాదయాత్ర, బస్సుయాత్ర ఏదైనా.. అధిష్టానం సూచనల మేరకు నడుచుకుంటామని ఆయన పేర్కొన్నారు. రైతులు 12 గంటల విద్యుత్ చాలంటున్నారని, 24 గంటల కరెంట్ వల్ల భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయని కోమటిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణ పీసీసీ పదవిపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి పోటీ పడుతున్నారని వార్తలు వచ్చాయి. ఆయనతో పాటుగా మాజీ మంత్రి డీకే అరుణ కూడా పీసీసీ రేస్‌లో ఉన్నారని ప్రచారం జరిగింది. ఈ ప్రచారాలకు తెరదీస్తూ టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డిని కొనసాగించాలని కాంగ్రెస్ అధిష్ఠానవర్గం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది పేరుతో ఒక ప్రకటన వెలువడింది. రాహుల్ గాంధీ ఏఐసీసీ అధ్యక్షుడు అయిన తర్వాత వివిధ రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులను మారుస్తారని ఊహాగానాలు వచ్చాయి. అయితే వాటికి తెరదించుతూ టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌నే కొనసాగిస్తూ రాహుల్ నిర్ణయం తీసుకున్నారు.

నిరుద్యోగుల్లో అసహనం నెలకొంది

సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి

విజయవాడ,సూర్యప్రతినిధి: ధరల పెరుగుదలతో ప్రజానీకంపై పెనుభారం మోస్తోందని సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగుల్లో అసహనం నెలకొందని, బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందన్నారు. నల్లధనాన్ని వెనక్కి తీసుకురావాలని బీజేపీకి లేదని, దళితులు, జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని సురవరం ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో సీపీఐ జాతీయ సమితి సమావేశాలు నిర్వహించారు.

కేసీఆర్ దళితుల వ్యతిరేకి: జగ్గారెడ్డి

హైదరాబాద్, మేజర్‌న్యూస్: కేసీఆర్ దళితుల వ్యతిరేకి అని కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఆరోపించారు. సోమవారం ఉదయం చంచల్‌గూడ జైల్లో మందకృష్ణను జగ్గారెడ్డి కలిసారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్‌లో మాదిగనేతలు మౌనం వీడాలన్నారు. మందకృష్ణ వల్లే మాదగ నాయకులకు అన్ని పార్టీల్లో సముచిత స్థానం దక్కిందని జగ్గారెడ్డి గుర్తుచేశారు. హక్కుల కోసం ప్రజాస్వామ్యబద్దంగా నిరసన తెలిపే హక్కు లేదా..? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో కేసీఆర్ నియంత పాలనకు ప్రజలు చరమగీతం పాడతారని జగ్గారెడ్డి తెలిపారు.

గాంధీ ఆసుపతిత్రికి గవర్నర్ నరసింహన్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ మరోసారి గాంధీ ఆస్పత్రికి వచ్చారు. ఈఎన్‌టీ వైద్య పరీక్షల నిమిత్తం ఆయన సోమవారం గాంధీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు గాంధీ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం గవర్నర్ ఐసీయూను సందర్శించి, అక్కడ రోగులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కాగా గత ఏడాదిలో కూడా గాంధీకి వచ్చిన నరసింహన్ కాలికి ఆనె(కార్)తో రావడంతో ఆపరేషన్ చేయించుకున్న విషయం విధితమే!.

సైన్స్ ఫేయిర్ల నిర్వహణకు నిధులు పెంచాలి

రాష్ట్రంలో శాస్త్ర పరిశోధనను ప్రొత్సహిస్తున్నాం : డిప్యూటీ సీఎం కడియం



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో శాస్త్ర పరిశోధనను ప్రోత్సహిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. సైన్స్ ఫెయిర్లు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక, పరిశోధనల పట్ల చిన్ననాటి నుంచే ఆసక్తి పెరుగుతుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం పరిశోధనలను ప్రోత్సహించడానికి, సైన్స్ ఫెయిర్లు నిర్వహించడానికి నిధులు ఎక్కువగా కేటాయించాలని కోరారు. శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించకుండా దేశం ముందంజ వేయలేదని, ప్రపంచంలో నెంబర్ వన్ స్థానానికి రాలేమని అన్నారు. సికింద్రాబాద్, సెయింట్ పాట్రిక్ స్కూల్ లో సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్-2018 ని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, హోంశాఖ మంత్రి నాయిని నర్సింహ్మరెడ్డి, సికింద్రాబాద్ ఎంపీ, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, స్థానిక ఎమ్మెల్యే సాయన్నలతో కలిసి ప్రారంభించారు.

ముఖ్యమంత్రి కేసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాకముందు ఇక్కడ 296 గురుకులాలు ఉంటే...తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ మూడేళ్లలో 544 గురుకులాలను ఏర్పాటు చేసుకున్నామన్నారు. వీటితో పాటు 475 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ), 194 మోడల్ స్కూళ్లు ఉన్నాయన్నారు. వీటి ద్వారా రాష్ట్రంలో 8 లక్షల మందికి నాణ్యమైన విద్య అందుతోందన్నారు. దేశంలో ఎక్కడా కూడా ఇన్ని గురుకులాలు లేవన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 58 లక్షల మంది విద్యార్థులుండగా 28 లక్షల మంది ప్రభుత్వ విద్యాలయాల్లో, 30 లక్షల మంది ప్రైవేట్ విద్యాలయాల్లో ఉన్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సగటు ప్రతి లక్ష మందికి 59 విద్యాలయాలు అందుబాటులో ఉండగా, దేశ సగటు ప్రతి లక్ష మందికి 29 విద్యాలయాలే అందుబాటులో ఉన్నాయన్నారు. మొత్తానికి ప్రస్తుతం దేశంలో అత్యంత నాణ్యమైన విద్య తెలంగాణలో అందుతుందన్నారు. విద్యార్థులు కూడా తమ పరిశోధనల ద్వారా మానవాళి అభివృద్ధికి పాటుపడేలా కష్టపడాలన్నారు. విద్యావకాశాలు, వసతులు ఎలా ఉన్నా గొప్ప స్థాయికి ఎదగాల న్నారు. అత్యంత పేద కుటుంబంలో పుట్టి చాలా కష్టపడి చదువుకుని, మిస్సైల్ మ్యాన్ గా ఎదిగి, ఆ తర్వాత ఈ దేశానికి రాష్ట్రపతి అయిన డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు కూడా అబ్దుల్ కలాం మాదిరిగా కష్టపడి ఉన్నత స్థాయికి రావాలని పిలుపునిచ్చారు. దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాల నుంచి ఈ సైన్స్ ఫెయిర్‌కు వచ్చిన విద్యార్థులు చారిత్రక హైదరాబాద్ నగరంలో అనేక పర్యాటక ప్రదేశాలు చూడాలని, ఇందుకోసం విద్యాశాఖ తరపున టూర్ ఏర్పాటు చేస్తామని శ్రీహరి చెప్పారు. దేశంలో అత్యంత పిన్న వయస్సున్న రాష్ట్రం తెలంగాణ అయితే ఎంతో ఘన చరిత్ర ఉన్న నగరం హైదరాబాద్ అని, ఇక్కడ అనేక పరిశోధనా కేంద్రాలు, ఖ్యాతిగాంచిన విద్యాలయాలు ఉన్నాయన్నారు. అంతే కాకుండా తెలంగాణ రాష్ట్రం దేశంలో అత్యంత వేగంగా అభివృాఎద్ధి చెందుతున్న రాష్ట్రమని, జీడీపీలో, ఈజ్ ఆఫ్ డూయింగ్ లో, ఐటి ఎగుమతులు, సంక్షేమ పథకాల అమలులో ప్రథమ స్థానంలో ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ ఐదు రోజులు సైన్స్ ఫెయిర్ లో తమ ప్రతిభను చాటాలని, హైదరాబాద్ నగరాన్ని ఆస్వాదించాలని అన్నారు. సైన్స్ ఫెయిర్ లో ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థినులను మెమెంటోలతో సత్కరించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రయోగశాలలను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శేషుకుమారి, మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ విద్యాసాగర్ రావుతో లక్ష్మణ్ బృందం భేటీ

మేడారం జాతరకు రావాల్సిందిగా వినతి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ బృందం సోమవారం మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్ రావును కలిసింది. ఈ సందర్భంగా వచ్చే మేడారం సమ్మక్క-సారక్క జాతరకు రాష్ట్ర సరిహద్దు రాష్ట్రాల సీఎంలు, గవర్నర్‌లను ఆహ్వానిచండంలో భాగంగా డాక్టర్ లక్ష్మణ్ బృందం గవర్నర్ విద్యాసాగర్ రావును జాతరకు రావాలని కోరారు. దీనికి గవర్నర్ సానుకూలత వ్యక్తం చేశారు. ఈ బృందంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.రాజేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, వన్నాల శ్రీరాములు, అమర్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సూర్య
హైదరాబాద్
మంగళవారం
9 జనవరి 2018

సంపాదకీయం

editpage@suryaa.com

"నాగపూర్‌లో ఒక సైంటిస్ట్ పునర్వినియోగించదగిన విత్తన రకాన్ని సృష్టించారు. హైబ్రిడ్ విత్తనాలను తిరిగి వినియోగించలేం. భారతీయ సైంటిస్ట్ రూపొందించిన విత్తనాన్ని ప్రభుత్వం ఇంకా సద్వినియోగం చేసుకోలేకపోయింది. బహుళ జాతి సంస్థ ఒకటి విక్రయించే బిటి పత్తి విత్తనంపైనే ప్రభుత్వం ఇప్పటికీ ఆధారపడుతోంది. ఇది ఇలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సమర్పించే తుది పూర్తి బడ్జెట్ ఇదే కావచ్చు. ఈ కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఇది వరకే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి పరిశీలించవలసి ఉంటుంది. వివిధ దేశాలలో ఉన్నత ఆర్థిక వృద్ధి దశలలో కానవచ్చే ఉమ్మడి సూత్రం నియంత్రణ వ్యవస్థ స్థిరంగా ఉండడం. రిస్కులు తీసుకోవడానికి, ప్రతిఫలాలు అందుకోవడానికి ఇది ఆర్థిక ఏజెంట్లకు కావలసిన వెసులుబాటు కల్పించింది. మోడీ ప్రభుత్వం తుది పూర్తి బడ్జెట్ సమర్పించనున్న సందర్భంగా ఈ అంశాన్ని విస్మరించరాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి గడచిపోయిన సంవత్సరం ఒక విధంగా ఆందోళన కలిగించింది. కలవరం రేపిన వాటిలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రెండు సంస్కరణలు కూడా ఉన్నాయి. ఆ సంస్కరణలలో ఒకటి ఇంతకు ముందే ప్రస్తావించుకున్నదైన జిఎస్‌టి కాగా రెండవది దివాలా నిబంధనావళి. తీవ్ర ప్రభావం చూపగల ఆ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ ఇంకా కుదురుకోవలసి ఉన్నది. కాగా, 2018 బడ్జెట్‌లో మరిన్ని అవరోధాలకు తావు ఇవ్వరాదు. ఆర్థిక పరిస్థితిని పటిష్ఠం చేయడంపైనే దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది."

బడ్జెట్ కత్తి మీద సామే

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు వెల్లడయ్యాయి. సాధారణ బడ్జెట్ ప్రతిపాదన తేదీని కూడా ప్రభుత్వం ప్రకటించింది. బడ్జెట్ కోసం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి అరుణ జైట్లీ ఆధ్వర్యంలో సంప్రదింపులు కూడా ఇది వరకే ప్రారంభమయ్యాయి. అయితే, బడ్జెట్ ప్రతిపాదనల తయారీ మంత్రి జైట్లీకి బృహత్తర బాధ్యతే కాగలదు. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) వృద్ధి 6.5 శాతంగా ఉండవచ్చని సూచిస్తున్నారు. ఇది నాలుగు సంవత్సరాలలోనే అత్యల్పం. క్రితం సంవత్సరం జిడిపి వృద్ధి స్థాయి 7.1గా ఉన్నది. జిడిపి వృద్ధి రేటు పతనం ప్రభుత్వ స్వయంకృతాపరాధమేనని విశ్లేషకులు కొంత మంది అభిప్రాయం. ప్రభుత్వం పెద్ద నోట్ల చలామణీని రద్దు చేయడం, చాలా హడావిడిగా లోపభూయిష్ట వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ని ప్రవేశపెట్టడం అనే రెండు ఘోర వైఫల్యాలుగా పరిణమించాయన్నది గమనార్హం. ఆర్థికపరమైన ఈ దుస్సాహస చర్య అప్పటికే మందగమనంతో ఉన్న ఆర్థిక వ్యవస్థను సెప్టెంబర్ త్రైమాసికంలో 5.7 శాతానికి దిగజార్చింది. నగదు ఆధారంగా సాగుతుండే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పెద్ద నోట్ల చలామణీ రద్దు అనంతరం స్తంభించిపోయింది. ప్రధానంగా ఉపాధి కల్పన రంగాలైన, ముఖ్యంగా నగదుపై ఆధారపడే చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా స్తంభించిపోయాయి. ఈ దుస్సాహస క్రియ కొద్దో గొప్పో పాత్ర పోషించిన ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీయే ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పుడు ఆర్థిక వ్యవస్థ నష్టాన్ని భర్తీ చేయవలసి ఉండడం విచిత్రం. ఆయన ఇలా చేయవలసి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. గ్రామీణ ప్రాంతాలలో, ముఖ్యంగా వ్యవసాయ రంగం దుస్థితిలో ఉండడం వంటి వ్యతిరేక పరిస్థితుల మధ్య బడ్జెట్‌ను ప్రతిపాదించవలసి రావడం జైట్లీకి బృహత్ బాధ్యతే. గ్రామీణ ప్రాంతాలలో రైతులకు వారి పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. అంతే కాదు. ప్రైవేట్, ప్రభుత్వ రంగాలలో పెట్టుబడుల స్థాయి తక్కువగా ఉన్నది. పలు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. బడ్జెట్‌లో నిర్దేశించుకున్న వ్యయం లక్ష్యం శ్రుతి మించిపోకుండా నివారించడానికి ప్రభుత్వం తన ఖర్చును తగ్గించుకోవలసి వచ్చింది. అయితే, అదనపు వ్యయం కోసం రూ. 50 వేల కోట్ల మేరకు రుణం సేకరించే అవకాశం ఉందనే ప్రభుత్వ ప్రకటనతో ఈ చర్యకు గండి పడే ప్రమాదం ఉన్నది. ప్రజానీకం నిరసనలను పరిహరించేందుకు జిఎస్‌టి కింద ధరలలో రాయితీలు ప్రకటించవలసి వచ్చినందున ప్రభుత్వ రెవెన్యూలకు నష్టం వాటిల్లింది. ద్రవ్య లోటు లక్ష్యాన్ని అదుపులో ఉంచాలని నిశ్చయించుకున్న పక్షంలో జైట్లీ గణాంకాల విషయంలో చాలా ప్రయాస పడవలసి ఉంటుంది.

ఇంకా కచ్చితంగా చెప్పాలంటే ఈ సూచిత మాంద్యానికి ప్రాతిపదిక గడచిన ఏడెనిమిది మాసాలకు సంబంధించిన డేటా. పెద్ద నోట్ల చలామణీ రద్దు దుష్ప్రభావం అంతరించడం, జిఎస్‌టి సంక్లిష్టతలు తొలగిపోవడం ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో జరగవచ్చు కనుక అప్పటికి ఆర్థిక వ్యవస్థ పుంజుకుని ఏడు శాతం వృద్ధి రేటు నమోదు అవుతుందని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ప్రైవేట్ పెట్టుబడులు సైతం పుంజుకుంటున్నాయి. ఈ పెట్టుబడులు క్రితం సంవత్సరం స్థాయికి దాదాపు రెండింతలు అయినట్లు ఆర్థిక వ్యవహారాల విభాగం కార్యదర్శి వెల్లడించారు. వ్యాపార సౌలభ్యాన్ని పెంచడం ద్వారా ప్రైవేట్ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం, వ్యవసాయ పునరుజ్జీవంపై దృష్టి కేంద్రకరించడం వంటి సకారాత్మక చర్యలను జైట్లీ తీసుకోవలసి ఉంటుంది. వ్యవసాయం విషయంలో పరిస్థితులు రుతుపవనాలపై ఎక్కువగా ఆధారపడి ఉంటుండగా సాగును ఆధునికీకరించేందుకు ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఇవ్వవలసిన అగత్యం ఉన్నది. బిందు సేద్యాన్ని ప్రోత్సహించేందుకు కూడా ప్రభుత్వం పూనుకోవడం అవసరం. నీరు అధికంగా అవసరమయ్యే వరి పంటలను కనీస నీటితో సాగు చేయడం వంటి వినూత్న ప్రక్రియలతో విజయం సాధించిన వర్ధమాన ఆర్థిక వ్యవస్థల నుంచి ఆ విధానాల గురించి ప్రభుత్వం తెలుసుకోవచ్చు. మన దేశానికి చెందిన సైంటిస్టులు కొందరు ఆధునిక సాగు పద్ధతులు పెక్కింటిని రూపొందించారు. ఇందుకు ఒక ఉదాహరణ నాగపూర్‌లో ఒక సైంటిస్ట్ పునర్వినియోగించదగిన విత్తన రకాన్ని సృష్టించారు. హైబ్రిడ్ విత్తనాలను తిరిగి వినియోగించలేం. భారతీయ సైంటిస్ట్ రూపొందించిన విత్తనాన్ని ప్రభుత్వం ఇంకా సద్వినియోగం చేసుకోలేకపోయింది. బహుళ జాతి సంస్థ ఒకటి విక్రయించే బిటి పత్తి విత్తనంపైనే ప్రభుత్వం ఇప్పటికీ ఆధారపడుతోంది. ఇది ఇలా ఉండగా, ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సమర్పించే తుది పూర్తి బడ్జెట్ ఇదే కావచ్చు. ఈ కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఇది వరకే ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్థిక వ్యవస్థ స్థితిగతుల గురించి పరిశీలించవలసి ఉంటుంది. వివిధ దేశాలలో ఉన్నత ఆర్థిక వృద్ధి దశలలో కానవచ్చే ఉమ్మడి సూత్రం నియంత్రణ వ్యవస్థ స్థిరంగా ఉండడం. రిస్కులు తీసుకోవడానికి, ప్రతిఫలాలు అందుకోవడానికి ఇది ఆర్థిక ఏజెంట్లకు కావలసిన వెసులుబాటు కల్పించింది. మోడీ ప్రభుత్వం తుది పూర్తి బడ్జెట్ సమర్పించనున్న సందర్భంగా ఈ అంశాన్ని విస్మరించరాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి గడచిపోయిన సంవత్సరం ఒక విధంగా ఆందోళన కలిగించింది. కలవరం రేపిన వాటిలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రెండు సంస్కరణలు కూడా ఉన్నాయి. ఆ సంస్కరణలలో ఒకటి ఇంతకు ముందే ప్రస్తావించుకున్నదైన జిఎస్‌టి కాగా రెండవది దివాలా నిబంధనావళి. తీవ్ర ప్రభావం చూపగల ఆ సంస్కరణలతో ఆర్థిక వ్యవస్థ ఇంకా కుదురుకోవలసి ఉన్నది. కాగా, 2018 బడ్జెట్‌లో మరిన్ని అవరోధాలకు తావు ఇవ్వరాదు. ఆర్థిక పరిస్థితిని పటిష్ఠం చేయడంపైనే దృష్టిని కేంద్రీకరించవలసి ఉంటుంది. వస్తు సేవల పన్ను విధానాన్ని దేశంలో ప్రవేశపెట్టిన అనంతరం పరోక్ష పన్నులలో చాలా వాటిని కేంద్రం నియంత్రణలో నుంచి తప్పించడం వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ప్రత్యక్ష పన్నుల జోలికి ప్రభుత్వం వెళుతుందేమోననే ఆందోళన వివిధ వర్గాలలో కనిపిస్తోంది. జిఎస్‌టి అమలులోకి వచ్చిన తరువాత రెవెన్యూ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవన్నది ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. తన రెవెన్యూను పెంచుకోవడం లక్ష్యంగా పన్నులు పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టుకోరాదు. అటువంటి విధానం ఆర్థిక వ్యవస్థకు అవసరం కూడా.

మైనారిటీ ఓట్లపై తలాక్ బిల్లుతో బిజెపి గురి

ఎం.వి.ఎస్. సత్య, హైదరాబాద్ –833011972

- కమలనాథుల యత్నాలు అడ్డుకునేలా కాంగ్రెస్
- బిల్లులో లోపాలు సరిదిద్దాల్సిందేనంటూ పట్టు
- సుప్రీం ఆదేశాల అమలుకు ప్రభుత్వం సంసిద్ధం
- భరణంపై బిల్లులో స్పష్టత కరువన్న ముస్లిం వర్గాలు
- రాజీవ్ తెచ్చి న షాబానో చట్టం రద్దు లేకుంటే ఎలా?



ఇస్లామిక్ దేశాల్లో సైతం 'ట్రిపుల్ తలాక్'పై నిషేధం వున్నా, మన దేశంలో మాత్రం 'ట్రిపుల్ తలాక్' అనేది మత విశ్వాసంలా చెలామణీలో వుంది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని, చాలా తేలిగ్గా 'ట్రిపుల్ తలాక్' చెప్పేసి, ముస్లిం సమాజంలో భర్తలు, భార్యలకు విడాకులు ఇచ్చేస్తుం డ డంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ, సర్వోన్నత న్యాయస్థానం 'ట్రిపుల్ తలాక్' చెల్లదని తేల్చేసింది. అయితే, ఆరు నెలలపాటు తమ తీర్పు అమల్లో వుంటుందనీ, ఈలోగా కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్ తలాక్‌పై చట్టం చెయ్యాలని ఆదేశించింది. ట్రిపుల్ తలాక్‌కి సంబంధించి గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా చట్టం జరగ నుండడమే తరువాయి.! ఇటు లోక్‌సభలో, అటు రాజ్యసభలో పూర్తిస్థాయి మెజార్టీ ఎన్డీయే ప్రభుత్వానికి వుంది గనుక, ట్రిపుల్ తలాక్‌కి వ్యతిరేకంగా చట్టం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సర్వసన్నాహం అయ్యింది. ఇరు సభలలోనూ మెజార్టీతో అనుకున్నదే తడవుగా గట్టెక్కించే పనిలో పడింది. అది చాలా తేలిగ్గానే ఆమోదం పొందుతుందన్న దీమా కేంద్ర పెద్దలలో అనుఎఇువునా కనిపిస్తోంది. కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ట్రిపుల్ తలాక్ బిల్లును న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్ సభ్యుల ఆందోళన కారణంగా ఆలస్యమైంది. తక్షణ ట్రిపుల్ తలాఖ్ విషయంలో ముస్లిం మహిళలకు చట్టపరంగా లబ్ధి చేకూర్చనున్న ఈ బిల్లుని ఎలాగైనా ఆమోదింపచేసుకోవాలని బీజేపీ భావిస్తోంటే, ఈ బిల్లు విషయంలో కాంగ్రెస్ ఒకింత అయోమయంలో వున్నా... పలు సవరణలకు డిమాండ్ చేస్తోంది. రాజ్యసభలో అధిక మెజార్టీ కలిగి వున్నప్పటికీ ప్రతిపక్షం ఈ బిల్లుని అడ్డుకుంటే ముస్లిం మహిళా వర్గాల్లో కాంగ్రెస్ పార్టీపై ఎక్కడ వ్యతిరేకత వ్యక్తమవుతుం దోనన్న ఆ పార్టీ వర్గాలలో ఆందోళన చెందుతున్నా అనుకున్నట్లే విపక్ష నేతలు సమావేశాలలో దానిని అడ్డుకున్నారు.

బిజెపి ఎత్తు...

ఇన్నాళ్లు కాంగ్రెస్ వెంట నడచిని ముస్లిం ఓట్లలో ముఖ్యంగా మహిళల ఓట్లను అందుకునేందుకు బిజెపి వ్యూహాన్ని రచించింది. ఇందుకు సుప్రీం తలాక్ విషయమై ఇచ్చిన ఆదేశాలు తనకు అనుకూలంగా మార్చుకుంది. ఇరు సభలలో వెంటనే బిల్లుకు ఓకే చెప్పినా, బిల్లును అడ్డుకున్నా తనకే మేలు జరిగేలా బిల్లునిపై వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుండటంతో బిల్లుని అడ్డుకునేందుకు ప్రతిపక్షం ఏ ప్రయత్నం చేయలేదనే అపవాదుతోపాటు బిల్లుని పాస్ చేయించుకున్న ఘనత బీజేపీ సొంతం కావాలన్నది ఎత్తుగడ దీంతో కాంగ్రెస్ బిల్లుకు పలు సవరణలు సూచించించి నిలదీత ప్రారంభించింది. లోక్‌సభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందిన బిల్లుని రాజ్యసభలోనూఆమోదింప చేసేందుకు అవసరమైన మెజార్టీని ఎట్టిపక్షంలోనూ కోల్పోకూడదు అని భావిస్తోంది బిజెపి.

బిల్లుకు ఓకే కానీ సవరణలకు పట్టు

ఈ నేపథ్యంలో రాజ్యసభ ప్రధాన ప్రతిపక్ష నేత అయిన గులాం నబీ ఆజాద్ ఇవాళ ఉదయమే పార్లమెంట్‌లోని తన చాంబర్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలతో భేటీ అయ్యారు. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీ నేతలతోపాటు సభలో సభ్యత్వం కలిగి వున్న ఇతర పార్టీల నేతలని సైతం ఆజాద్ ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లులో కొన్ని సవరణలకి పట్టుపట్టేలా తమ వ్యూహాన్ని ఖరారు చేసుకున్నారు. దీంతో బిల్లును రాజ్యసభలో ప్రవేశ పెట్టబడిన ట్రిపుల్ తలాక్ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని కాంగ్రెస్ పార్టీ నేత ఆనంద్శర్మ రాజ్యసభలో మోషన్ ఇచ్చారు. అయితే, ఈ బిల్లును ఎందుకు సెలక్ట్ కమిటీకి ఇవ్వకూడదనే విషయంపై కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వివరణ ఇచ్చుకున్నా, సెలక్ట్ కమిటీకి బిల్లు ఇవ్వడంతో సమయం వృదా అవుతుందని, కనీసం ఆరు నెలలు గడిపోతాయని సభకు తెలియజేసినా కాంగ్రెస్ మాత్రం తమడిమాండ్ నుంచి వెనక్కి తగ్గలేదు. దీంతో ఈ బిల్లు ప్రస్తుతం అత్యవసరంగా ఆమోదించాల్సిన బిల్లు అని, సుప్రీంకోర్టు ఆందోళన కూడా ఇదే విషయాన్ని తెలియజేస్తుందని,. అత్యవసర పరిస్థితుల క్రమంలోనే బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించడం సాధ్యం కాదని జూట్లి స్పష్టం చేస్తూ, ఈ బిల్లుకు ఎవరు మద్దతు ఇస్తున్నారో ఎవరూ ఇవ్వడం లేదో మొత్తం భారతదేశం చూస్తోందని కాంగ్రెస్ వ్యవహారశైలిని నిలదీసినా నేతలు మాత్రం తాము వెనక్కి తగ్గేందుకు ససేమిరా అనడం గమనార్హం. నిజానికి ఎగువ సభలో చర్చ సమయంలోనే విపక్షాలు తమ అనుమానాలు వ్యక్తం చేసి దీన్ని సంస్కరించేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. వాస్తవానికి బిల్లులో అనేక అంశాలపై స్పష్టత లేకపోవటంతో తలాక్– ఎ–బిద్దత్ (తక్షణ ముమ్మారు తలాక్)పై నిషేధం వల్ల ముస్లిం కుటుం బాలకు నష్టమే తప్ప ప్రయోజనం ఉండదన్నది ముస్లిం వర్గాలు సైతం భావిస్తున్నాయి. ఈ బిల్లును యధాతథంగా ఆమోదిస్తే.. తక్షణ ముమ్మారు తలాక్ చెల్లదంటూనే అది అమలులోకి తీసుకువచ్చినట్లు భావించాల్సి వస్తుందని, ఈ అంశం బిల్లులోని అతిపెద్ద తప్పి దంగా ఆ వర్గాలు చెపుతున్నాయి. ముమ్మారు తలాక్ శిక్షార్హనేరం. అంటే– అరెస్టు చేయడానికి వారంట్ అవసరం లేదు. పైగా ముస్లిం మహిళే ఫిర్యాదు చేయాలన్న నిబంధన లేకపోవటం విడ్డూరంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ముస్లిం భర్తపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. దాని ఆధారంగా పోలీసులు అరెస్టు కూడా చేయొచ్చు. ఈ విషయంలో తాజాబిల్లు పూర్తి ఏకపక్షంగా ఉండటంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇది దుర్వినియోగానికి దారి తీసే ఆస్కారం ఉందన్న భావన వ్యక్త మవుతోంది.

ఇక తలక్‌తో భార్యకు విడాకులిచ్చే భర్త ఆమెకు భరణం చెల్లించాల్సి ఉంటుందని ఈ బిల్లు ప్రతిపాదనలలో ఒకటి. కానీ, ఇతరత్రా పద్ధతుల్లో విడాకులిస్తే భరణం సంగతిని అందులో ప్రస్తావించక పోవటం గమనార్హం. ప్రధానంగా ఓ ముస్లిం మహిళ కోర్టుద్వారా విడాకులు పొందితే భరణం సంగతి బిల్లులో లేవు. గురించి వివరించలేదు. పైగా ఇలా విడాకులు పొందితే భరణం కోరే హక్కు ఉండదని రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నవుడు 1986లో తెచ్చిన షాబానో చట్టం పేర్కొంటోంది. కనీసం దీన్ని రద్దుచేసే ప్రస్తావన కూడా తాజా బిల్లులో లేదు. అంతే కాకుండా బిల్లులోని అనేక అంశాలపై కొన్ని సమంజస సందేహా లున్నాయి. తలాక్ చెప్పిన వ్యక్తి రూ.60 వేలు ఆర్జిస్తున్నాడనుకుంటే ఆయన భార్య ఉద్యోగం లేదా మరేదైనా పని చేస్తున్నట్లయితే ఆమెకు భరణం హేతు బద్ధమేనా అన్న ప్రశ్న తలెత్తు తుంది. ఒకవేళ ఆమె భరణం కోరినా– రాజ్యాంగ నిబంధన 14 ప్రకారం సమానత్వ ప్రాథమిక హక్కు కింద దాన్ని సవాలుచేసే వీలుంది. హిందూ వివాహ చట్టం కింద ఇటువంటి ఉదంతంలో విద్యాధికు రాలైన భార్యకు భరణాన్ని కోర్టులు నిరాకరించాయి. అంతేకాదు. భర్త నిరుద్యోగిగా ఉండి, భార్య ఉద్యోగి అయిన పరిస్థితుల్లో ఆమె చేతనే భరణం ఇప్పించేలా ఆదేశాలిచ్చిన ఉదాహరణలూ ఉన్నాయి. వీటినే కాంగ్రెస్ నేత లు లేవనెత్తుతున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కపిల్ సిబల్ మాట్లా డుతూ ట్రిపుల్ తలాక్ బిల్లు విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు గురించి సభలో న్యాయశాఖ మంత్రి చెప్పిందంతా కూడా సరికాదన్నారు. ఈ బిల్లు కచ్చితంగా సెలక్ట్ కమిటీకి పంపించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ బిల్లుపై కాంగ్రెస్ పలు ప్రశ్నలను లేవనెత్తింది. తలాక్ చెప్పిన భర్తను జైల్లో పెడితే.. మరి బాధితురాలికి భరణం ఎవరిస్తారని కాంగ్రెస్ ప్రశ్నించింది. ఈ బిల్లును తప్పకుండా పార్లమెంటరీ కమిటీకి పంపించాల్సిందేనని విపక్ష నేతలు డిమాండ్ చేశారు.దీనిపై స్పందించిన కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ కాంగ్రెస్ నేతల వైఖరిని దుయ్యబట్టారు. విపక్ష నేతలు ద్వందవైఖరిని అనుసరిస్తున్నారని మండిఎద్దారు. లోక్‌సభలో మద్దతిచ్చారు.. మరి రాజ్యసభలో ఎందుకు మద్దతివ్వడం లేదని జైట్లీ ప్రశ్నించారు.

ఇక, ట్రిపుల్ తలాక్ సర్వోన్నత న్యాయస్థానం తీర్పుని ముస్లిం మహిళా సమాజం స్వాగతిస్తోంది. కొంతమంది మత పెద్దలు సైతం, తలాక్ విషయంలో సుప్రీం తీర్పుతో ఏకీభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో తలాక్ బిల్లుతో పాటు ముస్లింలలో బహుభార్యత్వంపైనా సుప్రీంకోర్టులో కేసులు నమోదై వున్నాయి. వాటన్నిటిపైనా త్వరలో విచారణ జరగనుంది. మరి కాంగ్రెస్ నుంచి మైనార్టీ ఓటు బ్యాంకు బీజేపీకి అందని ద్రాక్షే.. అన్న వాదన ఇకపై విన్పించకపోవచ్చేమో.!

చరిత్రలో ఈరోజు

జనవరి 9

జననాలు

1922: నోబెల్ బహుమతి గ్రహీత హరగోవింద్ ఖురానా.

1965: వెస్టిండీస్ మాజీ క్రికెట్ క్రీడాకారుడు జిమ్మీ ఆడమ్స్.

1985: మిట్టపల్లి సురేందర్, తెలుగు జానపద, సినీ గీతరచయిత.

సంఘటనలు

1969: మొదటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమము ప్రారంభమైనది.

1982: భారత శాస్త్రవేత్తల బృందం మొదటిసారి అంటార్కిటికాను చేరింది.

2009: ప్రపంచ తెలుగు సమాఖ్య 8వ ద్వైవార్షిక సమావేశాలు విజయవాడలో ప్రారంభమయ్యాయి.

జిమ్మీ ఆడమ్స్

1968, జనవరి 9న జన్మించిన జిమ్మీ ఆడమ్స్ వెస్ట్ ఇండీస్‌కు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు మరియు కెప్టెన్. ఎడమచేతి బ్యాటింగ్ మరియు ఎడమచేతితో బౌలింగ్ చేయగల ఆడమ్స్ మంచి ఫీల్డర్ కూడా. అవసమైనప్పుడు వికెట్ కీపర్ విధులను కూడా నిర్వర్తించాడు. 1992లో దక్షిణాఫ్రికాపై బ్రిడ్జిటౌన్లో తొలి టెస్ట్ ఆడాడు. ఆడమ్స్ టెస్టులలో ఆరంగేట్రం చేసిన వెంటనే తన ప్రతిభను చూపడం ప్రారంభించాడు. తన తొలి 12 టెస్టులలోనే 87 సగటుతో 1132 పరుగులు సాధించాడు. ఇలాంటి రికార్డు ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం డొనాల్డ్ బ్రాడ్‌మెన్‌కు తప్ప ఎవరికీ లేకపోవడం విశేషం. 2000లో బ్రియాన్ లారా నుంచి వెస్టిండీస్ నాయకత్వ బాధ్యతలు స్వీకరించాడు. 1992 నుంచి 2001 వరకు మొత్తం 54 టెస్టులు ఆడి 41.26 సగటుతో 3012 పరుగులు సాధించాడు.

మిట్టపల్లి సురేందర్



మిట్టపల్లి సురేందర్ జననం జనవరి 9,1985. స్వస్థలం వెలంపల్లి గ్రామం, చిట్యాల మండలం, వరంగల్ జిల్లా. మిట్టపల్లి సురేందర్ వరంగల్ జిల్లాకు చెందిన తెలుగు జానపద, సినీ గీతరచయిత. తెలంగాణ ఉద్యమానికి పాటలకు ఊపిరి పోసిన పల్లెకవి సురేందర్. తలరాతను మార్చే బతుకుకోసం ఎదిరించి పోరాడమని తన పాటల ద్వారా బోధించినోడు మిట్టపల్లి సురేందర్. తెలంగాణ కోసం అమరులైన యువకుల బలిదానాల మీద ఆయన రాసిన రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా పాట బహుళ ప్రజాదారణ పొందింది. ప్రముఖ దర్శకులు ఆర్.నారాయణమూర్తి ఆ పాటను తన పోరు తెలంగాణ (2011) చిత్రంకోసం వాడుకున్నారు. అదే పాటకుగానూ 2011లో సురేందర్ నంది అవార్డును అందుకున్నారు. సురేందర్ ఇప్పటి వరకు దాదావు 300ల ప్రైవేట్ సాంగ్స్ రాశారు.

ఖొరానా



హరగోవింద్ ఖొరానా (9 జనవరి 1922– 9 నవంబర్ 2011) భారతీయ సంతతికి చెందిన, నోబెల్ బహుమతి పొందిన ప్రఖ్యాత జీవ శాస్త్రజ్ఞుడు. 1922 జనవరి 9న అవిభక్త భారతదేశములోని పంజాబ్ రాష్ట్రమునకు చెందిన రాయపూరు గ్రామములో జన్మించాడు (ప్రస్తుతం పాకిస్తాన్లో ఉన్నది). 1951–52లో విశ్వవిఖ్యాత కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయములో మాంసకృత్తులు, న్యూక్లిక్ ఆమ్లములకు సంధించిన పరిశోధన మొదలు పెట్టాడు. 1952లో కెనడా లోని బ్రిటిష్ కొలంబియా (వ్యంకూవర్) విశ్వవిద్యాలయములో చేరాడు. అటు పిమ్మట 1960 లో అమెరికాలోని విస్కాన్సిన్ విశ్వవిద్యాలయములో (మ్యాడిసన్) ఆచార్యునిగా చేరాడు. 1970లో ప్రతిష్ఠాత్మకమైన మశాచుసెట్స్ సాంకేతిక సంస్థలో రసాయన శాస్త్ర ఆచార్యునిగా చేరాడు. 2007లో పదవీవిరమణ చేశాడు. జీవశాస్త్రవేత్తలు ఎప్పటినుండో ఎదుర్కొంటున్న ప్రశ్న–ప్రయోగశాలలో జీవాన్ని కృత్రిమంగా సృష్టించడం సాధ్యమేనా? ఈ దిశలో వంశ పారంపర్యముగా సంక్రమించు జీవ నిర్మాణానికి దోహదం చేసే కృత్రిమ జీన్‌ను సృష్టించగలిగాడు. ఈ ఆవిష్కరణ అనే నూతన శాస్త్ర అధ్యయనానికి దారి తీసింది.

ఆర్థిక మంత్రికి ఓ విన్నపం

అయ్యా! ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లి గారూ...మీ రాబోయే కొత్త బడ్జెట్‌లో ఆదాయ పన్ను స్లాబ్స్ పెంచాలి ? అనాదిగా ఆర్థిక మంత్రులు, వ్యక్తిగత ఆదాయ పన్ను శ్లాబులను సీనియర్ సిటిజెన్ (60 ఏళ్ళు నుండి 80 ఏళ్ళు లోపు ఉన్న వారు) చాలా సీనియర్ సిటిజన్స్ (80 ఏళ్లకు పై బడినవారు),60 ఏళ్ల తరువాత నేరుగా 80 ఏళ్ళు దాటినవారికే పన్ను రాయితీలలోను స్లాబ్స్‌లోను మార్పులు కలిపిస్తున్నారు. ఈ పద్ధతి కి స్వస్తి పలకాలి. ఎందుకంటె రానున్న గంటలో ఏఆపద జబ్బుతో ప్రాణం మీదకు వస్తుదన్న నిత్యం భయంతో జీవించే 65 ఏళ్ళు పై బడిన ఆదాయవు పన్ను చెల్లించే వారిపై ఆర్థిక మంత్రి, ప్రియతమ ప్రధాన మంత్రి ఆలోచించక పోవటం శోచనీయం. వారి భాద్యతలు కుటుంబ వ్యక్తులకే గాని పాలకులకు ఉండదా, ఉండ కూడదా, ఇది పదవిలో ఉన్నవారి మైకమా, తరతరాలు గా పదవితో సిద్ధించే సహజ సిద్ధమైన పాలకుల అలసత్వమా? టాక్స్‌చెల్లించేవారుఅందరూ ప్రభుత్వ ఉద్యోగులైతే కొంతలో కొంత ప్రభుత్వ సహాయం అందుతుంది. ఇక ప్రైవేట్ ఉద్యోగులకైతే అనుక్షణం మందులతో రోగాలతో ఆసుపత్రి చుట్టూ నిత్యం సందర్శించి వందలు, వేలు, లక్షలు చెల్లించే వారిపై ప్రభుత్వం కనికరించదా?ప్రపంచ ఆరోగ్య సంస్థల ప్రకారం ప్రపంచములోనే 2015 సంవత్సర ర్యాంకింగ్ ప్రకారం భారత దేశం 125 స్థానం లో ఉంది (ఈ సమాచారం 2016 మే లో ప్రచురించారు వారు) ఆ లెక్కల ప్రకారం భారత దేశం స్త్రీ 69.9 సంవత్సరాలు, పురుషుల సగటు ఆయుర్దాయం 66.9 సం సంవత్సరాలు. నేటి సమాజం లో ఎంత మంది 80 సంవత్సరాలు బ్రతికి ఉంటారు, ఇంకా అందులో రూ 5 లక్షలు టాక్స్ ఆదాయం ఉన్నవారు ఇంకెంత మంది ఉంటారు. అందుకే వ్యక్తి గత టాక్స్ లో స్లాబులు ఎక్కువగా పెడితేనే ప్రజలకు ఉపయోగం ఉంటుంది. అందుకే 60 ఏళ్ళ తరువాత మీరు ప్రతి 5 సంవత్సరాలకి ఒక స్లాబ్ పెడితే బాగుంటుంది. అప్పుడు ప్రతి టాక్స్ పెయిర్ కీ టాక్స్‌లో రాయితీ పొందగలుగుతారు. ఎలాగా ఉచిత ప్రభుత్వ వైద్య సహాయం అందచేయట్లేదు. అందుకే ఈ క్రింది విధముగా ఆదాయ పన్ను స్లాబ్స్ పెడితే ఆనందిస్తారు.

65 సంవత్సరాలు పైన 70 లోపు
70 సంవత్సరాలు పైన 75 లోపు
75 సంవత్సరాలు పైన 80 లోపు

80 సంవత్సరాలు పైన వారికి అస్సలు టాక్స్ ఉండకూడదు.(వ్యాపారస్తులను మినహాయించండి) మీ ప్రభుత్వం పెట్టే ఖర్చులో కేవలం 0.0001% కన్నా తక్కువ పొదుపు చేస్తే అందరూ చాలా సీనియర్ సిటిజన్స్ కట్టే ఆదాయ పన్ను కన్నా మీ ఖజానాకు ఎక్కువే మిగులుతుంది అనటం లో సందేహం లేదు.ప్రధాన మంత్రి మోడీ గారు మీరు పాత ఆదాయ పన్ను స్లాబ్స్‌ను పాటిస్తే మీ హయాంలో ప్రజలు చెప్పుకోతగిన కొత్త పద్ధతులు ఏమీ ఉండవు. ఇక ఆర్థిక మంత్రి గారూ, మీరు గత ఆర్థిక మంత్రుల బాటలో పయనిస్తే మీ పని తనం పరమ శూన్యం. అలా కాక కాలానుగుణంగా నూతన బాటలో ఆదాయ పన్ను రాయితీ స్లాబ్స్ నిర్ణయించితే, దేశప్రధానిగా మీ హయాములో ఎవరు తప్పు చేసినా ఆ చెడ్డ పేరు వచ్చేది ముందుగా మీకే సుమా?

ఇక నూతనత్వం గురించి ప్రజలకు విడమరచి చెప్పాల్సిన అవసరం మీకు లేదా, అందుకే మీ పంథా మార్చండి. ఈ రాబోయే బడ్జెట్ లో ఆదాయ పన్ను రాయితీ 65 ఏళ్ల పైబడిన వారికి ఎక్కువగా ఖర్చులయ్యే మందులకు ఆసుపత్రి ఖర్చులకు భారత ప్రధాన మంత్రి గా మీ బాధ్యత లేదా? మీకు ప్రజా సేవ నిజం గా చేయాలని గుండెల్లో ఉంటే 80 సంవత్సరాల పైన ఉన్నపౌరులు క్రమం తప్పకుండా ఆదాయ పన్ను కడుతున్న వారికి ప్రతి మూడు సంవత్సరాలకు ఎంతో కొంత ఆదాయ పన్ను రాయితీ కల్పించండి, ఇది వారికి ఆర్థిక బలం చేకూర్చిన వారు అవుతారు. మీ కేంద్ర ప్రభుత్వం అనవసరంగా ఖర్చు పెట్టే వాటికి తక్షణం కళ్ళెం వేయండి. ఇప్పటి వరకు మీరు చేసిన తప్పును గ్రహించి సత్వరం ఆదాయ పన్ను రాయితీ కల్పించి సీనియర్ సిటిజన్స్ దీవెనలను పొందండి, వారి ఆశీస్సులతో చక్కగా పరిపాలించండి?అందుకే వెంటనే మీ రాబోయే కొత్త బడ్జెట్ట్ లో ఆదాయ పన్నుకు సత్వరమే ఒక నవ రూప సవరణ సంతరించేటట్లు చేసి, దేశ ప్రజల మన్నలను పొందండి.

చామర్తి వెంకట రామ కృష్ణ
హైదరాబాద్

వర్శిటీల ప్రక్షాళన అవశ్యం

- నిరుపేదల దేవాలయాలకు నిధులందని వైనం
- నైపుణ్యాన్ని పెంచే యోచన లేని ప్రభుత్వాలు
- నూతన పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వాలి
- పరీక్షల నిర్వహణలో, ఫలితాల వెల్లడిలో జాప్యం
- 100కు 105 మార్కులేసిన ఘనులున్నారిక్కడ



మోటె చిరంజీవి, సెల్ : 9949194327

(నిన్నటి తరువాయి)

విశ్వవిద్యాలయాలు డబ్బులేని నిరుపేదలకు, పేదరికం ఉన్న మేధా వులకు దేవాలయాలు అంటున్నారు. తప్పితే వారిలో ఉన్న సృజనా త్మకత మరియు పరిశోధన శక్తిని సరిగా వెలికితీయలేక పోతున్నా రన్నది నిజం. కాని అలాంటి మేధావులు సైతం నైపుణ్యాలను పెంపొందించుకునే విధంగా బోధనను అందించడం లేదు అనేది నగ్న సత్యం ఏది ఏమైనప్పటికి విశ్వవిద్యాలయాలను ప్రక్షాళన చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అలా చేస్తేనే విద్యావ్యవస్థ మెరుగుపడుతుంది. అందుకోసం ప్రభుత్వం కొన్ని ఆర్థిక నిర్ణయాల తద్వారా కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుంది. తద్వారా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించవచ్చు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవుడున్న బడ్జెట్‌లో విద్యా వ్యవస్థకు, పరిశోధనలకై అధికంగా బడ్జెట్ కేటాయించాలి. కొత్త పరిశోధనలకై ప్రోత్సహించాలి. అవుడే కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి. విశ్వ విద్యాలయాలను మెరుగుపరచడానికి వెంటనే శాశ్వత అధ్యాపకులను నియమించాలి. అప్పుడే మెరుగైన విద్యను అందించడం జరుగుతుంది.ఇవ్వుడున్న విశ్వవిద్యాలయాల వి.సి.ల నియామకం ఒక పద్ధతి ప్రకారం జరగలేదనే చెప్పాలి. కనీసం ప్రొఫెసర్‌గా 10 సం॥లు అనుభవమున్న వారినే వి.సి. గా నియ మించాలి అనే నిబంధనను తుంగలో తొక్కి అనుభవం లేని వారిని అందలం ఎక్కించారు. విసిల నియామకంలో రాజకీయ ప్రజా ప్రతినిధుల జోక్యం ఉండకుండా ఉంటే మంచి లక్షణాలు, ఉత్తమ అనుభవం ఉన్నవారు విసిలు అవుతారు, తద్వారా విశ్వ విద్యాలయాలు మెరుగుపడుతాయి.ఉన్నత విద్య పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయి. అది ఉస్మానియా కావచ్చు, కాకతీయ కావచ్చు, తెలుగు విశ్వవిద్యాలయం కావచ్చు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. కాకతీయ విశ్వవిద్యాలయాలలో జరిగిన ఎంఫిల్, పి.హెచ్.డిలలో అవకతవకలు, డిగ్రీ ఫలితాల వెల్లడిలో జాప్యం వల్ల విద్యార్థులు తమ అమూల్యమైన సమయాన్ని కోల్పోవడం జరుగుతుంది. ఈ సంవత్సరం ఇవ్వాల్సిన ఫలితాలు సరైన సమయంలో ఇవ్వక కొన్ని నెలలు గడిచిన తర్వాత ఇవ్వడం వల్ల వారు ఒక అకాడమిక్ ఇయర్ కోల్పోతున్నారు. జెఎన్‌టియు 2సంవత్సరాలుగా ఎంబిఏ చేసినవారికి ప్రాజెక్ట్ పేరు చెప్పి మరొక సంవత్సరకాలం నష్టపో వడం, కాకతీయ పరీక్షలో 100 గాను 105 మార్కులు ఇవ్వడం ఎవరి (ఆధ్వర్యంలో) విధి నిర్వహణలో తప్పులు దొర్లాయో వారినే రిజిస్ట్రార్‌ను చేయడం, ఇంతకన్నా దారుణమైన పరిస్థితి మరొకటి ఉండదు. ఇవన్నీ ప్రక్షాళన చేయాల్సిన అవవిసరం ఎంతైనా ఉంది.

ఈ విద్యాసంవత్సరంలో ఇటీవల తెలుగు విశ్వవిద్యా లయంలో పరీక్ష పేపర్‌లీకై పరీక్ష రద్దైన విషయం కూడా తెలిసిందే దీనికి ముఖ్యకారణం విశ్వ విద్యాలయాల్లో పార్ట్ టైమ్ పనిచేస్తున్న అధ్యాపకుల జోక్యం వల్ల పరీక్ష పేపర్ బయటకు రావడం, ఓ వ్యక్తి తన చేతిపైన జవాబులు వ్రాసుకొని రావడం, తద్వారా పరీక్ష రద్దయినది ఇందుకు కారణం సరైన నియంత్రణ లేకపోవడమనేది చెప్పవచ్చు.

భారతదేశం ప్రస్తుతం ఆధునిక శాస్త్ర సాంకే తిక పరిజ్ఞానాల కోసం విదేశాల మీద అత్యధికంగా ఆధార పడాల్సి రావడానికి ఇదే ప్రధాన కారణం. విదేశాల్లోని భారతీయ విద్యార్థులు అద్భుత పరిశోధనలతో గొప్ప గొప్ప ఆవిష్కరణలతో సంచలనాలు సృష్టిస్తున్నారు. అలాంటి సంచలనాలు ఇవుడు మనదేశంలో ఒక నోబెల్ బహుమతిని సాధించలేదు. సాధించే దిశగా ప్రయత్నం చేయాలి. విద్యార్థులను పరిశోధన రంగాల వైపు మళ్లిం చాలి. అన్ని రంగాలలో విశ్వవిద్యాలయాలను అభివృద్ధి పరచాలి. అలా చేసినవుడే మన విశ్వవిద్యాలయాలు ప్రపంచంలోనే అత్యున్నత స్థానాన్ని ఆక్రమిస్తాయి. అలా అన్ని రంగాలలోను, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచి ఉన్నత ప్రమాణాలకు పట్టం కడుతాయని ఆశిద్దాం!.



లాభాల బాటలో మార్కెట్ పరుగులు

ముంబై: దేశీయ మార్కెట్లు సోమవారం నాడు లాభాల బాటలో నడిచాయి. సెషన్ ప్రారంభం నుంచి సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల్లోనే కొనసాగడం విశేషం. ఆసియా మార్కెట్ల సానుకూల ప్రభావం, కంపెనీల త్రైమాసిక ఫలితాలు వెలువడనుండటం కలిసొచ్చింది. ప్రారంభం నుంచే 150 పాయింట్లకు పైగా లాభంతో ట్రేడ్ అయిన సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 199 పాయింట్లకు చేరుకుని 34,353 వద్ద ముగిసింది. ఒకానొక సమయంలో 220 పాయింట్ల వరకు సెన్సెక్స్ ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా 65 పాయింట్లు లాభపడి 10,624 వద్ద ముగిసి కొత్త రికార్డు స్థాపించింది. డాలర్తో రూపాయి మారకం విలువ రూ. 63.39గా కొనసాగుతోంది. లాభపడిన షేర్లలో కోల్ఇండియా, లుపిన్, ఇన్ఫోసిస్, సన్ఫార్మా, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఉండగా... ఎయిర్టెల్, ఓఎన్జీసీ, హెచ్సీఎల్ టెక్నాలజీస్, టాటాస్టీల్, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టపోయాయి.

32 నెలల గరిష్ఠానికి రూపాయి: డాలర్ తో రూపాయి మారకవు విలువ భారీగా లాభపడుతూ, 32 నెలల గరిష్ఠానికి దూసుకెళ్లింది. శుక్రవారం నాడు ఒక డాలర్ కు రూ. 63.37 మారకవు విలువ పలకగా, ఈ ఉదయం అది స్వల్పంగా పెరిగి రూ. 63.49 వద్ద కొనసాగుతోంది. కరెన్సీ డీలర్ల నుంచి కొనుగోళ్లు సంతృప్తికరంగా ఉండటం, విదేశాల నుంచి పెట్టుబడుల రూపంలో డాలర్లు వస్తుండటంతో రూపాయి విలువ పెరుగుతోందని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఎపిస్ ఇండియా కొత్త ప్రొడక్టులు




న్యూఢిల్లీ: ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థ ఎపిస్ ఇండియా తాజాగా ఫ్రూటీలిషియస్ పేరుతో ఫ్రూట్ జామ్, ఫైవ్ సెన్సెస్ పేరుతో గ్రీన్ టీ, స్పైసియస్ మిక్స్డ్ వెజ్జీస్ పేరుతో పికిల్స్ను మార్కెట్లోకి విడుదల చేసినట్లు తెలిపింది. తేనే ఉత్పత్తుల విభాగంలో పేరుపొందిన ఎపిస్ ఇండియా నూతన ఉత్పత్తుల ఆవిష్కరణను సంస్థాగతంగా మరో మైలురాయిగా పేర్కొంది. అత్యుత్తమ పండ్లను సేకరించి, వాటిని చక్కగా మిశ్రమం చేసి తగిన ఫ్లేవర్ జోడించి ఫ్రూట్ జామ్ను రూపొందించినట్టు సంస్థ తెలిపింది. 500 గ్రాముల ఫ్రూట్ జామ్ ధర రూ. 120 అని పేర్కొంది. అలాగే ఎంతో ఆరోగ్యాన్ని అందించే గ్రీన్ టీని, రుచికరమైన పచ్చళ్లను కూడా మార్కెట్ లోకి విడుదల చేసినట్టు సంస్థ వివరించింది. కాగా ఎపిస్ ఇండియా సంస్థ ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందింది.

'ఆధార్' బండారం బట్టబయలు కానుంది

● హెచ్చరించిన 'ది ట్రిబ్యూన్' ఎడిటర్ ● 100 కోట్ల ఆధార్ కార్డుల వివరాలు లీక్ ● సంచలన కథనం రాసిన 'ది ట్రిబ్యూన్' రిపోర్టర్ ● బయటకు వచ్చింది చాలా తక్కువన్న రిపోర్టర్ రచనా ఖైరా

న్యూఢిల్లీ: దాదావు 100 కోట్ల ఆధార్ కార్డుల వివరాలు లీక్ అయ్యాయని, సంచలన కథనం రాసిన 'ది ట్రిబ్యూన్' రిపోర్టర్ రచనా ఖైరాను పత్రిక ఎడిటర్ హరీష్ ఖారే అభినందించారు. ఇప్పుడు బయటకు వచ్చింది ఓ పెద్ద మంచుకొండలోని చిన్న ముక్కేనని, మరెంతో బయటకు రానుందని తెలిపారు. ఆధార్ కార్డులపై తప్పుడు ఆరోపణలతో వార్తలు రాశారని రచనా ఖైరాపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని ఆయన ఖండించారు. తమ పరిశోధనకు ఫలితంగా ఎఫ్ఐఆర్ రూపంలో ప్రోత్సాహం లభించిందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో ఖైరా మాట్లాడుతూ, నేను ఓ విషయం చెప్పదలచుకున్నాను. మా విచారణ మొత్తం పూర్తయింది. ఈ తరహా ఇన్వెస్టిగేషన్ లో ఉన్న సున్నితత్వాన్ని యూఐడీఏఐ అర్థం చేసుకోవాలి. ఇప్పటివరకూ మేము వెలుగులోకి తెచ్చిన వివరాలతో పోలిస్తే ఇంకా చాలా సమాచారం మా దగ్గర ఉంది. అతి త్వరలోనే అది కూడా వెల్లడవుతుంది అన్నారు. తన రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ రిపోర్టరుకు అవసరమైన అన్ని రకాల న్యాయ సహాయాన్ని అందిస్తానని ఖారే వెల్లడించారు. కాగా, వార్త రాసిన జర్నలిస్టుపై కేసు పెట్టడాన్ని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తీవ్రంగా ఖండించింది. ప్రజా ప్రయోజనాలు దాగున్న ఓ గొప్ప కథనంపై ఇలా స్పందించడం సరికాదని, ఇది పత్రికా స్వేచ్ఛకు విఘాతమని ఓ ప్రకటనలో ఎడిటర్స్ గిల్డ్ వెల్లడించింది.

ఓరియంట్ ఎల్ఈడీ బ్యాటన్ శ్రేణి



హైదరాబాద్: సీకే బిర్లా గ్రూపులో భాగమైన ఓరియంట్ ఎలక్ట్రిక్ తన ఎల్ఈడీ బ్యాటన్ శ్రేణికి వ్యాపారులు, వినియోగదారుల నుంచి అద్భుత స్పందన వచ్చిన నేపథ్యంలో ఈ శ్రేణిని మరింత విస్తృతం చేయనున్నట్లు సంస్థ ప్రకటించింది. సంస్థ ఫ్లోరోసెంట్ ట్యూబ్కు సరైన మార్పుగా ఈ నూతన శ్రేణిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ప్రకటించింది. ఈ శ్రేణిని మూడు విభిన్న రంగులలో రూపొందించినట్లు తెలిపింది. ఈ బల్బులను దీర్ఘకాలిక మన్నిక కలిగిన విధంగా రూపొందించి, విద్యుత్ ఆదాకు దోహదపడే విధంగా తీర్చిదిద్దినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ఓరియంట్ ఎలక్ట్రిక్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ హెడ్ పునీత్ ధావన్ మాట్లాడుతూ పాత సాంప్రదాయ బల్బుల స్థానంలో మేము తీసుకువచ్చిన ఎల్ఈడీ బ్యాటన్లకు మంచి ఆదరణ లభిస్తున్నదన్నారు.

అధికారం మాదే !

హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః వచ్చే ఎన్నికల్లో సమిష్టి కృషితో 2019లో తమ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్రంలోనూ అధికారంలోకి వస్తామన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనను పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగించాలని నిర్ణయించిన రాహుల్ గాంధీకి ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాలు గెలుస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా తనకు ఫోన్ చెయ్యొచ్చన్నారు. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటానని, తెలంగాణలోని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తన కుటుంబ సభ్యుడేనని వ్యాఖ్యానించారు. కాగా, పీసీసీ అధ్యక్షుడిగా తనను కొనసాగిస్తూ ఏఐసీసీ నుంచి ఉత్తర్వులు వెలువడిన తరువాత తొలిసారి గాంధీభవన్‌కు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఘనస్వాగతం లభించింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.

నేను పీసీసీ చీఫ్ ఆశించింది వాస్తవమే: ఎమ్మెల్యే కోమటిరెడ్డి

తాను పీసీసీ చీఫ్ ఆశించింది వాస్తవమేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నా...ఎవరున్నా అందరం కలిసి పని చేస్తామని చెప్పారు. తలాకొన్ని నియోజకవర్గాలు పంచుకుని కాంగ్రెస్‌ను గెలిపిస్తామని, పాదయాత్ర, బస్సుయాత్ర ఏదైనా.. అధిష్టానం సూచనల మేరకు నడుచుకుంటామని ఆయన పేర్కొన్నారు. రైతులు 12 గంటల విద్యుత్ చాలంటున్నారని, 24 గంటల కరెంట్ వల్ల భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయని కోమటిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణ పీసీసీ పదవిపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి పోటీ పడుతున్నారని వార్తలు వచ్చాయి. ఆయనతో పాటుగా మాజీ మంత్రి డీకే అరుణ కూడా పీసీసీ రేస్‌లో ఉన్నారని ప్రచారం జరిగింది. ఈ ప్రచారాలను తెరదీస్తూ టీపీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్ కుమార్ రెడ్డిని కొనసాగించాలని కాంగ్రెస్ అధిష్ఠానవర్గం నిర్ణయించింది. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది పేరుతో ఒక ప్రకటన వెలువడింది.

కోడి రె'ఢీ'



● చాప కింద నీరులా ప్రయత్నాలు ● సుప్రీం బరిలో 'పందెం' కోడి ● పందెంకోడికి పగ్గాలు పడేనా..? ● కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు ● అధునాతన హంగులతో నిర్వహణ ● కొత్తపుంతలు తొక్కిస్తున్న ప్రజాప్రతినిధులు ● హైకోర్టు ఆదేశాలతో యంత్రాంగం స్పందనపై ఉత్కంఠ

హైకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేస్తాం : కలెక్టర్ కార్తికేయ మిశ్రా

(అమరావతి నుంచి 'సూర్య ప్రత్యేక ప్రతినిధి) : సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించే కోడిపందేలపై ఆంక్షలతో వివాదం ముదిరింది. పోటీల కోసం ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. కోర్టు ఆదేశాలు ఓ వైపు పోలీసుల ఆంక్షలు మరోవైపు ఉండడంతో ఈ పందేల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. పందేలు వేస్తే కఠిన చర్యలు తప్పవన్న అధికారుల హెచ్చరికలు, గ్రామాల్లో కోళ్లకు కత్తులు కట్టేవారిపై బైండోవర్ ఇవన్నీ కొనసాగుతుండగానే తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో పందెం రాయుళ్లు పుంజులను సిద్ధం చేస్తున్నారు. కోడిపందేలు నిర్వహించి తీరుతామని ప్రజాప్రతినిధులు బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారు. వారికి కోర్టు ఉత్తర్వులంటే గౌరవం లేకుండా పోయింది. కోడి పందేల వల్ల కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. కోడి పందేలు ఓ జబ్బు. వాటిపై అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉండదు. చట్టాన్ని అమలు చేయలేని నిస్సహాయతను కోర్టు దృష్టికి తీసుకొస్తే సమర్థుడైన అధికారిని నియమించమని ప్రభుత్వాన్ని ఆదేశిస్తామని న్యాయవాదులు చెబుతున్నారు. కోడిపందేలపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణ సందర్భంగా తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో ఏటా సంక్రాంతి సందర్భంగా కోడిపందేల నిర్వహణ యథేచ్ఛగా సాగుతున్నా దీనిని అడ్డుకోవడంలో యంత్రాంగం విఫలమవుతోంది. కోడిపందేలపై కఠిన చర్యలు చేపడతామని ఉన్నతాధికారులు (మిగతా 7లో) చేస్తున్న ప్రకటనలు ఆచరణలో కానరావడం లేదు. కోడిపందేల మాటున రూ.కోట్లు చేతులు మారుతుండగా పందేల ముసుగులోనే సహ జూదాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. దీనికి రాజకీయ అండదండలు పుష్కలంగా లభిస్తుండడమే ప్రధాన కారణం.వీటి ఫలితంగా పలు కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతుండగా వేలాది కోళ్లు రక్తమోడుతున్నాయి. కోనసీమ కేంద్రంగా కోడిపందేలు ఏటా జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా ముమ్మిడివరం నియోజకవర్గంలోని ఐ.పోలవరం మండలం మురముళ్ల కోడిపందేలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఇక్కడ అధునాతన సాంకేతిక వ్యవస్థను సైతం వినియోగిస్తూ పందేలు నిర్వహిస్తుండడం మామూలైపోయింది. ఐ.పోలవరంతో పాటు ముమ్మిడివరం, తాళ్లరేవు మండలాల్లో చిన్న బరులు ఎక్కువే. అమలాపురం నియోజకవర్గ పరిధిలోని అల్లవరం మండలం గోడి గ్రామం కేంద్రంగా కూడా పెద్ద ఎత్తున కోడిపందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇదే మండలంలోని గుండిపూడి, అల్లవరం, అమలాపురం గ్రామీణ మండలంలోని ఇందుపల్లి, మరో రెండు గ్రామాలతో పాటు ముమ్మిడివరం తదితర ప్రాంతాల్లో కూడా ఓ స్థాయిలో వీటి నిర్వహణ కొనసాగుతోంది. రాజోలు నియోజకవర్గంలోని వీవీ మెరక, కొత్తపేట నియోజకవర్గం ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేల హడావుడి కనిపిస్తోంది. ఇక జిల్లాలో మెట్ట ప్రాంతంలో కూడా వీటి జోరు తీవ్రంగానే ఉంది. పెద్దాపురం నియోజకవర్గం సామర్లకోట మండల పరిధిలోని వేట్లపాలెంలో గత ఏడాది పందేలు జోరుగా సాగాయి. ప్రస్తుతం భారీ ఎత్తున నిర్వహించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. తుని నియోజకవర్గంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాల పరిధిలో కోడిపందేలు జోరు తీవ్రంగా ఉంటోంది. కేవో తేటగుంటలో పెద్దబరి నిర్వహిస్తుండగా మిగిలిన ప్రాంతాల్లోనూ నిర్వహణకు సిద్ధవుతున్నారు. గత ఏడాది జగ్గంపేట, రాజానగరం, అనపర్తి, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల పెద్దఎత్తున పందేలు జరిగాయి. ఇదే తరహాలో ప్రస్తుతం కూడా వీటి నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పంతం..ప్రతిష్టాత్మకం: కోడిపందేల నిర్వాహణపై జిల్లాలో కొందరు ప్రజాప్రతిధులు పంతాలకు పోతున్నట్లు తెలుస్తోంది. మురముళ్లలో ఓ మోస్తారుగా జరిగే కోడిపందేలు ఓ ప్రజాప్రతినిధి పంతంతో ఏకంగా అక్కడ కొత్తపుంతలు తొక్కినట్లయ్యింది. గత రెండేళ్లుగా ఇక్కడ మినీ స్టేడియం తరహాలో హంగులు సృష్టించి ఎల్ఈడీ తెరలు, రాత్రిపూట నిర్వాహణకు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. పందేలను వీక్షించేందుకు వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు, ప్రారంభ వేదికలు, డ్రోన్ కెమెరాల వినియోగం, క్రికెట్ తరహాలో పందేల చిత్రీకరణ, ఆపై ప్లే.. రీ ప్లే.. కేబుల్ టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఇలా ఒకటేమిటి.. కోడిపందేలను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఈసారి కూడా గతం కంటే రెట్టింపు స్థాయిలో వీటిని నిర్వహించాలన్న ఆలోచనలతో ఇక్కడ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇదే అదనుతో అక్కడ జరుగుతున్నాయి.. మరి మా ప్రాంతంలో నిర్వహించకపోతే ఎలా..? అంటూ మరికొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు పంతాలకు పోతున్నారు.

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ వల్లే ఐటి దూకుడు



ఐటీలో శిక్షణ ఇచ్చేందుకు వరంగల్, ఖమ్మం, కరీంనగర్‌లో ఐటీ టవర్లను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కరీంనగర్‌లో ఇప్పుడు నిర్మిస్తున్న టవర్‌తో పాటు త్వరలోనే రెండో టవర్ ఏర్పాటుకు అనుమతులు ఇస్తామని ప్రకటించారు. ఐటీ కంపెనీలను విస్తరిస్తామని స్పష్టం కేటీఆర్ స్పష్టం చేశారు.

యువత మేథస్సుకు పదును పెట్టాలి: దేశంలో 50 శాతం జనాభా 27 ఏళ్ల లోపు యువతే ఉన్నారని కేటీఆర్ చెప్పారు. దేశంలో 65 శాతం జనాభా 35 ఏళ్ల లోపు వారే ఉన్నారని పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీ పడే పౌరులుగా మనం తయారు కావాలని పిలుపునిచ్చారు. యువత ఉన్నతమైన, నవీన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఉద్యోగాలు ఆశించటం మాత్రమే కాదు.. ఉద్యోగాలు కల్పించేలా యువత ఎదగాలన్నారు. యువత మేథస్సుకు పదును పెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. యువత కోసం ప్రయివేటు రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. యువతకు నాణ్యమైన శిక్షణ కల్పిస్తే ఉపాధి కల్పన సాధ్యమవుతుందని ప్రకటించారు. ఇప్పటికే వరంగల్‌లో ఐటీ హబ్ ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. కరీంనగర్ ఐటీ పార్క్‌లో వెయ్యి ఐటీ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. యువత కోసం టీ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులందరూ జాబ్ క్రియేటర్‌గా ఎదగాలన్నారు. కరీంనగర్‌లోనే త్వరలోనే టాస్క్‌ను నెలకొల్పుతామని కేటీఆర్ ప్రకటించారు.

సీఎం కేసీఆర్ పటిమ వల్లే అద్భుత ప్రగతి: తెలంగాణ వస్తే కరెంట్ కష్టాలు వస్తాయన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో నిరంతర విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. కేవలం మూడున్నరేళ్లలో దేశంలోనే సులభతర వాణిజ్యం సాధించిన రాష్ట్రంగా ఎదిగామని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ నాయకత్వ పటిమ వల్లే అద్భుత ప్రగతి సాధ్యమైందని ఉద్ఘాటించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. నీళ్లు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగమని చెప్పిన నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. త్వరలోనే ఇంటింటికి తాగునీరు అందివ్వబోతున్నామని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలన్నదే సీఎం లక్ష్యమని తేల్చిచెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఆర్థిక వృద్ధి రేటులో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్‌గా ఆవిర్భవించిందని తెలిపారు. సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ శ్రమతోనే ఆర్థిక వృద్ధి రేటు పెరిగిందని మంత్రి కేటీఆర్ ఉద్ఘాటించారు.

పథకాలపై కేంద్రమంత్రులు సీఎంకు ప్రశంసలు: తెలంగాణ అభివృద్ధిని చూసి కేంద్రమంత్రులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఉద్యమ నాయకుడు, పరిపాలన దక్షుడు కేసీఆర్ అంటూ అరుణ్ జైట్లీ కొనియాడారని గుర్తు చేశారు. నిన్ననే కేంద్ర మంత్రి మహేశ్ శర్మ కూడా సీఎం కేసీఆర్ గొప్ప విజన్ ఉన్న నాయకుడు అని ప్రశంసించారని తెలిపారు. ఇక్కడున్న గల్లీ బీజేపీ నేతలమో ప్రభుత్వ పథకాలను, అభివృద్ధిని విమర్శిస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

గడువులోగా డబుల్ ఇళ్లు: సిరిసిల్లజిల్లా పెద్దూరులో డబుల్ బెడ్‌రూం ఇండ్లకు మంత్రులు కేటీఆర్, ఈటెల రాజేందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... గడువు లోగా డబుల్ బెడ్‌రూం ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని తెలిపారు. డబుల్ బెడ్‌రూం పథకం నిరంతరం కొనసాగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లను కేటాయించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం న్యాయవాదుల సంఘ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ వినోద్, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్ కృష్ణభాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రచార హోరు




సొంత జిల్లాల్లో నిర్వహిస్తున్న యాత్రకు అపూర్వ స్పందన లభిస్తోంది. వైసీపీ జెండాలు, ఫ్యాన్ గుర్తు మరోసారి ప్రజలకు చేరువ అవుతోంది. మరోవైపు పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావులు పోలవరం పాదయాత్ర పేరుతో మూడు రోజులు యాత్రలో పాల్గొంటుండడంతో కాంగ్రెస్ జెండాలు రెపరెపలాడుతున్నాయి.

కొనసాగుతున్న వలసల పర్వం: ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఎన్నికలకు ఎంత లేదన్నా ఇంకా ఏడాదిన్నర సమయం ఉంది. అప్పుడే ప్రధాన పార్టీలు వలసల ఆటను ప్రారంభించాయి. ఎవరు ఏ రోజు ఎటువైపు ఉంటారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తల్లి కాంగ్రెస్ నుంచి పిల్ల కాంగ్రెస్ వలసలకు గేట్లు ఎత్తితే.. ఈ పిల్ల కాంగ్రెస్ నుంచి తెలుగుదేశం పార్టీ వలసలకు తెర లేపింది. అటు తెలుగుదేశం పార్టీ, ఇటు వైఎస్ఆర్ కాంగ్రెస్ రెండూ పార్టీ పటిష్టతపై దృష్టి పెట్టాయి. వ్యూహాలకు పదును పెడుతున్నాయి. నరసరావుపేటలో మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి కుమారుడు కాసు మహేశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని కాదని వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఓ దశలో మహేశ్‌రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని తెలుగుదేశం నేతలు భావించారు. అయితే చర్చలు మధ్యలోనే నిలిచిపోయాయి. మహేశ్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బహిరంగసభకు భారీగా ప్రజలు వచ్చారు. పల్నాడులో రెండు మూడు నియోజకవర్గాల నుంచి అత్యధిక సంఖ్యలో జనాలు తరలివచ్చారు. ఇది తెలుగుదేశం పార్టీకి కాసింత కలవరం కలిగించింది. మహేశ్‌రెడ్డి చేరిక ద్వారా ఒక అడుగు ముందుకు వేశామని వైఎస్ఆర్ కాంగ్రెస్ సంబరపడుతున్న తరుణంలో కృష్ణా జిల్లా పామర్రులో ఆ పార్టీకి ఎసరు పెట్టింది తెలుగుదేశం. చివరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కల్పన ఆ పార్టీలో కీలక పాత్ర పోషించారు. పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా కూడా వ్యవహరించారు. 2014 ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్‌లో చేరారు. పామర్రు నుంచి పోటీ చేసి గెలుపొందారు. కొన్నాళ్ల కిందటి వరకు తెలుగుదేశం పార్టీపై విమర్శలు చేసిన కల్పన ఆ తర్వాత సైలెంట్ అయ్యారు. కల్పన భర్త ఆదాయనె పన్ను శాఖలో కీలక అధికారిగా ఉండటం, ఆయనపై కేసులు ఉండటం కారణంగానే కల్పన తెలుగుదేశం పార్టీలో చేరారనే ఆరోపణలు వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి వస్తున్నప్పటికీ వాటిని కల్పనే స్వయంగా ఖండించారు. తాను కేసులకు భయపడి ఉంటే రెండేళ్ల కిందటే తెలుగుదేశం పార్టీలో చేరిపోయి ఉండేవారమన్నారు. పట్టిసీమ, రాజధాని, ఎయిర్‌పోర్టు, పరిశ్రమల నిర్మాణాన్ని అడ్డుకునే పార్టీలో తాను ఉండదలచుకోలేదని, తన నియోజకవర్గంలో ఈ ఏడాది వరి పండిందంటే అది పట్టిసీమ పుణ్యమేనని కల్పన నిర్మోహమాటంగా చెప్పారు. ఇంత వరకు బాగానే ఉంది. కల్పన చేరిక వల్ల నియోజకవర్గంలో పార్టీకి లాభమేనని తెలుగుదేశం నేతలు అంచనా వేస్తున్నారు.

టీడీపీలోకి ఐదుగురు ఎమ్మెల్యేలు: రాష్ట్ర విభజన అనంతరం కర్నూలు రాజకీయాల్లో జరిగిన ముఖ్య పరిణామం ఐదుగురు వైసీపీ ఎమ్మెల్యేలు తెలుగుదేశం కండువా కప్పుకోవడం. 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 11 చోట్ల, రెండింటికి రెండూ ఎంపీ సీట్లు గెలిచిన వైసీపీకి ఇది మింగుడుపడని పరిణామం. భూమా కుటుంబం నుంచి నాగిరెడ్డి, కూతురు అఖిలప్రియ, బావ ఎస్వీ మోహన రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే మణిగాంధీ, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి జంప్ అయ్యారు. దీంతో పార్టీ శ్రేణుల్లో భరోసా కల్పించేందుకు వైసీపీ అధినేత జగన్ యువభేరి, జలదీక్షలు జిల్లాలో నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచినా పార్టీలో కలవరం: ఒక గెలుపు కొండంత బలాన్నిస్తుంది. పరాజయం పలు పాఠాలను నేర్పుతుంది...కానీ ఓ గెలునె కొన్ని విశ్లేషణలకు దారితీసింది. ఆశించిన మెజార్టీ రాకపోవటం ఆత్మపరిశీలనకు దారి తీయించింది. ఒక్క ఓటుతో గెలిచినా గెలుపు గెలుపే! కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం గెలుపును ఆ కోణంలో చూడటం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో 2014 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ప్రాధాన్యతను సంతరించుకున్నవి మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలే. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అత్యధిక స్థానాలు తెచ్చిపెట్టిన రాయలసీమలోని కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నెల్లూరులో తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఆనం విజయ్ కుమార్ రెడ్డి పోటీ చేశారు. ఈ ఎన్నికలో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ నేతలు ముందే ఊహించారు. పార్టీకి సుమారు 170 నుంచి 150 ఓట్ల వరకు మెజారిటీ వస్తుందని భావించారు. కానీ ఆ మెజారిటీ తగ్గిపోవటం తెలుగుదేశం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. నేతలైనే జీర్ణించుకోలేకపోతున్నారు. కర్నూలులో



తెలుగుదేశం పార్టీ తరపున శిల్పా చక్రపాణి రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరువున గౌరు వెంకట రెడ్డి పోటీ చేశారు. ఈ పోటీలో సుమారు 150 ఓట్ల వరకు మెజారిటీ లభిస్తుందని భావించారు. కానీ ఇక్కడ కూడా మెజారిటీ 50 ఓట్ల వరకు పడిపోయింది. తెలుగుదేశం పార్టీకి ఇది మింగుడు పడని పరిణామంగా మారింది. నమ్మకంగా ఉన్నవారే కొంప ముంచారని, పార్టీకి సమాచారం అందింది. అగ్రనాయకత్వం ఈ రెండు ఎన్నికల పై విశ్లేషణను ప్రారంభించింది. పార్టీ వేగులను పంపి నివేదిక తెప్పించుకుంది. రెండు జిల్లాల్లోనూ క్రాస్ ఓటింగ్ కొంప ముంచిందని, అందువల్లే మెజారిటీ తగ్గిందనే నిర్ణయానికి వచ్చింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల బంధువులు తెలుగుదేశం పార్టీలో కూడా ఉండటంతో కొంతమంది క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారన్న విషయం తెలిసింది. రెండు జిల్లాల్లోనూ సుమారు 200 ఓట్లు ఈ విధంగా క్రాస్ అయ్యాయనే నిర్ణయానికి వచ్చింది. గెలిచినప్పటికీ ఇది తాము ఆశించిన విజయం కాదని, ఊహించని మెజారిటీ వస్తే ఆ గెలుపులో కిక్కు ఉండేదని తెలుగుదేశం పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. గెలుపుకి ఓటమికి తేడా ఉన్నప్పటికీ లభించిన విజయం తెలుగుదేశం పార్టీకి అంత సంతృప్తినివ్వటం లేదు. చివరకు గెలిచిన అభ్యర్థులు సైతం మెజారిటీ తగ్గిందని, క్రాస్ ఓటింగ్ జరిగిందని చెబుతున్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రికి కూడా చెప్పారు. గెలిచిన అనంతరం జిల్లా నేతలు అందరితో కలసి ఎమ్మెల్సీ అభ్యర్థులు ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లారు. ఆయన అభినందనలూ తెలుపుతూనే క్రాస్ ఓటింగ్ విషయాన్ని ప్రస్తావించారు. అనుకున్న ఓట్లు అనుకున్నట్లుగా పడలేదని, ఎక్కడో లోపం జరిగిందని, అదేమిటో తెలుసుకోవాలని పార్టీ నేతలను కోరారు. క్రాస్ ఓటింగ్ దొంగలను కనిపెట్టి ఉండాలని, వారిని పార్టీ నుంచి బయటకు పంపాలని హితవు చెప్పారు. విజయం మనదే అయినప్పటికీ భవిష్యత్తులో అటువంటి పొరపాటు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని హితవు చెప్పారు. తెలంగాణాలో అధికారపార్టీ అయిన టీఆర్ఎస్ మరోసారి అధికారాన్ని నిలుపుకునేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తున్నది. తెలంగాణ

రాష్ట్రం ఏర్పడిన తర్వాత బంగారు తెలంగాణ ఏర్పాటు కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. ముఖ్యంగా గులాబిదళపతి కేసీఆర్ తాను అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన బృహత్ పథకాలు అయిన మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ, నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి ఎన్నికలకు వె ళ్లాలని,అందుకు అనుగుణంగా ప్రాజెక్టు పనుల్లో దూకుడు సాగిస్తున్నారు. ఇప్పటికే ఇంటింటికి తాగునీటిని ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన సీఎం కేసీఆర్, మరో ఆరుమాసాల్లోగా ఇంటింటికి తాగునీటిని అందించేందుకు పనుల్లో ఉరుకులు పెట్టిస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని కులవృత్తులు చేస్తున్న వారిని గంపగుత్తగా పార్టీకి మద్దతు పలికేందుకు ఇటీవల గొర్రెలు, చేపల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి ఆ వర్గాల మద్దతు గూడగట్టారు. ఇక జనాభాలో అధికంగ ఉన్న బీసీలను టీఆర్ఎస్‌పార్టీవైపు మళ్లించేందుకు త్వరలోనే బీసీలకు బృహత్ పథకాలను ప్రారంభించేందుకు కసరత్తు చే స్తున్నారు. ముఖ్యంగా రైతులకు మే నెల నుంచి పెట్టుబడిగా రూ.8వేలు అందించే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీగా కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇలా అన్ని వర్గాల మద్దతును కూడగట్టుకొని వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని టీఆర్ఎస్ పార్టీ చూస్తుంటే అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్‌పార్టీ దూకుడు పెంచింది. రాష్ట్రంలో ప్రభుత్వ వ్యతిరేకతను పార్టీవైపు మళ్లిస్తూ మరో పక్క కార్యకర్తలను కదనరంగంలోకి దూకాలని ఉత్సాహాన్ని నింపేందుకు ఇటీవల నియోజకవర్గాలలో పీసీసీచీఫ్, స్థానిక పార్టీ నేతలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. దీనితో పాటు రైతు చైతన్య యాత్రలను నిర్వహించారు. అధికారాన్ని హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్‌పార్టీలోని అసమ్మతి నేతలంతా వచ్చే ఎన్నికల్లో గెలుపుకోసం పాటుపడాలని నిర్ణయించారు. ఇక ఈనెల, వచ్చే నెలలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్రను నిర్వహించబోతున్నారు. గత ఆరు మాసాల నుంచి కాంగ్రెస్‌పార్టీ నేతలు ప్రజల్లో ఉంటూ నిత్యం ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరుబాట సల్పుతున్నారు. ఇదిలా ఉండగా బీజేపీ సైతం తామేమి తక్కువ అన్నట్లు తమ కార్యకలాపాలు గ్రామాల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా అధికారపార్టీపై తుఫాకి ఎక్కుపెట్టి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారు. అయితే టీడీపీకి కంచుకోట అయిన తెలంగాణాలో పూర్వవైభవం కొనసాగేందుకు ఆ పార్టీ నేతలు కార్యకర్తలకు శిక్షణకార్యక్రమాలను నిర్వహించి ఎన్నికల రణరంగంలో దూకేందుకు సన్నద్ధం చేస్తున్నారు. పార్టీలోంచి పేరున్న నేతలు ఇతర పార్టీలలోకి వెళ్లిన తర్వాత కొంత స్తబ్ధత ఏర్పడ్డ పార్టీలో కొత్త నాయకులను తయారు చేసే పనిలో రాష్ట్ర నేతలు పడ్డారు. అయితే పార్టీ నేతలు వెళ్లినా పార్టీ గ్రామాల్లో పటిష్టంగా ఉందని ప్రచారం నిర్వహిస్తున్నారు. అయితే ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో బీసీలను ఆకర్శించే విధంగా బీసీలకు అధికంగా సీట్లు ఇవ్వడంతో పాటు గెలిస్తే బీసీ సీఎంతో పాటు మాల, మాదిగలకు జనాభా ప్రాతిపదికన పదవులు ఇస్తామంటూ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. ఇక కమ్యూనిష్టులు మాత్రం పొత్తుకోసం తహతహలాడుతున్నారు. ఇప్పటికే సీపీఎం టీమాస్ పేరుతో ఉమ్మడిగా ఎన్నికలను వెళ్లాలని నిర్ణయించింది. తమకు పట్టున్న ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు నిత్యం ప్రజల్లో ఉంటూ, అధికారపార్టీపై నిప్పులు చెరుగుతున్నారు. ఇలా ఎవరికి వారుగా జనంబాట పట్టడంతో తెలంగాణాలో ఏడాదిన్నరకు ముందే ఎన్నికల వాతావారణం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది.

కాకినాడలో కేటీఎం స్టంట్‌షో



కాకినాడ: యూరోపియన్ రేసింగ్ లెజెండ్ కేటీఎం తాజాగా కాకినాడలో కేటీఎం స్టంట్ షోను నిర్వహించింది. ప్రొఫెషినల్ స్టంట్ రైడర్స్ సారథ్యంలో ఈ సాహసోపేత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రో బైకింగ్ ప్రెసిడెంట్ అమిత్ నంది మాట్లాడుతూ మా ఫెర్ఫార్మెన్స్ రేసింగ్ బైక్‌లకు ఎంతో ప్రసిద్ధి పొందింది. అందుకే మేము ఎప్పుడూ వినియోగదారులకు అత్యుత్తమ అనుభూతులను అందించేందుకు ప్రయత్నిస్తుంటాం. ఇటువంటి ప్రొఫిషినల్ స్టంట్స్‌ను ప్రతీ ప్రధాన పట్టణంలో నిర్వహిస్తూ వీటిని మరింత విస్తృత పరుస్తామన్నారు. ఇప్పటివరకూ ఈ స్టంట్‌ను సూరత్, రాజ్‌కోట్, అహ్మదాబాద్, కాంచీపురం, కోయంబత్తూరు, చెన్నయ్, విజయపూర్, లక్నో, ఇండోర్, జబల్‌పూర్, ఔరంగాబాద్, జమ్ము, జలంధర్, జోధ్‌పూర్, వారణాసి, ఇండోర్, రాంచి జంషెడ్ పూర్, జల్‌గావ్, చిప్లన్, ధూలె తదితర నగరాల్లో నిర్వహించినట్లు తెలిపారు.

మరో 4 నగరాలకు ఏసీటీ ఫైబర్‌నెట్

విశాఖపట్టణం: దేశంలో అతిపెద్ద ఫైబర్ బ్రాడ్‌బాండ్ ఐఎస్‌పీ(ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్)గా పేరుపొందిన ఏసీటీ ఫైబర్ నెట్ తన సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్, విజయవాడ, ఏలూరు, గుంటూరు మొదలైన నగరాలకు సేవలను విస్తరిస్తున్నట్లు పేర్కొంది. అలాగే నూతన వినియోగదారులకు మరిన్ని ఆఫర్లతో వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందిస్తున్నట్లు తెలిపింది. విశాఖపట్టణం విషయానికొస్తే ఏసీటీ సిల్వర్ ప్లాన్‌ను 200 జీబీకి అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపింది. అలాగే 10ఎంబీపీస్ స్పీడ్‌కు పెంచినట్లు తెలిపింది. అలాగే ఏసీటీ గోల్డ్ , ఏసీటీ డైమండ్ ప్లాన్‌లలో కూడీ స్పీడ్ మరింత పెంచినట్లు పేర్కొంది.

ఐఐఎంబీ విమెన్ స్టార్టప్ ప్రోగ్రాం



బెంగళూరు: ప్రముఖ ఎన్ఎస్ రాఘవన్ సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూరల్ లెర్నింగ్(ఎన్ఎస్ఆర్‌సీఈఎల్) తాజాగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ బెంగళూరు(ఐఐఎంబీ)లో జాతీయ స్థాయి విమెన్ స్టార్టప్ ప్రోగ్రాం(డబ్ల్యుఎస్‌పీ)ను ప్రారంభించింది.ఈ కార్యక్రమానికి గ్లోబర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(డీఎస్‌టీ) భాగస్వామ్యం వహించాయి. దీనిలో భాగంగా ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు ఆన్‌లైన్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ సంవత్సరంలో డబ్ల్యుఎస్‌పీ మొత్తం 12 వేలమంది మహిళా పారిశ్రామిక వేత్తలకు డూ యువర్ వెంచర్ పేరిట ఐదువారాలపాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. కాగా సంస్థ 2016లో దేశవ్యాప్తంగా మొత్తం 1,700 మందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించింది.

మొదటి పేజీ తరువాయి

బాబు మళ్లీ వస్తే అనర్థమే



చేయకుండా, నడిరోడ్డును ఖాతరు చేయకుండా వేలమంది నాతోపాటు అడుగులో అడుగు వేశారు. ఒకవైపు కష్టాలూ, బాధలూ నాతో చెప్పుకుంటూనే మరోవైపు నన్ను భుజం తట్టి అండగా నిలిచి తోడుగా నడిచారు. చెరగని చిరునవ్వుతో ఆప్యాయతలు, ప్రేమానురాగాలు, ఆత్మీయతలు చూపుతున్న ప్రతి ఒక్కరికీ చేతులు జోడించి శిరస్సు వంచి పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని వైస్ జగన్ అన్నారు.

చక్కర ఫ్యాక్టరీలు మూతబడే పరిస్థితి: పూతలపట్టు నియోజకవర్గానికి పక్కనే చిత్తూరు చక్కర ఫ్యాక్టరీలు కనిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో ఆరు చక్కర ఫ్యాక్టరీలు ఉండగా చిత్తూరు, రేణిగుంట చక్కర ఫ్యాక్టరీలు సహకార రంగంలో ఉన్నాయి. మిగతా నాలుగు ప్రైవేటు రంగంలో ఉన్నాయి. చంద్రబాబు ఎప్పుడు సీఎం అయినా.. సహకార రంగంలో ఉన్న చక్కర ఫ్యాక్టరీలు మూతబడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రైవేటు రంగంలోని ఫ్యాక్టరీలు మాత్రం లాభాల్లో నడుస్తున్నాయి. నిజానికి సహకార రంగంలోని చక్కర ఫ్యాక్టరీలు నడిచేలా ముఖ్యమంత్రి చూడాలి. రైతులకు మద్దతు ధర ఇచ్చేందుకు ఇవి కృషి చేస్తాయి. అప్పుడు ప్రైవేటు ఫ్యాక్టరీలు కూడా పోటీపడి రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చేందుకు ప్రయత్నిస్తాయి అన్నారు.

'వాక్ విత్ జగన్' మొబైల్ యాప్ ఆవిష్కరణ: ఆయన పాదయాత్రకు ప్రజలనుంచి విశేష ఆదరణ లభిస్తోంది. వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు అండగా మేమున్నామంటూ వైఎస్ జగన్‌తో కలిపి అడుగులు వేస్తున్నారు. ప్రజాసంకల్పయాత్రను ప్రజల్లోకి మరింత ముందుకు తీసుకెళ్లడానికి 'వాక్ విత్ జగన్' అనే ప్రత్యక యాప్‌ను తయారు చేశారు. ఈ యాప్‌లో వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర వివరాలతోపాటు ఇతర విషయాలను పొందుపరిచారు. ఇందులో ప్రతిరోజు వైఎస్ జగన్ ఎన్నికిలోమీటర్లు, ఎన్నిఅడుగులు వేస్తున్నారో తెలుసుకోవచ్చు. అంతేకాకుండా పాదయాత్రలో జననేతపాటు మనం ఎన్ని అడుగులు పాల్గొన్నామో కూడా ఇందులో ఉంటుంది. మనం నడిచిన దూరాన్ని షోషల్ మీడియాలో షేర్ చేసు కోవచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలను ఇందులో పొందుపరచనున్నట్లు వారు ప్రకటించారు. తద్వార సమస్యలు అందరికీ తెలిసే అవకాశం ఉంటుందని తెలిపారు.



జనహిత ప్రజాహిణిలో వచ్చే వినతులను పరిష్కరించాలి : కలెక్టర్

దరఖాస్తుల పరిష్కరించుటలో అలసత్వం వహించవద్దు

సూర్యాపేట మేజర్‌న్యూస్ : జిల్లా నలుమూలల నుండి వివిధ సమస్యలపై ప్రతి సోమవారం నిర్వహించే జనహిత ప్రజాహిణి కార్యక్రమానికి వివిధ సమస్యలతో విచ్చేసే దర ఖాస్తులను పరిష్కరించే విషయంలో ఏలాంటి అశ్రద్ధ అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన జనహిత ప్రజావాణి కార్యక్రమములో ఆయన మాట్లాడుతూ పేద,మధ్య తరగతిలో పాటు, చిన్న, సన్నకారు రైతులు అనేక సమస్యలపై ప్రజావాణిలో పరిష్కారం కొరకు వందల సంఖ్యలో వస్తుంటారు. కాబట్టి వారి యొక్క సమస్యలను సానుభూతితో సకాలంలో పరిష్కరించాలని తద్వారా ప్రజల్లో అధికార యంత్రాంగపై తమ సమస్యలు వెంటనే పరిష్కరించి న్యాయం చేస్తున్నారు అనే శాస్త్రనే ఒక గట్టి నమ్మకం ప్రజ లలో నాటుకు పోతుందని అన్నారు. ఈసందర్భంగా జనహిత ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ప్రజల నుండి పలు సమస్యలకు సంబంధించిన విన్నపాలను స్వీకరించారు అలాగేచింతల పాడు గ్రామం దొండపాడు మండలానికి చె ందిన 30 మంది ఎస్.సి కులస్తుల 290,292 సర్వే నెంబర్‌లోలో ఒక్కొక కుటుంబానికి 3ఎకరాల చొప్పున ప్రభుత్వ భూమి ఇప్పించాలని కోరగా అట్టి దరఖాస్తు లను పరిష్కరించాలని కోదాడ ఆర్డీఓకి సిఫారసు చేశారు. ఇంక పలు మండలాలు గ్రామాలకు చెందిన వందల మంది భూ సంబందిత తదితర వాటిపైన పలు విన్నపాలు సమర్పించగా వాటిని వెంట వెంటనే పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలని సంబందిత అధికారులకు సిఫారసు చేశారు.

పేదల ఆత్మగౌరవానికి ప్రతీక డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- దశల వారీగా అర్హులందరికి రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తాం
- రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు

కరీంనగర్- సూర్యప్రతినిధి : దశల వారిగా అర్హులందరికి రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం, పెద్దురు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి కేటిఆర్, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటెల రాజేందర్, ఎంపి బోయిని పల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేష్ బాబు, రసమయి బాలకిషన్‌లతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. మొదట సిరిసిల్ల మండలం పెద్దురు గ్రామంలో రూ.20.17 కోట్ల తో నిర్మించనున్న 400 రెండు పడక గదుల ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అనంత రం సిరిసిల్ల పట్టణం బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.5లక్షల రూపా యలతో ఏర్పాటు చేసిన ఒపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఆ వెంటనే సిరిసిల్ల పాత బైపాస్ రోడ్డులోని రూ.10 కోట్ల 60 లక్షలతో నిర్మించనున్న 200 పడక గదుల ఇండ్ల నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. అక్కడే రూ.2 కోట్లతో నిర్మించ నున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భవన నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. అనం తరం ఇటివలే పూర్తి చేసుకున్న భార్ అసోసియేషన్ భవనంకు ప్రారంభించారు. చివరగా రూ.3 కోట్లతో నిర్మించ నున్న జిల్లా గ్రంథాలయ భవనంకు శంకుస్తాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం ను తమ ప్రభుత్వం సిఎం కేసిఆర్ పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక భావిస్తున్నారన్నారు. అందుకే ఎన్నడు లేని విధంగా 560 చదరపు అడగులతో చక్క ఇంటి నిర్మాణం చేపడుతున్నామన్నారు. మండేపల్లిలో 1260 ఇండ్ల నిర్మిణం శరవేగంగా సాగు తుందని, వచ్చే 6 నెలలో నిర్మాణం పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామన్నారు. దళారి వ్యవస్థ లేకుండా పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉంటుందన్నారు. పెద్దురు సమీపంలోని బైపాస్ రోడ్డు వెంట బెటాలియన్, పాలిటెక్నిక్ కళాశాల, అపెరల్ పార్క్ కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డు వంటివి రానున్నామన్నారు. దీని వల్ల ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. వీటితో పాటు కరెంటు, సాగునీరు, త్రాగునీరు, కళ్యాణ లక్ష్మి, సన్నబియ్యం వంటి గొప్ప పథకాలు తమ ప్రభుత్వం చేపడుతుందన్నారు. మంత్రి ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల, సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వ కృషి చేస్తుందని అన్నారు. ఇంత గొప్పగా పాలన సాగిస్తున్న ప్రభుత్వా నికి ప్రజల ఆవశ్యకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కృష్ణ భాస్కర్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మేన్ శ్రీధర టెస్కాబ్ ఛైర్మేన్ కొండురి రవిందర్, ఎమ్మెల్యే గంగులకమలాకర్, ఛైర్‌పర్సన్ సామల పావని పాల్గొన్నారు.



పోలీసు గ్రీవెన్స్ డేతో బాధితులకు భరోసా



సూర్యాపేట, మేజర్‌న్యూస్ : ప్రజల సౌకర్యార్థం పోలీసు గ్రీవెన్ డేతో బాధితులకు భరోసా కల్పించడం కోసం జిల్లా పోలీసు కార్యాలయం నందు ప్రతి సోమవారం పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించడం జరుగు తుందని జిల్లా అదనపు యస్.పి ఇస్మాయిల్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్స్ డేకు 7 ఫిర్యాదులు రాగ, ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసు కోవాలని సంబందిత పోలీసు అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ లక్షాలను సాదించే దిశగా నిర్విరా మంగా కృషి చేయాలని, నేర్చుకున ప్రతి అంశము భవిష్యత్తులో ఉపయోగ పడుతుందని అన్నారు. తల్లిదండ్రుల పేరు నిలుపు ఇతరులకు ఆదర్శంగా నిలవా లని యువతకు తెలిపారు.

పోలవరం పూర్తయ్యే వరకు పోరాటం



కొవ్వూరు, మేజర్‌న్యూస్ : కాంగ్రెస్ పార్టీ మానసపుత్రిక అయిన పోల వరం ప్రాజెక్టను 2018 నాటికి పూర్త య్యే వరకు తమ ఉద్యమం ఆగదని ఏపీ పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి అన్నా రు. సోమవారం డీసీసీ అధ్య క్షులు ఎండీ రఫిఉల్లాబేగ్ నివాసం వద్ద జరిగిన విలేకర్ల సమావేశంలో రఘువీరారెడ్డి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట కోసం చేపట్టిన మహాపాదయాత్రకు రైతులు,ప్రజలను నుండి మంచి స్పందన లభించిందని అన్నారు.

పోలవరం ప్రాజెక్టలో పెంచుకున్న అంచనాలు ఏ విధంగా పంచు కోవాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బెంబేలు పడుతున్నాయాన్నారు. తాము అదికారంలో ఉండి ఉంటే పోలవరం ఈ పాటికే పూర్తయ్యి ఉండేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టకు పూర్తి ఫలాలు అందే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకడుగు వేయదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మూడున్నర సంవత్సరాల కాలంలో పోలవరానికి ఇందిరా సాగర్ ప్రాజెక్ట అనే పేరును తొలగించటం తప్ప చేసిం దేమి లేదన్నారు. 2018 నాటికి పోలవరం పూర్తి చేయకపోతే టిడిపి, బిజెపి ప్రభుత్వాలు ఎన్నికల్లో నామినేషన్లు వేసే అర్హత లేదన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు జేడీ శీలం, పనబాక లక్ష్మి, వట్టి వసంతకుమార్,ఎస్.తులసిరెడ్డి పాల్గొన్నారు. అలాగే ఈ పాదయ్త్రాలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పోట్ల చేరిక కాంగ్రెస్‌కు కలిసొస్తుందా?





- వర్గపోరులో నెగ్గుకు రాగలరా?
- ఖమ్మం టిక్కెట్ పోట్లకు ఖాయమేనా?
- సామాజికవర్గం ఆదరిస్తుందా?
- రేణుకా చౌదరి చక్రం తిప్పగలరా?

ఖమ్మం, సూర్యబ్యూరో : మాజీ ఎమ్మెల్సీ ఇటీవలే టిఆర్‌యస్‌కు రాజీనామా చేసిన పోట్ల నాగేశ్వరరావు ఆలస్యమైనా అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. శుక్రవారం తన అనుచరులతో కలిసి ఢిల్లీకి వెళ్ళిన ఆయన మొదటి రోజు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ కుంతియాను కలిశారు. ఆ రోజున రాహుల్ గాంధీ అందుబాటులో లేకపోవడంతో శనివారం రాహుల్ గాంధీ సమక్షంలో ఎఐసిసి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పోట్ల చేరిక కాంగ్రెస్ పార్టీకి ఎంతవరకు కలిసి వస్తుంది? ఆయనకు ఎంత వరకు లాభిస్తుంది? వర్గపోరులో ఆయన నెగ్గుకు రాగలరా? ఖమ్మం అసెంబ్లీ టిక్కెట్ ఆయనకు లబిస్తుందా? తన సామాజికవర్గం ఆదరిస్తుందా? లేదా? తెలంగాణ వ్యతిరేకిగా ముద్రపడిన రేణుకా చౌదరి జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పగలరా? లేదా? విషయాలు చర్చకు వస్తున్నాయి. జిల్లాలో కాంగ్రెస్‌కు బల మైన ఓటు బ్యాంకు ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడిజిల్లాలో 10 అసెంబ్లీ సీట్లలో 4 కాంగ్రెస్ ఖాతాలోని చేరాయి. బడుగు బలహీన వర్గాలు మొదటి నుంచి కాంగ్రెస్‌కు వెన్ను దన్నుగా ఉన్నాయి. అయితే ఇప్పుడు జిల్లా కేంద్రమైన ఖమ్మం లో కాంగ్రెస్ కార్యకర్తలను నేనున్నాననే భరోసా ఇచ్చేనాయకుడు కరవయ్యాడు. పార్టీ కార్యకర్తల మనోభావాలను పోట్ల ఏ విధంగా గెలుచు కుంటారనే దానిపై ఆధారపడి ఆయన రాజకీయభవిష్యత్ ఉంటుందనేది పరిశీ లకుల భావన. కాంగ్రెస్‌లో రాజకీయాలు ఆశక్తికరంగా ఉంటాయనేది జగమె రిగిన సత్యమే. ఇప్పటికే జిల్లాలో మూడు గ్రూపులు ఉన్నాయి. పోట్ల చేరిక సందర్భంగా మిగతా గ్రూపుల వారు ఎవరు అక్కడ కనపడలేదు. ఆయన కూడా తన సామాజిక వర్గా నికి చెందిన రేణుకా ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లుగా ఉంది. పోట్ల తాను వేసే అడుగులను భట్టి కాంగ్రెస్‌లో ముందుకు పోగలరు. గత కొంత కాలం క్రితం టిఆర్‌యస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు చెప్పారు. గుజరాత్ ఎన్నికల నేపద్యంలో ఎఐసిసి అధ్యక్షులు రాహుల్ గాంధీ బిజిగా ఉండటంతో కొంత ఆలస్యం అయింది. ఎన్టీఆర్ తెలుగు దేశం స్థాపించిన సందర్బంలో రాజకీయాలపట్ల ఆకర్షితుడైన పోట్ల ఆపార్టీలో చేరారు. ఆయనకోసమే తెలుగుదేశం ప్రభుత్వ యువశక్తి అనేకార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి ఆయన్ను దానికి చైర్మన్‌గా నియమించింది. నాటి నుంచి తెలుగుదేశం రాజకీయాల్లో ఉన్న పోట్ల నాగేశ్వర రావు సుజాత్‌నగర్ నుంచి దివంగతనేత కాంగ్రెస్‌కు చెందిన మాజీమంత్రి రాంరెడ్డి పై పోటిచేసి ఓడిపోయారు. తెలుగుదేశంలోనే కొనసాగుతున్న పోట్ల రాష్ట్ర విడిపోయిన అనంతర కూడా కొన్ని నెలలపాటు దేశాన్నే అంటిపెట్టుకుని ఉన్నారు. తెలుగుదేశం ఉనికి తెలంగాణలో ప్రశ్నార్ధ కంగా మారటంతో ఆయన ఆలోచనలో పడ్డారు. టిఆర్‌యస్‌లో చేరటం ద్వారా తన రాజకీయభవిష్యత్ బాగుంటుందని భావించి తుమ్మల నాయకత్వంలో టిఆర్‌యస్‌లో చేరారు. టిఆర్ఎస్‌లో ఆయన ఆశించిన స్థాయిలో గుర్తింపు రాకపోవటంతో మనస్తాపా నికి గురైన పోట్ల తన రాజకీయవ్యూహన్ని మార్చాలని నిర్ణయించుకుని ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. స్వతహగా మంచి వ్యక్తే అయినప్పటకి దూకుడుగా వ్యవహరించక పోవటం, ప్రత్యేకవర్గాన్ని మెయింటెన్ చేయకపోవటం లాంటి మైనస్ పాయింట్లు ఆయనకు ఉన్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. అయిన ప్రస్తుతం ఖమ్మం అసెంబ్లీ నుంచి కాంగ్రెస్ టిక్కెట్‌ను ఆశిస్తున్నారు. అయితే అలాంటి షరతు ఏమిలేకుండానే తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఇప్పటికే ఖమ్మం అసెంబ్లీని కాంగ్రెస్ నుంచి పలువురు ఆశిస్తున్నారు. ఇందులో పోట్ల ఒకరుగా ఉన్నారు. కాంగ్రెస్ రాజకీయాలు విచిత్రమైనవి అందులో ఆయన ఏ విధంగా నెగ్గుకు రాగలరు అనేది చూడాలి. మరో యేడాదిలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకోసం పార్టీలు,అభ్యర్దులు ఇప్పటి నుంచే సర్దుకునే పనిలో పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఈసారి ఏలాగైనా జెండా ఎగరేయాలని చూస్తున్న కాంగ్రెస్ అందుకు అనుగుణంగా పావులు కదుపు తుంది. ఇప్పటికే జిల్లాలో అభ్యర్థుల గుర్తింపులో నిమగ్నమైన ఆపార్టీకి అధికార టిఆర్‌యస్ నుంచి కూడా చేరికలు ప్రారంభమైయ్యాయి.

పోట్లతోపాటు పలువురు టిఆర్‌యస్‌కు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. వీరిలో మాజీ జడ్పీటీసి దేవ్లానాయక్, ఇతర ఎంపిటిటిలు, సర్పంచ్‌లు ఉన్నారు. దీంతో టిఆర్‌యస్ నుంచి ఇతర పార్టీలకు వలసలు ప్రారంభమైయ్యాయి. ప్రత్యేకించి కాంగ్రెస్‌లోకి రావటంపై కాంగ్రెస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేశాయి. పోట్ల నాగేశ్వరావు టిఆర్‌యస్‌కు రాజీనామా చేస్తున్న సందర్బంగా టిఆర్‌యస్ ప్రభుత్వ వైఖరిపై విమర్శలు గుప్పించటంతో పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ వైఖరి నిరంకుశంగా ఉందని ధ్వజమెత్తారు. జిల్లాలో బలమైన సామా జిక వర్గానికి చెందిన పోట్ల చేరిక కాంగ్రెస్‌కు ఎంతవరకు ఉపయోగపడు తుంది? వర్గ రాజకీయాల్లో ఏ విధంగా సర్దుకు పోగలరనే అంశాలు ఆసక్తి కరంగా మారాయి.

నవ్యాంధ్ర నిర్మాణంలో చిత్రకారులు భాగస్వాములు కావాలి



విజయవాడ, సూర్యబ్యూరో : నవ్యాంధ్ర ప్రదేశ్ నిర్మాణంలో చిత్ర కారులందరూ భాగస్వాములు కావా లని, ప్రపంచం మొత్తం కీర్తించేలా నవ్యాంధ్ర శోభను ద్విగిణీకతం చేయాలని ప్రభుత్వ కమ్యూనికేషన్ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్ చిత్రకారులను కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యం లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి సంబంధించిన అంశంపై చిత్రాలు వేసే కార్యక్రమాన్ని సోమవారం ఉదయం మహాత్మాగాంధీ రోడ్డులోని బాపూ మ్యూజియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర కాల ప్రభాకర్ మాట్లాడుతూ అన్యాయంగా, అశాస్త్రీయంగా విడగొట్టబడిన రాష్ట్రం అనేక ఒడిదుడుకుల మధ్య రెండు చేతులు కూడగట్టుకుని నిలబడిం దని, ప్రభుత్వం నేడు మహాయజ్ఞం చేస్తుందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కళాకారులు, చిత్రకారులను రాష్ట్ర నిర్మా ణంలో భాగస్వామ్యం చేయడం జరిగిందన్నారు. చిత్రకారుల భావాలు అభినందనీ యమని ప్రశంసిం చారు. చిత్రకారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జన్మభూమి - మా ఊరు నిర్వహ ణకు సంబంధించి చిత్రకారులు తమదైన శైలిలో అదుతేమైన చిత్రాలు వేయా లని సూచించారు. సోమ, మంగళవారాల్లో చిత్రాలు పూర్తిచేయాలని వాటిని ఈనెల 19న జరిగే జన్మ భూమి రాష్ట్ర స్థాయి సత్కార సభలో ముఖ్యమంత్రి సమక్షంలో ప్రదర్శి స్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 40 మంది చిత్రికారులు పాల్గొని చిత్రాలు గీసే పనిలో నిమగ్నమయ్యారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచా లకులు డాక్టర్ డి.విజయభాస్కర్, స్టేట్ మ్యూజియం అడ్వయిజర్ అమరేశ్వర్ గల్లా, చిత్రకారులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమానికి యజ్ఞ, యాగాదులు అవసరం'

విజయవాడ, సూర్యబ్యూరో : నవ్యాంధ్ర రాష్ట్ర అమరావతికి, ప్రజా సంక్షే మానికి యజ్ఞ, యాగాదులు చేయవలసిన అవసరం వుందని రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం మంగళగిరి సమీ పంలో యన్.ఆర్.ఐ ఆసుపత్రి వద్ద అఖిల విశ్వ గాయత్రి పరివార్ శాంతి కుంజ్, హరిద్వార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అశ్వమేధ గాయత్రి మహ యజ్ఞం" ముగింపు కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. సహనానికి, జ్ఞానానికి చిహ్నం శక్తి అని, ఇటువంటి శక్తి యజ్ఞయాగాదుల ద్వారా లభిస్తాయని ఆయన చెప్పారు. దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో 42 యజ్ఞాలు జరుగగా, యన్.ఆర్.ఐ సమీపంలో జరుగుతున్నది 43వ యజ్ఞం అని ఆయన తెలిపారు. భగవంతుడు సృష్టించిన ప్రకృతిని సమాజం కోసం కాపాడుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలువునిచ్చారు. వ్యవసాయం, అనుబంధ రంగాల రైతుల సంక్షేమానికి "ఏరువాక", నీటి పరి రక్షణ కోసం "జల సిరి", గోదావరి కృష్ణ పుష్కరాలలో నదీమ తల్లికి పవిత్ర హారతి కార్యక్రమాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. సూర్యభగవానుడు మానవాళి మనుగడకు, ప్రక తి పరిరక్షణకు అన్ని ఇస్తున్నం దున, సోలార్ విధానం ద్వారా వాటిని కాపాడుకునేందుకు త్వరలో "సూర్య ఆరాధన" కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరు గైన జీవన ప్రమాణాలు అందాలంటే యజ్ఞ ఫలాలు సంతృప్తిగా అందాలని ఆయన సూచించారు. నూతన రాజధాని అమరావతిలో గాయత్రి పరివార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే తగిన స్థలాన్ని కేటాయిం చేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. తొలుత యజ్ఞకర్త చిన్మయ్ పాండ్య సీఎంకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి వుల్లారావు, రాష్ట్ర సాంఘిక గిరి జన సంక్షేమ శాఖలమంత్రి నక్కా ఆనందబాబు, జిల్లా కలెక్టరు కోన శశిధర్, గుంటూరు అర్బన్ యస్.పి సిహెచ్. విజయరావు, గాయత్రి పరివార్ దక్షిణ భారత సమన్వయకర్త అశ్విని సుబ్బారావులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకలు పకడ్బందీగా నిర్వహించాలి

అభివృద్ధి సంక్షేమ పథకాలపై శకటాలు ఏర్పాటు చేయాలి : కలెక్టర్



సూర్యాపేట, మేజర్‌న్యూస్ : జనవరి-26న నిర్వహించనున్న గణతంత్ర వేడుకలు ఎటువంటి లోటుపాట్లు లేకుండ విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర కార్యాలయ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై అన్ని ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆహ్వాన పత్రికల ముద్రణతో పాటు, స్టాల్స్ ఏర్పాటుకు అవసరమైన టెంట్లు డిఆర్‌డిఎ పథక సంచాలకులతో మాట్లాడి ఏర్పాటు చేయాలని, సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసే ఎట్‌హోం కార్యక్రమంలో ప్రోటోకాల్ ప్రకారం, స్వాతంత్ర్య సమరయోధులకు, విఐపిలకు డియస్‌ఓ సహకారం, సమన్వయంతో మంచినీరు, స్నాక్స్, టీలు ఏర్పాటు చేయాలని, రెవెన్యూ డివిజన ల్ అధికారి, తహశీల్దార్‌ల సూచలనతో త్రాగునీరు, పరిసరాల పరిశుభ్రత ఏర్పాట్లు చూడా లని మున్సిపల్ కమీషనర్‌ను ముఖ్యప్రణాళిక అధికారి మరియు డిపిఆర్‌వోలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలు వివిధశాఖల నుండి సేకరించి జిల్లా కలెక్టర్ ప్రసంగపాఠాన్ని సిద్ధం చేసి 18 నాటికి కలెక్టర్ ఆమోదానికి వుంచాలని, ముద్రించిన ప్రసంగ పాఠాన్ని జిల్లా పౌరసంబందాల అధికారి ద్వారా పెరేడ్ గ్రౌండ్స్‌లో పంపిణి చేయుటంతోపాటు ప్రెస్, ఫోటో, వీడియో కవరేజీ చూడా లని కలెక్టర్ సూచించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అత్యవసరమైన మందు లతో కూడిన అంబులెన్స్‌ను, ఎస్పీఎంపిడిసిఎల్ వారు నిరంత ర విద్యుత్ సరఫరా, అగ్నిమాపక శాఖ వాహనం సిబ్బందితో అందుబాటులో ఉండే విధంగా, ఉద్యానవన శాఖ అధికారి వేదికనుపుష్పగుచ్చాలతో సుందరంగా తీర్చి దిద్దే ఏర్పాట్లు చేయాలని, అంతేకాక అన్ని శాఖ అధికారులు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల జాబితాను అందజేయాలన్నారు. ఈసమావేశంలో సం యుక్త కలెక్టర్ డి. సంజీవరెడ్డి, ట్రైనీ కలెక్టర్ ఉదయ్‌కుమార్, డిఆర్‌వోపి యాది రెడ్డి, సిపివో సుబ్బారావు, డిఆర్‌డివో కిరణ్‌కుమార్‌తోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చండి - బహిరంగ చర్చలకు సవాలు మానండి

విజయవాడ, సూర్య బ్యూరో : టీడీపీ ఎమ్మెల్సీ బుద్దావెంకన్న, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబుని ఉద్దేశించి ఒక చర్చలో మాట్లాడుతూ అసలు రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలనలో వృద్దాప్య, విక లాంగ, వితంతు ఫించన్లు నూటికి నూరు శాతం అందరికి ఇచ్చామని అసలు పెండింగ్‌లో దరఖాస్తులు లేవని ఆర్భాటంగా ప్రకటించడం హాస్యాస్పదంగా వుందని పశ్చిమ నియోజకవర్గం 40వ డివిజన్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధికార ప్రతినిధి దాడి జగన్ తన కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. అయిదవ విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమం ఒక ప్రహసనంగా మారింది. ఈ సందర్భంగా దాడి జగన్ మాట్లాడుతూ అంబటి రాంబాబు బహిరంగ చర్చకు రమ్మని పిలిస్తే గుంటూరు జిల్లా చుట్టుగుంట వద్దకు బుద్ద వెంకన్న అనుచరులతో వెళ్ళడం, అంబటి రాంబాబుని అక్కడకు రానివ్వకుండా ముందస్తు వ్యూహంతో వారి నివాసం వద్దే అరెస్టు చేయించి పోలీసులతో నిలువరించడం రాష్ట్ర ప్రజలు మొత్తం గమనిస్తున్నారన్నారు. మొన్న రుణమాఫీ, ఇంటికొక ఉద్యోగం అని, ఈ రోజు ఫించన్లు అసలు టీడీపీ హామీలు నీటిమూటలుగా మిగులుతున్నాయన్నారు. మీరు వుంటున్న పశ్చిమ నియోజవకర్గంలో మేము ఎంతమంది పెన్షన్ బాధి తులు వున్నారో వారిని తీసుకొని మీ దగ్గరకు వస్తాం. మీరు దానిమీద చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. ఊకదంవుడు ఉపన్యాసాలు మానుకొని బహి రంగ చర్చలకు సవాలు విసరడం మీ చవకబారు రాజకీయాలకు నిదర్శన మన్నారు. ప్రజలు రాబోయే ఎలక్షన్స్‌లో సరైన సమాధానం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, ఎండి మహ్మద్, అండలూరి లత, బత్తుల పాండు, విశ్వనాథ రవిలు పాల్గొన్నారు.



చంద్రన్నతో కలిసి నడుద్దాం - నవ్యాంధ్ర ప్రగతికి బాటలు వేద్దాం

- పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం
- 'జన్మభూమి-మా ఊరు' సభలో మంత్రి శిద్ధా
- రైతు రథం ట్రాక్టర్లు పంపిణీ చేసిన మంత్రి

వెలగపూడి, ప్రతినిధి :పేదల సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నాడని రాష్ట్ర మంత్రి శిద్ధా రాఘవరావు తెలిపారు. ఆయన కలిసి ప్రయణిస్తూ నవ్యాంధ్ర అభివృద్ధి భాగస్వాములు కావాలని మంత్రి శిద్దా పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 5వ విడుత జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా అమరావతి మండలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శిద్ధా, పెద్దకూరపాడు ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు. ముందుగా నందమూరి తారకరావు, పరిటాల రవీంధ్ర విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ మూడున్నరేళ్ల కాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గురించి వివరించారు. పేదల సంక్షేమంగా ఉండాలన్న ధ్యేయంతో చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నాడన్నారు. ఆయన సారథ్యంలో




నవ్యాంధ్ర అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు.

ఆయన బాటలో నడుస్తూ నవ్యాంధ్ర ప్రగతిలో భాగస్వాములు అవుదామని మంత్రి శిద్ధా పిలుపునిచ్చారు. అనంతరం రైతు రథం పథకం క్రింద మంజూరు అయిన ట్రాక్టర్లను మంత్రి లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖాధి కారులు, ప్రజలు పాల్గొన్నారు.

నల్లధనాన్ని వెలికితీయడంలో మోడీ వైఫల్యం

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి



విజయవాడ, సూర్య బ్యూరో : భారతీయ జనాతాపార్టీని అధికారం నుంచి తప్పించడమే తక్షణ రాజకీయ కర్తవ్యమని సీపీఐ జాతీయ ప్రధాన కార్య దర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. సోమవారం సీపీఐ జాతీయ సమితి సమావేశాలలో ఆయన మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కి తెస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టు కోవడంలో మోడీ పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. స్వయంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా కుమారుడు జేషా అవినీతి బయటపడినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పాలన, న్యాయ వ్యవస్థలను సైతం తమ గుప్పిట్లోకి తీసుకొని నియంత్రించేందుకు ప్రయత్ని స్తోందన్నారు. రైలు, బస్సులపై కూడా డీజిల్ ధరల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతుండ డంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్నిచోట్లా నిరుద్యోగం తాండవి స్తోందన్నారు. ఇక అంతర్జాతీయ విషయాలను ప్రస్తావిస్తూ అగ్రరాజ్యం అమె రికా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తన పెత్తనాన్ని చూపేందుకు ప్రయత్నిస్తోం దన్నారు. ఆ దేశంలో విపరీతమైన నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం కారణంగానే అక్కడి పేద, మధ్యతరగతి ప్రజలి చ్చిన తీర్పుతోనే డోనాల్డ్ ట్రంప్ అధికారం లోకి వచ్చారన్నారు. ఇక అమెరికా ఉత్తర కొరియా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సహా ఆయా దేశాల్లో నెల కొన్న ఆర్థిక సంక్షోభాలు, రాజకీయ పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీపీఐ కార్యదర్శి కె రామకృష్ణ, కేంద్ర కార్యదర్శి వర్గసభ్యులు హషీమ్ ఫైజీ, డి రాజా, కె నారాయణ, రామేంద్రకుమార్, అతుల్ కుమార్ అంజన్, పన్నీర్ రవీంద్రన్, నాగేంద్రనాధ్ ఝా, అమర్‌జిత్‌కౌర్, వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన రాష్ట్ర సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అప్లికేషన్ స్టోర్‌గా టిస్-కాస్

విజయవాడ, సూర్య బ్యూరో : తెలంగాణ పోలీసు ఆవిష్కరించిన నూతన సాంకేతిక పరిజ్ఞానం టిఎస్‌సిఓపి అప్లికేషన్ పై పోలీసు స్టేషన్ సిబ్బందికి జిల్లా పోలీసు కార్యాలయం నందు శిక్షణ అదనపు యస్.పి ఇస్మాయిల్ సోమవారం ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పోలీసు సిబ్బంది విధి నిర్వహిణ, కేసుల దర్యాప్తు, కేసుల వివరాలను ఉంచడం కోసం సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అనేక పోలీసు అప్లికేషన్స్ ను ఇపయోగిస్తున్నారు. 54 రకాల పోలీసు అప్లికేషన్స్ ఒకే చోట ఒకే అప్లికేషన్లో ఉంచడం కోసం తెలంగాణ డిజిపి మహేందర్‌రెడ్డి ఐపిఎస్, టిఎస్‌సిఓపి అనే కొత్త అప్లికేషన్‌ను ఆవిష్కరించారని అన్నారు.

పోలవరం అడ్డుకునేందుకు కాంగ్రెస్, వైసీపీ కుట్ర

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణ

పోలవరం సూర్య ప్రతినిధి : రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడానికి రాష్ట్రంలో నదులు అనుసంధానం చేపట్టడమే తెలుగుదేశం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గోదావరి, పెన్నా, నాగావళి, వంశధార నదులు అనుసంధానం వల్ల రాష్ట్రానికి సాగు, తాగునీటి కొరత తీరడంతో పాటు పారిశ్రామికంగా అభివద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. సోమవారం ఉదయం పోలవరం ప్రాజెక్టును సందర్శించిన ఆయన పనుల ప్రగతిని పరిశీలించారు. అగ్రిగేట్ కూలింగ్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎగువ కాపర్ డ్యామ్ జట్ గ్రౌటింగ్ పనులకు పూజలు నిర్వహించారు. స్పిల్‌వే, ఎగువ కాపర్ డ్యామ్, డయాఫ్రం వాల్, గేట్ల తయారీ పనులను పరిశీలించారు. ఈ సందరేంగా పనుల ప్రగతిని ఇంజనీర్లను ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, వైసీపీ పార్టీలు పోలవరం ప్రాజెక్టును అడ్డుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టే ధోరణితోనే కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర చేపట్టిందని ఆరోపించారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయని తెలిపారు. కొత్త అగ్రిగేటర్ కూలింగ్ ప్లాంట్ వల్ల రోజుకు 5000 వేల క్యూబిక్‌మీటర్ల కాంక్రీట్ పనులు చేయడానికి వీలవుతుందని వెల్లడించారు. ఈ ప్లాంట్ వల్ల స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పనులు పుంజుకుంటాయని పేర్కొన్నారు. డయాఫ్రం వాల్ పనులు అనుకున్న లక్ష్యం మేరకు సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 29 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడానికి లక్ష్యం నిర్దేశించుకోగా ఇప్పటికి 9 ప్రాజెక్టులు పూర్తి చేశామని, మరో 8 ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. గోదావరి, పెన్నా నదుల అనుసంధానం 5 ఫేజ్‌ల ద్వారా పూర్తి చేస్తామని తద్వారా రాష్ట్రం సుభిక్షం అవుతుందని సీఎం స్పష్టం చేశారు.



స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతా

- కరెంటు చార్జీలు పెంచం
- రూ. 24 వేల కోట్లతో రుణమాఫీ
- వేగేశ్వరపురం జన్మభూమి - మా ఊరులో సీఎం చంద్రబాబు

తాళ్ళపూడి, మేజర్‌న్యూస్ : పశ్చిమ గోదావరి జిల్లాలోని, తాళ్ళపూడి మండలం, వేగేశ్వరపురం గ్రామంలో సోమవారం జరిగిన జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వనరుల ద్వారా సంపదను సృష్టించి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రాన్ని విడగొట్టి కాంగ్రెస్ నాయకులు కోలుకోలేని దెబ్బ కొట్టారని, కుటుంబం విడిపోతే కనీస ధర్మం కూడా పాటించకపోవడంతో సమీష్ట కృషి ఫలితంగా తిరుగులేని శక్తిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. గాలి, నీరు, సూర్యరశ్మిని వినియోగించి సంపదను సృష్టిస్తామని ఈ మేరకు త్వరలోనే పటిష్టమైన ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. నీటి వనరు సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో ముందడుగు వెయ్యడానికి తగు ఆలోచనలు చేస్తున్నామని తెలిపారు.

రాజమండ్రిలో గోదావరి పుష్కరాలు మహాపుష్కరాలు కావడంతో గోదావరి మాతకు అఖండ జ్యోతి వెలిగించామని ఆనాటి నుండి గోదావరి హారతి ద్వారా గోదావరి రుణం తీర్చుకుంటున్నామని, కృష్ణ పుష్కరాలు సందర్భంగా పవిత్ర హారతి పేరుతో గోదావరి, కృష్ణానదుల అనుసంధానం చేపట్టి నీటి వనరులను సముద్రంలోనికి పోకుండా ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన చేస్తున్నామని, ఇప్పటి వరకు రూ.50 వేల కోట్లు సేద్యపు నీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశామని స్వర్గీయ ఎన్టీఆర్ సీఎంగా పనిచేసిన కాలంలో శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు, తాను శంకు స్థాపన చేసిన ప్రాజెక్టులను పూర్తిచేసి నేడు వాటికి ప్రాధాన్యత ఇచ్చి ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టామని ముఖ్యంగా 29 ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికపై పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు.

నీరు బంగారంతో సమానమని నీళ్ళు లేకపోతే అభివృద్దే లేదని అందుకే జనసిరి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇచ్చామని ఇకపై రాష్ట్రవ్యాప్తంగా జలసిరి హారతి కార్యక్రమాన్ని చేపట్టి మన సంస్కృతిని చాటి చెప్తామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో జలసిరి హారతి నిర్వహించి నీటి పవిత్రతను అందరికీ తెలియజేస్తామని, విదేశీయుడైన కాటన్ మహాశయుడు గోదావరి నదిపై బ్యారేజి నిర్మించి ఉండబట్టే గోదావరి జిల్లాలు నేడు కరవు లేకుండా అభివృద్ధిలో ముం దంజలో ఉన్నాయని అందుకే విదేశియుడైనప్పటికీ మన పెద్దలతో సమానంగా కాటన్ మహాశయుడ్ని పూజిస్తున్నామని అదే మన సంస్కృతి అని తెలిపారు.

కార్తీకమాసంలో వనమహోత్సవాలు : రాష్ట్రంలో ప్రజలు ఆరోగ్యంగా, ఆహ్లాదంగా జీవించాలంటే చెట్లు ఎంతో అవసరమని, చెట్టు ప్రాణంతో సమానమని, చెట్లు విషవాయువులను స్వీకరించి మనకు ఆక్సిజన్ అందిస్తుందని దానివలన ఆహ్లాదంగా ఆనందంగా జీవిస్తూ ఆరోగ్యంగా ఉంటున్నామని చంద్రబాబు అన్నారు. ప్రతి కార్తీక మాసంలో వనమహోత్సవ కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పచ్చదనాన్ని పెంచుతామని అన్నారు.

త్వరలోనే సూర్యాదరణ : ఈ నెలలోనే రాష్ట్ర వ్యాప్తంగా సూర్య భగవానుని ఆరాధించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని, మనమంతా ఆరోగ్యంగా ఉండాలంటే సూర్యకిరణాలు మనపై పడాలని, సృష్టిలో సూర్యుడు శక్తి అవసరమని అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే సూర్యాధరణ కార్యక్రమం చేపడతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో విద్యుత్ యూనిట్ రూ.14కు కొనుగోలు పరిస్థితి ఉందని, ప్రస్తుతం సోలార్ ఎనర్జీ అందుబాటులోకి రావడంతో యూనిట్ రూ.3కే వస్తుందని కరెంటు విషయంలో ఏపికి ఢోకా లేదన్నారు. 1999లో తాను ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చి భవిష్యత్తు అవసరాలకోసం నీరు, బొగ్గు, గ్యాస్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించామని అందువలన రాష్ట్రానికి ఎంతో మేలు జరిగిందని చంద్రబాబు పేర్కొన్నారు.

కరెంటు చాలా కీలకం : కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక వ్యవసాయ రంగంతో పాటు వేలాది పరిశ్రమలు మూతపడ్డాయని, పారిశ్రామిక వేత్తలు దివాళా తీసారని, కొన్ని చోట్ల రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అందువల్ల తాను ఇచ్చిన హామీ మేరకు రూ.24 వేల కోట్లు రుణ మాఫీ చేసానని అన్నారు.



ఇప్పు డు మిగులు కరెంటు ఉత్పత్తి కోసం తాను చేస్తున్న కృషివల్ల ప్రజలకు 24 గంట లు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో కరెంటు చార్జీలు పెంచ నని, అవసరమైతే ఇంకా తగ్గిస్తానని చంద్రబాబు ప్రకటించారు.

ఏప్రియల్ నాటికి ఎర్రకాల్వ పూర్తి : పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎర్రకాల్వ ప్రాజెక్టును మార్చి, లేదా ఏప్రిల్ మాసాలలో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టుతోపాటు పలు ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇప్పటికే రూ.50 వేల కోట్లు ఖర్చు చేశామని వృధాగా పోతున్న 3000 టి.ఎం.సిల నీటిని సముద్రంలో కలవకుండా ఎక్కడికక్కడే అడ్డుకట్ట వేయడానికి అవసరమైన ప్రాజెక్టులను నిర్మిస్తామన్నారు. పోలవరం నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. ఇప్పటికే గోదావరికృష్ణానదుల అనుసంధానం చేశామని, త్వరలోనే కృష్ణపెన్నా, గోదావరి వంశదార నదులను అనుసంధానం చేస్తామని ఆయన తెలిపారు.

ఆదర్శ జిల్లాగా పశ్చిమ : రాష్ట్రంలో ఆధునికి వ్యవసాయ విధానాలను అమలు చేసి వ్యవసాయం లాభసాటిగా ఉండడానికి పశ్చిమ గోదావరి జిల్లాలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాల ప్రగతికి చేస్తున్న కృషి వలన రైతు ఆర్ధికంగా బలోపేతం అవుతాడని, అందుకే పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలుస్తుందని సిఎం పేర్కొన్నారు.

జన్మభూమి - మా ఊరు అన్ని మతాలకు పండుగ

స్పీకర్ కోడెల శివప్రసాదరావు



సూర్య బ్యూరో అమరావతి: రాష్ట్రంలో జన్మ భూమి – మా ఊరు కార్యక్రమం అన్ని మతా లకు పండుగలా ఉందని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి కోడెల శివప్రసాదరావు అన్నారు. సోమవారం నరసరావు పేట పట్టణం 25, 26, 31వార్డుల్లో నిర్వహించిన జన్మభూమి –మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ డా. కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ 5వ విడత జన్మభూమి కార్యక్రమాలు రాష్ట్రంలో ప్రజా సమస్యలకు పరిష్కారానికి వేదికలయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వం చేస్తున్న అభివ ద్ధి పనులు చర్చించుకోవడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. జన్మభూమి మా ఊరు కార్యక్రమం ద్వారా మొత్తం ప్రభుత్వ యంత్రాంగం ప్రజల ముందుకు వస్తుందని, ఏ సమస్య అయినా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించబడుతుందన్నారు. గతంలో మురికివాడలాగా ఉన్న 25,26,31 వార్డులను ఎంతగానో ఈ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. మొత్తం నరస రావు పేట నియోజకవర్గంలో 1000 కోట్లకుపైగా అభివ ద్ధి చేసుకున్నామని, దేశంలో మరే పట్టణానికి లేని విధంగా నరసరావుపేట పట్టణంలో రెండు పూటలా మంచినీరు వస్తుందన్నారు. ఈ ప్రభుత్వ హయాం లో రానున్న రోజుల్లో మరింత అభివ ద్ధి చెందుతుందని దీనికి ప్రజలు సహకరించాలన్నారు. అభివృద్ధి సిటీగా ఉన్న నరసరావుపేట పట్టణాన్ని పరిశుభ్రతకు మారు పేరుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట పట్టణాన్ని ఎప్పటికీ 0%క్రైమ్ లెస్ సిటిగా ఉంచాలని పిలుపునిచ్చారు. ప్రజలందరూ పార్టీలకు, కులాలకు అతీతంగా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలతో తమ తమ ప్రాంతాలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. డ్వాక్రా, స్వయం సహాయక గ్రూపుల వారు తయారు చేసే వస్తువులను అమ్మడానికి త్వరలో మార్కెట్ యార్డులో ప్రత్యేక బజార్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నూతనంగా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు కావలసినవారు దరఖాస్తులు చేసుకోవాలని పిలుపు నిచ్చారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, విద్యార్థులు స్కాలర్ షిప్‌లు , కొత్త రేషన్ కార్డులు, చందన్న భీమా బాండ్లు, డ్వాక్రా మహిళలకు రుణాలను శాసనసభాపతి డా. కోడెల శివప్రసాదరావు అందించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట పట్టణ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకై చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయండి

ఎపిఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెన్షన్ సాధన సమితి కన్వీనర్ ఎ. విద్యాసాగర్ పిలుపు

విజయవాడ, సూర్య బ్యూరో : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానం సిపిఎస్‌ను రద్దు చేయాలని దేశ వ్యాప్త ఉద్యోగులలో భాగంగా ఈ నెల 9న ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న మహా ధర్నాలో సిపియస్ ఉద్యోగులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్ష నర్లు ప్రతిఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని ఎపి ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, పెన్షన్ సాధన సమితి కన్వీనర్ ఎ. విద్యాసాగర్ పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఒక లక్ష 66 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు అగమ్య గోచరంగా తయారయిన సిపియస్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల జాట్ కో, ఫ్యాప్‌టో, యుటిఎఫ్ జాకాప్, ఎ.పి. యూ. టి.ఎఫ్, పి.ఆర్.టి.యూ, ఎ.పి.టి.ఎఫ్, ఎస్.టి.యూ సి.పి.యస్ ఉద్యో గుల తదితర ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పడిన పెన్షన్ సాధన సమితి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ఉద్యోగులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. 2004 జనవరి నుండి నూతన పెన్షన్ సిపియస్ విధానాన్ని తెరపైకి తీసుకురావడం జరిగిందన్నారు. ఆర్థిక సంస్కరణలు అమలులో భాగంగా ప్రవేశపెట్టిన సిపిఎస్ పథకం అమలులోకి వచ్చి దాదావు 13 సంవత్సరాలు పూర్తయిందన్నారు.


సిపిఎస్ విధానం పర్యవసానాలు రోజు రోజుకి వెలుగులోకి వచ్చి ఉద్యోగులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఉద్యోగుల జీతాల నుండి 10 శాతం వాటాతో ప్రభుత్వం వాటా 10 శాతం జతచేసి స్టాక్‌మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేయడం వల్ల ఉద్యోగికి మినిమం గ్యారంటీ కూడా లేదన్నారు. సిపియస్ విధానం వల్ల దేశవ్యాప్తంగా దాదావు 56 లక్షల మంది ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతురన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఇప్పటి వరకు ఛలో పార్లమెంటుతోపాటు దేశ వ్యాప్తంగా పలు ర్యాలీలు, సమ్మె, బహిరంగ సభలను నిర్వహించి సిపియస్ విధానం వల్ల కలిగే అనర్థాలను ఉద్యోగులకు వివరించడంతో పాటు ప్రభు త్వాల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు.

సిపియస్‌ను పూర్తిగా రద్దు చేయ డమే ఏకైక లక్ష్యంగా పోరాటాన్ని ఉధృతం చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి నిబద్ధతతో ముందుకు వస్తేగాని లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. సి.పి.యస్ విధానాన్ని రద్దు చేయాలని ఈ నెల 9వ తేదిన తాలూకా కేంద్రాలలో నిర్వహించే మహా ధర్నా కార్యక్రమాలను విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని విద్యాసాగర్ ప్రకటన ద్వారా ఉద్యోగులకు పిలుపు నిచ్చారు.



సమాచార హక్కు చట్టం

స్వచ్ఛంద కార్యకర్తలకు రక్షణ కల్పించండి



విజయవాడ, సూర్య, మేజర్‌న్యూస్ : దేశ వ్యాప్తంగా సమాచార హక్కు చట్టాన్ని అస్త్రంగా వినియోగించుకొని ప్రభుత్వ శాఖలలో జరుగుతున్న ప్రక్షాళన నుండి పనులను పర్యవేక్షిస్తూ అవినీతిని వెలికి తీస్తూ సమాచార హక్కు స్వచ్ఛంద కార్యకర్తలు అనేక మంది కృషి చేస్తున్నారని గరీబ్ గైడ్ సమాచార హక్కు చట్టం స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు డాక్టర్ డి.వి. రావు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అవినీతి జరిగిన, పాల్పడిన పక్షంలో వారి అసలు రూపాలను బహిర్గతం చేసే ప్రక్రియలో పాల్గొంటున్న స్వచ్ఛంద సమాచార హక్కు చట్టం కార్యకర్తలు హత్యలకు గురవుతున్నారని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికి 56 మంది వివిధ ప్రాంతాలలో హత్యలకు గుర య్యారని, వీరి కుటుం బాలకు రూ.20 లక్షల చొప్పున సహాయం అందించాలని ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ వ్రాయటం జరిగిందని డా॥ డి.వి. రావు తెలిపారు. అవినీతి నిర్మూ లన పారదర్శక పాలనలో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రధాని మోడీ నుంచి సానుకూల స్పందన లభించగలదని ఆశిస్తున్నామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇదే విధంగా గరీబ్ గైడ్ స్వచ్ఛంద సంస్థకు అనుబంధంగా ఆర్టీఐ ఆర్మీ అనే సంస్థను ప్రారంభించామని, ఇందులో చేరిన కార్యకర్తలు సమాచార హక్కు అమలు ప్రక్రియలో హత్యకు గురైన పక్షంలో 2018 జనవరి 1 నుంచి సంస్థ తరవున బాధితుని కుటుంబానికి రూ.2 లక్షల సహాయాన్ని అందిస్తామని డి.వి.రావు ప్రకటించారు.

అంబటి గృహ నిర్బంధం : వైసిపి నేతల ఖండన



అమరావతి, సూర్యబ్యూరో: ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు దరిచేరడంలో విఫలమైందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు. దీనిపై ఎలాంటి చర్చ కైనా సిద్ధమని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ప్రభుత్వ యంత్రాంగం.. పోలీసులు కల్సి ఉదయం అంబటి రాం బాబును ఇంట్లో నుంచి కదలకుండా నిర్బంధించారు. ఉదయం ఆరు గంటలకు అంబటి ఇంటి వద్దకు చేరుకున్నారు పోలీసులు. అప్పటినుంచి రాత్రి పొద్దుపోయే వరకు అంబటిని ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా పోలిసులు కట్టు దిట్టమైన చర్యలు తీసుకున్నారు. రోజుమాదిరిగానే అంబటి ఇంటి నుంచి బయటకు వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. మిమ్మల్ని గృహ నిర్బంధం చేస్తున్నట్లు పోలీసులు నోటీసులు అందచేశారని తెలిపారు. దీంతో అంబటి పోలీసుల చర్యలపై మండిపడ్డారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. నరసరావుపేట శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు రావి వెంకట రమణ..రాష్ట్ర కార్యదర్శి ఎల్ అప్పిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిలారి రోశయ్య, మందపాటి శేషగిరిరావు, డైమండ్ బాబు, తిప్పారెడ్డి రామకృష్ణరెడ్డి, అంగడి శ్రీను..యూ నర్సిరెడ్డి.. గుంటూరు జెడ్పీటిసి కొటేశ్వరవు అంబటి ఇంటికి చేరుకుని సంఘీభావాన్ని ప్రకటించారు.

తెలుగు సంప్రదాయ, ఆరోగ్యకర వంటలకు ప్రాధాన్యం



విజయవాడ, సూర్య బ్యూరో : జన్మభూమి–మా ఊరు కార్యక్రమంలో భాగంగా మా పంటలు – మా వంటలు పేరిట ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పర్యాటక సాంస్క తిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్రాన్ని ఆనంద, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడి ఆలోచనల మేరకు మహిళలను భాగస్వాములను చేస్తూ ఈ కార్యక్రమానికి రూపకల్పన చేసామన్నారు. జన్మభూమి కార్యక్రమం చివరిరోజైన పదకొండవ తేదీన మండల స్థాయిలో పర్యాటక, సాంస్క తిక శాఖ వంటల పోటీలను నిర్వహిస్తుందని, అయా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు కార్యక్రమానికి నేతృత్వం వహిస్తారని మీనా వివరించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆరోగ్యకరమైన వంటలకు సంబంధించిన మెటీరియల్‌ను సమకూర్చుతుందని గోడ పత్రికలు, ఛాయా చిత్రాలు అందుబాటులో ఉంటాయని, వాటిని జన్మభూమి – మాఊరు కార్యక్రమంలో ప్రదర్శనగా ఉంచాలని స్పష్టం చేసారు. మా పంటలు – మా వంటలు కార్యక్రమాన్ని మండల కేంద్రాలలో నిర్వహిస్తారని ముఖేష్ కుమార్ మీనా వివరించారు. మూడు విభాగాలుగా పోటీలు జరుగుతాయని, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తీపి వంటకాల విభాగాలలో ఉత్సాహవంతులు పోటీ పడవచ్చన్నారు. పోటీలకు వినియోగించే వంట సామాగ్రిని పాల్గొనే వారే సమకూర్చుకోవలసి ఉంటుందని, ప్రదర్శనకు అవసమైన ఏర్పాట్లను ఎంపిడిఓ చేపడతారని వివరించారు. స్థానిక వంటలకు తగిన ప్రాచుర్యం కల్పించటం కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని పర్యాటక, సాంస్కతిక శాఖ కార్యదర్శి తెలిపారు. ఈ పోటీల ద్వారా ఆరోగ్యకరమైన వంటల తయారీపై అవగాహన పెంపొందుతుందని, మహిళలు తమ నైపుణ్యతను ప్రదర్శించగలుగుతారన్నారు. ఎంపిడిఓ నేతత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని, వీరిలో స్థానిక ప్రజాప్రతినిధితోపాటు, ఐసిడిఎస్ లేదా డిఆర్‌డిఎ అధికారి సభ్యులుగా ఉంటారని మీనా పేర్కొన్నారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు ఉంటాయన్నారు. మండల స్థాయి విజేతలకు ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఉత్తమ ఇంటి ఛెఫ్ పోటీలకు ఆహ్వానం అందిస్తుందన్నారు. వీరికి ఉగాదిలోపు పోటీలు నిర్వహించి స్వయంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు అందచేస్తామని ముఖేష్ కుమార్ మీనా వివరించారు.

దుర్గా బ్యాంక్ క్యాష్ కౌంటర్ వద్ద చోరీ



విజయవాడ, సూర్యబ్యూరో : పాతబస్తీలోని ది దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ క్యాష్ కౌంటర్ వద్ద ఓ వ్యక్తిని మోసగించి నలుగురు సభ్యులు 54 వేలు చేజిక్కించుకుని పరారయ్యారు. గుంటూరు జిల్లా పొన్నూరుకి చెందిన ఘంటసాల చంద్రమౌళీశ్వరరావు (60) అనే వ్యక్తి పొన్నూరులో చంద్రా మెడికల్ ఏజన్సీ నిర్వహిస్తున్నాడు. విజయవాడలోని దుర్గా బ్యాంక్‌లో లక్ష రూపాయలు డిపాజిట్ చేశాడు. ఆ నగదు డ్రా చేయడానికి సోమవారం మధ్యాహ్నం బ్యాంక్ రాగా, క్యాష్ కౌంటర్ లోని నగదును తీసుకోవడం గమనించిన నలు గురు అగంతకులు అతనికి సలహా ఇస్తున్నట్లుగా నటించి బ్యాంక్ ఇచ్చిన వారు నోట్లలో చిరిగిన నోట్లు వుంటాయి జాగ్రత్త అని సలహా ఇచ్చారు. వృద్ధుడు కూర్చుని లెక్కపెడుతుండగా వారిలో ఒక యువకుడు తన జేబులోని 2 వేల రూపాయలు చూపించి ఇదిగో ఇలా కటింగ్‌లు వుంటాయి నేను సాయం చేస్తాను అంటూ అతని చేతిలోని లక్ష రూపాయలను తీసుకున్నాడు. పరిశీలిస్తున్నట్లుగా కొంత నగదును ఇచ్చి, జాగ్రత్తగా చూడమని చెప్పాడు. మిగతా తన చేతిలోని నగదు పరిశీలిస్తున్నట్లు నటించి తృటిలో మాయమయ్యాడు. బాధితుడు విషయం గ్రహించి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు రంగప్రవేశం చేసి సిసి పుటేజులు ఆధారంగా ఈ సంఘ టనలో నలుగురు నిందితులు పాల్గొన్నారని నిర్ధారించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం బ్యాంక్‌లో సెక్యూరిటీ గార్డ్ లేకపోవడంపై సిఇవో అడ్డూరి శ్రీనివాసరావుపై పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న ఆర్ డిజైన్స్ ఎగ్జిబిషన్



విజయవాడ, సూర్య బ్యూరో : నగరంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ వారి ఆర్ డిజైన్స్ సీజన్2 ప్రదర్శన, అమ్మకాలు అందిరిని విశేషంగా ఆకట్టుకుంటుంది. నిర్వాహకురాలు మంజులత మాట్లాడుతూ నూతన రాజధాని అమరావతి విజయవాడ నగర ప్రజల కోసం సంక్రాంతి పండుగ సందర్భంగా దేశంలో ఉన్న డిజైనర్స్‌తో ఈ ప్రదర్శనను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ రంగంలో 18 సంవత్సరాల అనుభవం ఉన్న తనకు విజయవాడ ప్రజలకు లెటేస్ట్ డిజైనర్ వస్త్రాలను వివాహ శుభకార్యాల సందర్భంగా పరిచయం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డిజైనర్ వేర్, జ్యూయలరీ, హోమ్ డెకార్, లగ్జరీ ఫ్యాషన్, కిడ్స్ వేర్‌కు చెందిన 57 స్టాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డిజైనర్ శారీస్, బ్రైడల్ శారీస్, వర్క్ శారీస్, మంగళగిరి కష్మీరీ, ఇక్కత్ పట్టు, పోచంపల్లి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్. కాటన్, శిల్క్ డ్రస్ మెటీరియల్స్. జ్యూయలరీ ఐటమ్స్, టాప్స్, కుర్తీస్, ఫ్యాబ్రిక్ మెటీరియల్స్, బెడ్డషీట్స్, డోర్ కర్టెన్స్, దివాన్ సెట్స్, సిల్వర్ ఆర్టికల్స్, అర్టిఫిషియల్ ఫ్లవర్స్, లైఫ్ స్టయిల్‌కు చెందిన యాక్సిసీరిస్ చెందిన స్టాల్స్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శన, అమ్మకాలు ఈనెల 9వ తేదీ రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు.


సొంత ఇంటి కలను నిజం చేసిన టీడీపీ

- ఇల్లు కట్టాలంటే ఎంత కష్టమో నా ఇల్లు కట్టుకున్నప్పుడే తెలిసింది
- 2019 లోపు లక్ష ఐటి, 2 లక్షల ఎలక్ట్రానిక్ రంగం ఉద్యోగాలు
- కేంద్ర, ఉప రాష్టపతికి కృతజ్ఞతలు : మంత్రి లోకేష్

నెల్లూరు సూర్య ప్రతినిధి : మంత్రి నారా లోకేష్ నెల్లూరు జిల్లా పర్యటించారు. నెల్లూరు టౌన్‌లో ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. పేద ప్రజలకు ఒక రాష్ట్ర ప్రభుత్వం ఇంత నాణ్యమైన ఇల్లు కడుతుందని నా జీవితంలో ఊహించలేదని, ఇల్లు కట్టాలి అంటే ఎంత కష్టమో నాకు సొంత ఇల్లు కట్టుకున్నవుడు తెలిసిందన్నారు. అలాంటిది షేర్ వాల్ టెక్నాలజీతో పేద ప్రజలకు అద్భుతమైన ఇల్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం నెల్లూరు టౌన్‌లో ఒకేచోట 5 వేల ఇల్లు నిర్మిస్తున్నామన్నారు. ఇక్కడ ఒకచోటే 20 వేలమంది ప్రజలు ఉండబోతున్నారన్నారు. ముఖ్యమంత్రి ఎవ్వుడు చూసినా సింగపూర్ గురించి మాట్లాడుతారని ఎంతోమంది ఎద్దేవా చేసారు. సీఎం సింగపూర్ వెళ్లి పడుకోరు, షాపింగ్ చెయ్యరు. అక్కడ పేద ప్రజల కోసం ఎటువంటి టెక్నాలజీతో ఇల్లు కడుతున్నారో చూస్తారు. ఎలాంటి టెక్నాలజీతో రోడ్లు శుభ్రం చేస్తున్నారో తెలుసుకుంటారు. కేవలం ఇల్లు కట్టడమే కాదు. ఒకేచోట పార్కు, స్కూల్, రోడ్డులు, అన్ని వసతులతో అపార్టుమెంట్లు నిర్మిస్తున్నామన్నారు. పేద ప్రజలు అంటే చిన్న చూపు ఉండకోడదు నాణ్యమైన ఇల్లు కట్టాలి ఆఖరికి ఇంటి రంగు కూడా ప్రజలకు నచ్చిన రంగే వెయ్యండి అని చెప్పారు. ఇల్లు కట్టడమే కాదు అక్కడ నివసిస్తున్న వారికి ఉద్యోగం, ఉపాధి కూడా దగ్గర్లో కల్పించబోతున్నామన్నారు. మొదటి దశ ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకంలో భాగంగా 6 లక్షల 81 వేల భావనాలు నిర్మిస్తున్నామన్నారు. మొదటి దశ ఎన్టీఆర్ అర్బన్ హౌసింగ్ పథకం కోసం 38 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. 2014 కట్టుబట్టలతో మనల్ని బయటకి గెంటేసారు. 16 వేల కోట్లు లోటు బడ్జెట్‌ను మన నెత్తిన పెట్టారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా పేదవాడికి అన్ని వసతులతో ఇల్లు కట్టాలని ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎంతో సహకారం అందించారని వారికి నా కతజ్ఞతలన్నారు. 67 ఏళ్ల వయస్సులో 24 ఏళ్ల యువకుడిలా ముఖ్యమంత్రి కష్టపడుతున్నారన్నారు. మన కోసం మన పిల్లల భవిష్యత్తు కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా రన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. మనం అభివృద్ధిలో పోటీపడలేం అని ప్రతిపక్ష పార్టీ అనేక కుట్రలు చేస్తుందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టాలి అని ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 2019 లోవు నెల్లూరు జిల్లాకి కనీసం 2 వేల ఐటి ఉద్యోగాలు కల్పిస్తానన్నారు. 2019 లోవు లక్ష ఐటి, 2 లక్షల ఎలక్ట్రానిక్ రంగం ఉద్యోగాలు కల్పించాలి అని లక్ష్యంగా పెట్టుకున్నానన్నారు. నెల్లూరు జిల్లాలో పోర్ట్ ఉంది ఇక్కడికి పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీలను తీసుకొస్తానని మంత్రి నారా లోకేష్ అన్నారు.



సచివాలయంలో సంక్రాంతికి ప్రత్యేక వంటకాలు భోజనంతోపాటు వడ్డన



విజయవాడ, సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ నేతృత్వంలో సంక్రాంతి వేడుకల సందర్భంగా సచివాలయ ఉద్యోగుల కోసం ప్రత్యేక తెలుగు వంటకాలను అందిస్తున్నట్లు పర్యాటక, సాంస్కతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సచివాలయ ఉద్యోగుల సహకార సంఘ పలహార శాల సహకారంతో నాలుగు రోజులపాటు సచివాలయ పలహార శాలలో ఆహార పండుగ జరుగుతుంద న్నారు. ప్రతి రోజు ఒక విశేష వంటకాన్ని పర్యాటక శాఖ తరుపున భోజనంతో పాటు అందించటం జరుగుతుందన్నారు. మంగళవారం రాగిసంకటి, వేరుశనగ పచ్చడి, బుధవారం దంపుడు బియ్యం పలావ్, కుర్మా, గురువారం మెంతికూర టమాటా అన్నం, కుర్మా, శుక్రవారం బెల్లం పొంగలి, మషాల వడ సచివాలయ పలహారశాలలో అందించటం జరుగుతుందన్నారు. పర్యాటక శాఖ అందించే ఈ వంటకాలకు అదనపు చెల్లింపుల అవసరం లేదని, రాష్ట్రం ఆరోగ్య, ఆనంద ఆంధ్రప్రదేశ్‌గా ఉండాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తొలిసారి ఈ తరహా కార్యక్రమాన్ని తీసుకోవటం జరిగిందన్నారు. ఉద్యోగులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని, తెలుగు వంటకాల ప్రాచుర్యానికి సహకరించాలని ముఖేష్ కుమార్ మీనా వివరించారు.



అగ్రరాజ్యానికి హిమపాతం

వాతావరణ మార్పుతు ఎంతటి అనర్థాలకు దారితీస్తాయో.. ప్రస్తుతం భూగోళంపై రెండు ప్రాంతాల్లో చోటుచేసుకున్న తీవ్ర వాతావరణ పరిస్థితులే ఉదాహరణ.
ఒకవైపు విపరీతంగా కురుస్తున్న మంచుతో ఉత్తర అమెరికా గడ్డకట్టింది.
అమెరికాలోని సగభాగం మంచుతో పూర్తిగా మునిగిపోయింది. నదులు, జలాశయాలు గడ్డకట్టుకుపోయాయి.
ప్రఖ్యాత నయాగరా జలపాతం గడ్డకట్టుకుపోవడం అక్కడి చలి తీవ్రతను తెలుపుతుంది.
అనేక సంవత్సరాల ముందు ఒకసారి గడ్డకట్టిన నయాగరా గడ్డగట్టి కనుల విందు చేస్తోంది.
మళ్లీ మరోవైపు నుంచి ఇప్పుడు గడ్డకట్టుకుపోవడం ఆందోళనకు గురి చేస్తుంది.
అదలా ఉంచితే మరోవైపు ఠారెత్తిస్తున్న ఎండలతో ఆస్ట్రేలియా అల్లాడిపోతోంది.
న్యూయార్క్ నగరంలో ఆదివారం మైనస్ 13 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైతే..
ఆస్ట్రేలియాలోని సిడ్నీలో 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడం ప్రకృతి వైపరీత్యానికి పరాకాష్ఠ.

ఎముకలు కొరికే చలితో అమెరికా గజగజ వణికిపోతోంది. దేశంలోని వివిధ ప్రాంతాలు దట్టంగా కురిసిన మంచుతో నిండిపోయాయి. మరోవైపు మంచు తుపాను విరుచుకుపడుతుందన్న హెచ్చరికతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. 'బాంబ్ తుపాను'గా వ్యవహరిస్తున్న ఈ తుపానుతో అమెరికా ఈశాన్య ప్రాంతంలో 6 నుంచి 12 అంగుళాల మేర మంచు పడుతుందని, గంటకు 64 నుంచి 96 కిలోమీటర్ల వేగంతో పెను గాలులు వీస్తాయని జాతీయ వాతావరణ కేంద్రం (ఎన్డబ్ల్యూఎస్) పేర్కొంది. ఆర్కిటిక్ నుంచి వీస్తున్న ప్రమాదకర చలిగాలులకు ఇరుదేశాలు వణికిపోతున్నాయి. అమెరికాలోని మూడింట రెండు వంతుల రాష్ట్రాల్లో మైనస్ 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవగా, కెనడాలోని ఉత్తర అంటారియో, క్యూబెక్లలో ఉష్ణోగ్రత మైనస్ 50 డిగ్రీల సెల్సియస్కు పడిపోయింది.

మరోవైపు బాంబ్ మంచు తుపాను' అమెరికాతో పాటు కెనడాను వణి కిస్తోంది. ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పడిపోవడంతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈశాన్య అమెరికా, ఆగ్నేయ అమెరికాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంది. రోడ్లు, రహదారులపై మంచు పేరుకుపోయింది. యాభై రాష్ట్రాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొన్ని రాష్ట్రాలో టెంపరేచర్ భారీగా పడిపోయింది. అమెరికా వీధుల్లోని వాహనాలను మంచుదుప్పటి కప్పేసింనట్లు కనిపిస్తోంది.. న్యూయార్క్ రోడ్లపై నాలుగు ఇంచుల మంచు పేరుకుపో యింది. కొన్ని ప్రాంతాల్లో 10 ఇంచులవరకు పేరుకుపోయింది. నదులు సైతం గడ్డ కట్టాయి. దశాబ్దాల అనంతరం ఈ స్థాయిలో మంచుకురవడం ఇదే ప్రథమం.

'బాంబ్ తుపాను'

'బాంబ్ తుపాను' లేదా 'వాతావరణ బాంబు' అంటే పేలుడు స్వభావం కలిగిన తుపాను. 24 గంటల వ్యవధిలో అల్పపీడనం 24 మిల్లీబార్స్ మేర పడిపోతే దాని ఫలితంగా ప్రచండమైన వేగంతో గాలులు వీస్తాయి. ఈ గాలులకు చెట్లను కూల్చివేసే శక్తి ఉంటుంది. భవనాలు దెబ్బ తినే అవకాశం ఉంది. అట్లాంటిక్ సముద్రంపై ఏర్పడిన ఈ తుపాను కారణంగా బలమైన గాలులు, విపరీతమైన మంచు కురుస్తోంది. ఇది వారాంతం వరకు కొనసాగే అవకాశం ఉంది. న్యూయార్క్కు ఉత్తరాన ఉన్న ప్రాంతాలపై ఈ తుపాను ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది.

వారం రోజుల నుంచి నీరు గడ్డకట్టే ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నప్పటికీ తుపాను కారణంగా ఈ పరిస్థితి మరింత దిగజారింది. బాంబ్ తుఫాన్' కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అమెరికాలోని తూర్పు ప్రాంతాల్ని మంచు తుపాను అల్లాడిస్తోంది. విపరీతంగా పడిపోయిన ఉష్ణోగ్రత, గడ్డకట్టుకుపోయే చలిగాలుల్తో... అమెరికాలోని చాలా నగరాల్లో ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి కూడా రావడం లేదు. మంచు ప్రభావిత ప్రాంతాల్లోని విమానాశ్రయ సిబ్బంది అనేక సర్వీసులను రద్దు చేస్తున్నామని ప్రకటిస్తున్నారు. ఇప్పటివరకు దాదావు 2,700 విమానాలు రద్దయ్యాయి. సరస్సులు. ఎయిర్



పోర్ట్లు, స్టేడియాలు గడ్డకట్టిపోయాయి. ఐదు వందల ప్లేన్ల షెడ్యూల్ రీషెడ్యూల్ చేశారు. ఎయిర్ పోర్ట్లు లోనే ప్రయాణీకులు..గంటలకొద్దీ గడపాల్సి వస్తోంది.

160 కిలోమీటర్ల వేగంతో గాలులు

మంచుతో పాటు గంటకు 160 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో కొన్ని ప్రాంతాల్లో రైళ్లు సైతం పట్టాలు తప్పుతున్నాయి. చాలా ప్రాంతాల్లో విద్యు త్ సరఫరా సైతం నిలిచిపోయింది. విద్యాసంస్థలు, కార్యాలయాలను మూసివేశారు. తూర్పు తీరం, ఈశాన్య, ఆగ్నేయ రాష్ట్రాల్లో గంటకు 113 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తున్నాయి. దాంతో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బోస్టన్, మసాచుసెట్స్, రోడ్ ఐల్యాండ్స్ తదితర చోట్ల రహదారులు మంచుతో నిండిపోయాయి. చాలా ప్రాంతాల్లో 18 అంగుళాల మేర మంచు మేటలు వేసింది. చలి, శీతల గాలులు తీవ్రతకు ఇప్పటివరకూ 22 మంది మరణించారు. రోడ్లను కమ్మేసిన మంచుతో వాహనాలు ముందుకు కదలట్లేదు. జనజీవనం అతలాకుతలమైంది. అధికారులు ఎప్పటికప్పుడు రోడ్లపై పేరుకుపోయిన మంచును తొలగిస్తున్నారు.

ఇంకా కొన్ని రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అమెరికా వాతావరణ నిపుణులు తెలిపారు. విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంచు తుపాను దెబ్బకు కొందరు ప్రాణాలు కోల్పోయారు. న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్, మసాచుసెట్స్ తదితర నగరాల్ని మంచుతుపాను కమ్మేసింది. అక్కడి ఉష్ణోగ్రతలు అంటార్కిటికా ఖండం కంటే తక్కువగా నమోదు అవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మైనస్ 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. తూర్పు కెనడాలోని ఆంటారియో, క్యుబెక్ లాంటి నగరాల్లో మైనస్ 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

నయాగరా జలపాతం

అమెరికాలో అతి సుందరమైన నయాగరా జలపాతం కూడా గడ్డకట్టుకుపోయింది. నీటి ధారకు బదులు ఐసుముక్కలు జారిపడుతున్న దృాఎశ్యం కనపడుతోందక్కడ. అది చూడ్డానికి టూరిస్టులు ఎగబడుతున్నారు. ఫౌంటెన్ల నుంచి వచ్చిన నీరు గడ్డకట్టి ఓ తెల్లటి గుడ్డ కట్టినట్లు కనిపిస్తున్నాయి. గడచిన యాభై ఏళ్ళలో ఇంతటి శీతలం ఇదే మొదటిసారని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఫ్రాస్ట్బైట్ ప్రమాదముందని, అతిగా బయటకు వెళ్ళొద్దని, ఇంట్లోనే కొత్త ఏడాది సెలిబ్రేట్ చేసుకోండని హితవు పలుకుతున్నారు. 220



మిలియన్ల మంది అమెరికన్లకు ఇది కోల్డెస్ట్ న్యూయర్.

షావుల ముందు ప్రజల క్యూ

మంచు తుపాను నేపథ్యంలో అమెరికాలోని న్యూయార్క్ సిటీ, ఫిలడెల్ఫియా, బోస్టన్, కరోలినా, మేరీల్యాండ్, వర్జీనియా, ఫ్లోరిడా ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మంచు పడకముందే ప్రజలు బయటకు వచ్చి పాలు, గుడ్లు, ఇతర వంట సామగ్రిని కొనేందుకు షావుల ముందు క్యూ కడుతున్నారు. పరిస్థితి తీవ్రం కావడంతో అమెరికాలో ఎప్పుడూ లేనంతగా గ్యాస్ ధరలు అమాంతం కొండెక్కాయి. కెనడాలో భారీ గాలులకు విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడింది. వందలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మనదేశంలోని కశ్మీర్లోనూ

కశ్మీర్లో ఈ సీజన్లోనే అత్యల్ప రాత్ర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. లధక్ మీదుగా వీస్తున్న శీతలగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పతనమవుతున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. లధక్ ప్రాంతంలో, కార్గిల్లో రికార్డు స్థాయిలో మైనస్ 18.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శ్రీనగర్లో శనివారం మైనస్ 1.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, ఒక్కరోజులోనే ఐదు డిగ్రీలు పతనమైంది. కశ్మీర్లోని మిగతా పట్టణాలు గుల్మార్గ్ (మైనస్ 9.4), ఖాజీగుండ్, కుప్వారా (మైనస్ 4.6), కోకర్నాగ్ (మైనస్ 4.4)ల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొత్త రికార్డుల్ని నెలకొల్పాయి. హిమాచల్ ప్రదేశ్లోని కొండప్రాంతం కేలాంగ్లో మైనస్ 12.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

ఆస్ట్రేలియాలో ఇలా...

ఠారెత్తిస్తున్న ఎండల్తో ఆస్ట్రేలియా చెమటోడుస్తోంది. సిడ్నీ నగరంలో 1939 తర్వాత(79 ఏళ్ల తర్వాత) మొట్టమొదటిసారిగా 47.3 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇళ్లలోని బయటికి రావడానికి జంకుతు న్నారు. సముద్రతీరాల్లో, నీటి వనరులున్న చోట సేదదీరుతున్నారు.



చాలాచోట్ల విద్యుత్కు, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నిరాశ్రయులుగా ఉంటున్న వారికి ధార్మిక సంస్థలు నీటిని సరఫరా చేస్తున్నా యి. విక్టోరియా, దక్షిణ ఆస్ట్రేలియా ల్లోని కొన్ని ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుని ఆస్తి న ష్టం సంభవించింది. వాతావరణంలో నానాటిక సంభవిస్తున్న పెను మార్పులే ఈ విపత్తులకు కారణమని, మున్ముందు మరెన్ని అనర్థాలకు దారితీస్తాయోనని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.











గ్యాంగ్ లీడర్‌గా అలరిస్తాను



తెలుగులో చాలామంది టాప్ హీరోలకు తీసిపోనంత స్టార్‌డమ్ కలిగిన హీరో సూర్య. 'గజిని, యముడు, సింగం, 24' వంటి చిత్రాలు తెలుగులో ఆయనకు తిరుగులేని ఇమేజ్ తెచ్చిపెట్టాయి. ఈ నేపథ్యంలో సూర్య నటించగా తెలుగులో 'గ్యాంగ్' పేరుతో విడుదలవుతున్న చిత్రానికి మంచి క్రేజ్ ఏర్పడుతోంది. హిందీలో అక్షయ్‌కుమార్ నటించిన 'స్పెషల్ చబ్బీస్' చిత్రానికి రీమేక్‌గా తమిళ, తెలుగు భాషల్లో ఏకకాలంలో విడుదలవుతున్న ఈ చిత్రంలో కీర్తి సురేష్, రమ్యకృష్ణ ముఖ్యపాత్రలు పోషించారు. హిందీ మాతృకలో కాజల్ హీరోయిన్ కావడం విశేషం. అట్లీ ఈ చిత్రానికి దర్శకుడు. ఈ చిత్రం గురించి సూర్య మాట్లాడుతూ.. అట్లీ 'గ్యాంగ్' చిత్రాన్ని హిందీ చిత్రానికి ధీటుగా తీర్చిదిద్దాడని, రమ్యకృష్ణ, కీర్తి సురేష్‌ల పాత్రల్ని కూడా దర్శకుడు ఎంతో చక్కగా తీర్చిదిద్దాడని అన్నారు. అల్లు అరవింద్ సహాయ సహకారాలతో యు.వి.క్రియేషన్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థ 'గ్యాంగ్' చిత్రాన్ని విడుదల చేస్తుండడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సంక్రాంతికి వస్తున్న 'జైసింహా, అజ్ఞాతవాసి' చిత్రాలు కూడా ఘన విజయాలు సాధించాలని అభిలషించారు!

తొక్కలో రౌడీయిజం.. నీ లెవెల్ కత్తి పిడంత.. నా లెవెల్ కత్తి పదునంత

జైసింహా ట్రైలర్లో నటసింహ గర్జన



సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.యస్.రవికుమార్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ నిర్మిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'జైసింహా'. నయనతార, నటాషా, హరిప్రియ హీరోయిన్లు. చిరంతన్ భట్ సంగీతం సమకూర్చారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకొని జనవరి 12న విడుదలవుతున్న ఈ చిత్రం ప్రి రిలీజ్ ఫంక్షన్ హైద్రాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో చిత్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ, నిర్మాత సి.కళ్యాణ్, దర్శకుడు కె.యస్.రవికుమార్, బాలయ్యతో 'చెన్నకేశవరెడ్డి' చిత్రాన్ని రూపొందించి, ప్రస్తుతం సి.కళ్యాణ్ నిర్మాతగా సాయిధరమ్‌తేజ్‌తో 'ఇంటెలిజెంట్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్, బాలయ్యతో 'సింహా, లెజెండ్' సినిమాలు తీసిన బోయపాటి, హీరోయిన్ నటాషా, సహ నిర్మాత సి.వి.రావు ఈ చిత్రంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు. నిర్మాత సి.కళ్యాణ్ చిత్ర నిర్మాణంలో ఎక్కడా రాజీ పడలేదని, దర్శకుడు రవికుమార్ సినిమాను అత్యద్భుతంగా తీర్చిదిద్దారని, తన అభిమానులు పండగ చేసుకొనే సినిమా 'జై సింహా' అని బాలయ్య అన్నారు. ప్రేక్షకాభిమానులు చేసే జయజయధ్వానాలతో థియేటర్లు దద్దరిల్లడం ఖాయమని నిర్మాత సి.కళ్యాణ్ అన్నారు. 'జైసింహా' సింహనాదం చేయడం ఖాయమని వినాయక్, బోయపాటి, బ్రహ్మానందం తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ట్రైలర్లో "తొక్కలో రౌడీయిజం.. నీ లెవెల్ కత్తి పిడంత.. నా లెవెల్ కత్తి పదునంత" అంటూ బాలయ్య చెప్పిన డైలాగ్ అభిమానులచే కేరింతలు కొట్టించింది.

దటీజ్ బి.ఎ.రాజు!



ఆయనకున్న పరిచయాలను ఆసరా చేసుకొని ఏ రియల్ ఎస్టేట్‌నో సైడ్ బిజినెస్‌గా పెట్టుకొని ఉంటే కోట్లు కోట్లు గడించి ఉండేవాడాయన. కానీ ఆయన.. తను ఎదుటివారికి ఉపయోగపడాలనుకుంటాడే తప్ప.. తాను ఎదుటివారి ద్వారా అనుచిత లబ్ధి పొందాలని ఎన్నడూ చూడడు. ముఖ్యంగా ప్రముఖుల వద్ద తనకున్న చనువును ఇతర అవసరాల కోసం పొరపాటున కూడా వాడుకోడు. అందుకే తెలుగు చిత్ర పరిశ్రమలోని ప్రముఖులంతా ఆయనతో ఎంతో ఆత్మీయంగా ఉంటారు. సొంత కుటుంబ సభ్యునిలా భావిస్తూ ఉంటారు. ఇంకా చెప్పాలంటే చిత్ర పరిశ్రమలో ఆయనొక 'అజాతశత్రువు'. అందుకు ప్రత్యక్ష సాక్ష్యం.. జనవరి 7న జన్మదినం జరుపుకున్న బి.ఎ.రాజుకు ప్రముఖ హీరోలు, దర్శకులు పెట్టిన బర్త్‌డే ట్వీట్స్‌తో.. 'ట్విట్టర్' హోరెత్తిపోవడం. కింగ్ నాగార్జున, సూపర్‌స్టార్ మహేష్‌బాబు, రెబల్‌స్టార్ ప్రభాస్, మెగా హీరోలు వరుణ్‌తేజ్, సాయిధరమ్‌తేజ్, ప్రిన్స్ అఖిల్ అక్కినేని, నేచురల్ స్టార్ నాని, ప్రముఖ దర్శకులు వంశీ పైడిపల్లి వంటి పలువురు ప్రముఖులు ట్విట్టర్‌లో రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'గ్యాంగ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకోవడానికి హైదరాబాద్ వచ్చిన తమిళ సూపర్‌స్టార్ సూర్య అయితే ప్రత్యేకంగా కేక్ తెప్పించి, స్వయంగా దగ్గరుండి తనే కట్ చేయించి మరీ.. బి.ఎ.రాజుతో తనకు గల అనుబంధాన్ని ఎంతో ఆత్మీయంగా నెమరువేసుకున్నారు!



శ్రీకారం చుట్టుకుంటున్న శివానీ సినిమా



హీరో రాజశేఖర్ కూతురు శివానీ హీరోయిన్‌గా పరిచయం కాబోతుందని గత కొంతకాలంగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ అమ్మాయి తెలుగులో ఒక సినిమా చెయ్యడానికి ఒప్పుకుందని తెలుస్తోంది. టాప్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దగ్గర దర్శకత్వ శాఖలో పనిచేసిన వెంకట్ రెడ్డి బాలీవుడ్ '2 స్టేట్స్' సినిమాను తెలుగు నేటివిటీకి అనుగుణంగా మార్చి తెరకెక్కించబోతున్నాడు. ఈ సినిమాలో అడవి శేష్ హీరోగా నటిస్తున్నాడు. రాజశేఖర్ కుమార్తె శివాని ఈ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయం కాబోతుండడం విశేషం. త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

నువ్వేనా.. అది నువ్వేనా?



నందమూరి కళ్యాణ్‌రామ్ కథానాయకుడిగా, ప్రఖ్యాత యాడ్ ఫిలిం మేకర్ జయేంద్ర దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రంలో అందాల భామ తమన్నా హీరోయిన్‌గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి "నా.. నువ్వే" అనే టైటిల్‌ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

కూల్ బ్రీజ్ సినిమాస్ నిర్మాణంలో, ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ సమర్పణలో ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. ప్రఖ్యాత కెమరామెన్ పి.సి. శ్రీరామ్ ఈ చిత్రానికి ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు. ఒక టోటల్ ఫ్రెష్ లుక్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ ఈ చిత్రంలో కనిపిస్తారు. ఈ చిత్రానికి అవార్డు విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ షరెత్ సంగీతాన్ని అందిస్తున్నారు.

"జనవరి నెలాఖరుకి దాదావుగా షూటింగ్ పూర్తవుతుంది. ఈ చిత్రానికి "నా.. నువ్వే" అనే టైటిల్ చాలా అప్టగా ఉంటుంది. ఒక నూతన కాన్సెప్ట్‌తో, ఫ్రెష్ లుక్‌తో ఈ చిత్రాన్ని దర్శకులు జయేంద్ర తీర్చిదిద్దుతున్నారు. కళ్యాణ్ రామ్, తమన్నా కాంబినేషన్ ఈ చిత్రానికే హై లైట్‌గా నిలుస్తుంది. పి.సి. శ్రీరామ్ గారి కెమెరా వర్క్ "నా.. నువ్వే" చిత్రానికి చాలా పెద్ద అసెట్ " అని నిర్మాతలలో ఒకరైన కిరణ్ ముప్పవరపు తెలిపారు.

"పి.సి. శ్రీరామ్, జయేంద్ర వంటి టాప్ క్వాలిటీ టెక్నికల్ టీంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. హీరో కళ్యాణ్ రామ్ గారికి ఈ చిత్రం ఒక టోటల్ మేకోవర్‌ని ఇస్తుంది అని నమ్ముతున్నాం. వేసవి సెలవుల్లో చిత్రాన్ని విడుదల చేయటానికి సిద్ధపడుతున్నాం" అని సమర్పకులు మహేష్ కోనేరు తెలిపారు. లవ్, యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధానంగా ఉండే ఈ చిత్రంలో, కళ్యాణ్ రామ్, తమన్నా, తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణమురళి, వెన్నెల కిశోర్, ప్రవీణ్, బిత్తిరి సత్తి, ప్రియ, సురేఖ వాణి ప్రధాన నటులు.

ఒక్క క్షణం యూనిట్ హ్యాపీ



అల్లు శిరీష్, సురభి, అవసరాల శ్రీనివాస్, శిరత్ కపూర్ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'ఒక్క క్షణం'. వి.ఐ.ఆనంద్ దర్శకుడు. చక్రి చిగురుపాటి నిర్మాత. సినిమా డిసెంబర్ 28న విడుదలైంది. సినిమా సక్సెస్‌లో భాగంగా చిత్ర యూనిట్ థాంక్స్ మీట్‌ను నిర్వహించారు. ఇందులో అల్లు శిరీష్, దర్శకుడు విఐ ఆనంద్, నిర్మాత చక్రి చిగురుపాటి సహా యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. అల్లు శిరీష్ మాట్లాడుతూ – 'నా తొలి సినిమా 'గౌరవం' బాక్సాఫీస్ వద్ద పెద్దగా సక్సెస్ సాధించలేదు. దాంతో ఏదైనా కొత్తగా చేద్దామనే ఆలోచన తగ్గిపోయింది. తర్వాత చేసిన కొత్తజంట, శ్రీరస్తు శుభమస్తు వంటి కమర్షియల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్ చేశాను. మళ్లీ ధైర్యం తెచ్చుకుని ఏదైనా కొత్తగా చేస్తే ఆడియెన్స్ ఆదరిస్తారనిపించింది. ఆ ప్రయత్నంలో భాగంగా 'ఒక్క క్షణం' సినిమా చేశాను. నమ్మకంతో ఈ సినిమా చేశాను. ఈ సినిమాకు వచ్చినంత రెస్పాన్స్ ఏ సినిమాకూ రాలేదు' అన్నారు. దర్శకుడు విఐ.ఆనంద్ మాట్లాడుతూ – 'ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులు, ఈ సినిమాను కాంప్రమైజ్ కాకుండా నిర్మించిన నిర్మాతలకు, సహకారం అందించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు థాంక్స్' అన్నారు. శిరత్ కపూర్ మాట్లాడుతూ – '2018 ఏడాదిని మాకు ఒక్కక్షణం సక్సెస్‌తో స్వాగతం పలికిన ప్రేక్షకులకు థాంక్స్. అలాగే సినిమా సక్సెస్‌లో భాగమైన యూనిట్‌కు థాంక్స్' అన్నారు.

ఇది తరుణ్ ప్రేమకథ



రామ్ ఎంటర్‌టైనర్స్ పతాకంపై తరుణ్, ఓవియా హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'ఇది నా లవ్‌స్టోరీ'. రమేష్–గోపీ దర్శకులు. ఎస్.వి.ప్రకాష్ నిర్మాత. హీరో తరుణ్ పుట్టినరోజు సందర్భంగా ట్రైలర్ విడుదల చేశారు.

చిత్ర నిర్మాత ఎస్.వి.ప్రకాష్ మాట్లాడుతూ – "హీరో తరుణ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు. ఫిబ్రవరి 14న సినిమాను విడుదల చేస్తున్నాం" అన్నారు.

మ్యూజిక్ డైరెక్టర్ శ్రీనాథ్ విజయ్ మాట్లాడుతూ – "తెలుగులో నా తొలి చిత్రమిది. సినిమాకు మంచి సంగీతం, రీరికార్డింగ్ కుదిరింది' అన్నారు.

డైరెక్టర్స్ ద్వయం రమేష్–గోపి మాట్లాడుతూ – 'తరుణ్ గత హిట్ చిత్రాలు 'నువ్వే కావాలి', 'నువ్వే నువ్వే' కంటే ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని గర్వంగా చెప్పగలను" అన్నారు.

హీరో తరుణ్ మాట్లాడుతూ – 'ఇందులో మూడు గెటప్స్‌లో నేను కనపడతాను. మరి ఇందులో ట్రిపుల్ రోల్ చేశానా? లేదా మూడు షేడ్స్ ఉన్న పాత్ర చేశానా? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. డైలాగ్స్, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ, మంచి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఇలా అన్ని చక్కగా అమరాయి. హీరోయిన్ ఓవియా చాలా చక్కగా నటించింది. ఈ సినిమాలో ఎక్కువ పాత్రలు కూడా కనపడవు. గోగినేని బాలకృష్ణ ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. అలాగే ట్రెండీ మూవీస్ సంస్థ సినిమాను యు.ఎస్.లో విడుదల చేస్తుంది" అన్నారు.

పోత పోసిన పుత్తడి బొమ్మ

ఎనిమిదణాల 'అర' తెలుగమ్మాయి పూనమ్‌కౌర్



నిజానికి తొలిచిత్రంతోనే ఈ అమ్మడు 'మాయాజాలం' చేసి ఉండేది.. యస్.వి.కృష్ణారెడ్డి దర్శకత్వంలో ఈమె నటించిన 'మాయాజాలం' హిట్టయి ఉంటే..! కానీ.. అదేమి 'విచిత్రమో' ఏమో.. తేజ దర్శకత్వంలో ఆమె నటించిన 'ఒక విచిత్రం' సైతం ఆమెకు సక్సెస్ ఇవ్వలేకపోయింది. అయినాసరే ఆమెకు ఆఫర్స్ వస్తూనే వచ్చాయి. ఎందుకంటే ఆమె అందం అటువంటిది. 'పుత్తడిబొమ్మ పూనమ్మ' (పూర్ణమ్మ) అనాలనిపించేంత అనుపమానమైన సౌందర్యం ఆమె సొంతం.

కాకపోతే సక్సెస్‌లను మాత్రమే ప్రామాణికంగా తీసుకొనే తెలుగు పరిశ్రమ ఈసారి ఆమెకు సైడ్ హీరోయిన్‌గా ఆఫర్స్ ఇస్తూ వచ్చింది. గోపీచంద్ 'శౌర్య', కృష్ణుడు 'వినాయకుడు, రామ్–కాజల్ 'గణేష్', వెంకటేష్ 'నాగవల్లి', నాగార్జున్ 'గగనం', సుధీర్‌బాబు 'ఆడు మగాడ్రా బుజ్జీ, వరుణ్ సందేష్ 'బ్రహ్మిగాడి కథ' వంటి చిత్రాల్లో చిన్నా చితకా క్యారెక్టర్స్ వేస్తూ తన ఉనికిని కాపాడుకుంటూ వస్తున్న ఈ పసిడి అందాల పంజాబీ పాలకోవా పేరు పూనమ్ కౌర్' అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమేముంది?

ఒక్క తెలుగులోనే కాదు.. తమిళ, కన్నడ భాషల్లోనూ పూనమ్ పలు చిత్రాలు చేసింది. అయితే అక్కడ కూడా ఆమెకు అరకొరా విజయాలు మాత్రమే దక్కాయి. ఢిల్లీలో నిఫ్ట్ (నేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ) కోర్సు చేసిన పూనమ్ మూలాలు పంజాబ్‌వే అయినప్పటికీ.. వీరి కుటుంబం ఎప్పుడో హైద్రాబాద్ వచ్చి స్థిరపడిపోయింది. కాబట్టి ఒకరకంగా చెప్పాలంటే ఆమెను 'అచ్చ తెలుగమ్మాయి' అనకపోయినా.. 'అర తెలుగమ్మాయి' అని నిక్షేపంగా అనొచ్చు. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏరికోరి పూనమ్ కౌర్‌ను చేనేత పరిశ్రమకు ప్రచారకర్తగా (బ్రాండ్ అంబాసిడర్‌గా) నియమించుకుంది.

టాప్ హీరోయిన్‌గా అలరారేందుకు అన్ని లక్షణాలు పుష్కలంగా ఉన్న పూనమ్‌కౌర్ 'ఒక్క ఛాన్స్.. ఒకే ఒక్క మంచి ఛాన్స్ అంటూ సరైన అవకాశం కోసం ఎంతో ఓపికగా ఎదురుచూస్తోంది.

ఇకపోతే పూనమ్ కౌర్ గురించి ఇంత చెప్పాక.. ఆమె పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్‌కు వీరాభిమాని అని, ఆయనంటే ఈ అమ్మడికి పడి చచ్చేంత అభిమానమని చెప్పకపోతే.. అది కచ్చితంగా అసమగ్రమైపోతుంది!!

బిడ్డా.. ఇది భాగమతి అడ్డా

ఎవ్వడు పడితే వాడు రావడానికి ... ఎప్పుడు పడితే అప్పుడు పోవడానికి ఇదేమన్నా పశువుల దొడ్డా... భాగమతి అడ్డా.... లెక్కలు తేలాలి... ఒక్కడ్నీ పోనివ్వను.... అంటూ అనుష్క భాగమతి ట్రైలర్‌లో చెప్పిన హై పిచ్ డైలాగ్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

టాలీవుడ్ సిల్వర్ స్క్రీన్ వండర్ బాహుబలి చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్న అనుష్క నటించిన తాజా తెలుగు చిత్రం భాగమతి. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి చిత్రాల్లో అనుష్క నటించిన తీరు అందర్నీ అబ్బురపరిచింది. ఇదే తరహాలో... భాగమతిగా అనుష్క తన పెర్ఫార్మెన్స్‌తో మెస్మరైజ్ చేయనుందని ట్రైలర్‌తో రుజువైంది. భాగమతి ట్రైలర్ రిలీజ్ అయిన కొద్ది గంటల్లోనే సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. అనుష్క నటన, దర్శకుడు అశోక్ టేకింగ్, మది కెమెరా వర్క్, అబ్బుర పరిచే రవీందర్ ఆర్ట్ వర్క్, తమన్ రీ రికార్డింగ్, యువి క్రియేషన్స్ నిర్మాణాత్మక విలువలు హై స్టాండర్డ్స్‌లో ఉన్నాయి. అనుష్క గెటప్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎప్పుడెప్పుడు ఈ సినిమా చూద్దామా అన్నంతగా క్రేజ్ సంపాదించుకుంది ట్రైలర్. ఈ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకొని భారత గణతంత్ర దినోత్సవ కానుకగా జనవరి 26న భాగమతి చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు భాగమతి చిత్ర నిర్మాతలు ప్రమోద్ , వంశీ ప్రకటించారు.





పాత రూ. 500, రూ. 1000 నోట్లు ఎలా మారిపోతున్నాయో!

- ప్యాడ్‌లుగా మారుతున్న పాత కరెన్సీ
- తమిళనాడు పుళల్ జైలుకు చేరిన 70 టన్నుల పాత నోట్లు
- రోజుకు 1000 ప్యాడ్లు తయారు చేస్తున్న ఖైదీలు

చెన్నై : రద్దయిన పాత కరెన్సీ ఇప్పుడు ప్యాడ్‌లుగా మారుతోంది. మొత్తం 70 టన్నుల పాత కరెన్సీ నోట్లు తమిళనాడులోని పుళల్ జైలుకు చేరగా, ఫైల్ ప్యాడ్ల తయారీలో శిక్షణ పొందిన ఖైదీలు వీటిని తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకూ 9 టన్నుల పాత కరెన్సీతో ప్యాడ్లు తయారు చేసినట్లు తమిళనాడు జైళ్ల శాఖ డీజీ ఎ. మురుగేసన్ తెలిపారు. నవంబర్ 2016లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పెద్ద నోట్ల చలామణీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన తరువాత, బ్యాంకులకు వచ్చిన కరెన్సీని దగ్ధం చేస్తారని తొలుత వార్తలు వచ్చినప్పటికీ, పర్యావరణానికి హాని కలుగుతుందన్న ఆలోచనతో ఆ కార్యక్రమానికి స్వస్తి పలికిన సంగతి తెలిసిందే. ఇక ఈ నోట్లతో ప్యాడ్స్ తయారు చేయాలని నిర్ణయించగా, ప్రస్తుతం రోజుకు 1000 ప్యాడ్స్ తయారవుతున్నాయి. తొలుత కరెన్సీ నోట్లను గుజ్జుగా మార్చి, ఆపై దాన్ని గట్టిపరిచి ప్యాడ్లుగా తయారు చేస్తున్నారు. ఒక్క పుళల్ సెంట్రల్ జైలులోనే ఇలా పాతనోట్లతో ఫైల్ ప్యాడ్స్ తయారు చేస్తుండడం విశేషం.

తలాక్ వ్యూహంలో కాంగ్రెస్‌కు పరాభవం



న్యూఢిల్లీ : ముస్లిం మహిళల ప్రయోజనం కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వివాదాస్పద ట్రిపుల్ తలాక్ బిల్లును ఆమోదించకుండానే శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ముగిశాయి. ఇది వరకే లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపించాలని ఎక్కువ బలం ఉన్న ప్రతిపక్షం రాజ్యసభలో పట్టుబట్టడంతో బిల్లు ఆమోదం పొందలేకపోయింది. ఈ మొత్తం వ్యవహారంలో లాభపడింది పాలక పక్ష భారతీయ జనతా పార్టీనే. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బిల్లులోని అంశాల పట్ల స్పష్టమైన వైఖరి వెల్లడించ పోవడం వల్ల కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు. ముస్లిం మహిళలను ఆకర్షించడంతో పాటు హిందువులను ఏకం చేయడానికి ఈ బిల్లును భారతీయ జనతా పార్టీ ఆశించినంత ఉపయోగించుకుంది. ముస్లిం పురుషులు తమ భార్యలకు ట్రిపుల్ తలాక్ చెబితే అందుకు వారికి మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించేందుకు వీలుగా బీజేపీ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చింది. ముస్లింలను శిక్షించే బిల్లును తెచ్చామని ఇటు హిందువులను మెప్పించడంతో పాటు ట్రిపుల్ తలాక్ వల్ల నష్టపోతున్న ముస్లిం మహిళలను రక్షించడం కోసమే ఈ బిల్లును తెచ్చామని మరో వైపు వారిని ఆకర్షించడం బీజేపీ ఉద్దేశం. తన భర్త తనకు ట్రిపుల్ తలాక్ చెప్పారని ఏ ముస్లిం మహిళ ఫిర్యాదు చేసినా సదరు భర్తపై కేసు పెట్టి మూడు సంవత్సరాల పాటు జైలుకు పంపించవచ్చు. ఇక్కడ భర్త జైలుకు వెళ్లడం ఇష్టం లేకపోయినా సరే, అంటే భార్య అనుమతి అవసరం లేకుండానే భర్తను జైలుకు పంపిస్తారు. పైగా జైలులో ఉన్న భర్త తాను జైలులో ఉన్నంత కాలం భార్య, పిల్లల పోషణార్థం భరణం చెల్లించాలని ఉంది. జైలుకు వెళ్లిన భర్త భరణం ఎలా చెల్లిస్తాడు? జైలుకు వెళ్లి వచ్చిన భర్త మళ్లీ భార్యను బాగా ఎలా చూసుకుంటాడు? అన్న వివాదాస్పద అంశాలకు బిల్లులో సమాధానం లేదు. ట్రిపుల్ తలాక్ చెల్లదనడాన్నే ముస్లిం కమ్యూనిటీలో మెజారిటీ మగవారు అంగీకరించడం లేదు. ఇక వారికి శిక్షలు కూడా విధించే చట్టం వస్తే ముస్లిం మహిళలను వారు రాచి రంపాన పెట్టరా? ఈ విషయంలో ముస్లిం మహిళలకు బిల్లులో తగిన రక్షణలు లేవు. ట్రిపుల్ తలాక్ విధానాన్ని వ్యతిరేకించడంతో పాటు ముస్లిం మహిళలకు ముప్పు తెచ్చే బిల్లులోని అంశాలను వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని స్పష్టం చేసి ఉండాల్సింది. ముస్లిం మగవారిని కాని, మహిళలనుగాని దూరం చేసుకోవడం ఇష్టం లేని కాంగ్రెస్ పార్టీ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలనే డిమాండ్‌పైనే ప్రధానంగా గొడవ చేసింది. ప్రస్తుతం రాజ్యసభలో అంతగా బలంలేని బీజేపీ ప్రభుత్వం దీన్ని తనకు సానుకూలంగా మలుచుకుంది. ప్రతిపక్షాల డిమాండ్‌కు తలొగ్గకుండా, ముస్లిం మహిళల మంచి కోసం బిల్లును తెస్తుంటే కాంగ్రెస్ పార్టీ అడ్డం పడుతోందని వాదించి తన పబ్బం గడుపుకుంది. మున్ముందు రాజ్యసభలో బలం పెంచుకునే అవకాశం బీజేపీకి ఎలాగు ఉంది కనుక అప్పుడు బిల్లును ఆమోదించవచ్చు. ఈలోగా పలు రాష్ట్రాల్లో, ముఖ్యంగా కర్నాటక రాష్ట్రంలో విజయం కోసం ఎన్నికల ప్రచారంలో ఈ బిల్లును ప్రధాన ఆయుధం చేసుకోవాలని బీజేపీ భావిస్తోంది.


'యోగి సర్! మీరు మా రాష్ట్రం నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది'



బెంగళూరు : త్వరలో జరగనున్న కర్నాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారానికి గాను ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆ రాష్ట్రానికి వచ్చారు. ఆయనకు కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వాగతం పలుకుతూ తమను చూసి ఎంతో నేర్చుకోవాల్సింది ఉందని అంటూ ట్వీట్ చేశారు. ఇక్కడ ఉన్న సమయంలో ఇందిరా క్యాంటీన్, ఓ రేషన్ షాపును సందర్శించాలని ఆదిత్యనాథ్‌కు సూచించారు. 'మీ రాష్ట్రంలో కొన్ని సందర్భాల్లో చోటు చేసుకున్న ఆకలి చావుల సమస్యను పరిష్కరించడానికి ఇది తోడ్పడుతుంది' అని సిద్ధరామయ్య తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

పెళ్లి చేసుకుందామని అడిగానంతే

ఇంకా చేసుకోలేదు: ఇమ్రాన్ ఖాన్



ఇస్లామాబాద్ : తాను రహస్యంగా మూడో వివాహం చేసుకున్నట్లు వచ్చిన వార్తలపై పాకిస్తాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ప్రతిపక్ష తెహ్రీక్- ఎ- ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ స్పందించారు. తాను ఇంకా పెళ్లి చేసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ఇస్లాం మత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే బుష్రా మేనక్ (44)ను తాను ఇష్టపడ్డానని, ఆమె ముందు పెళ్లి ప్రతిపాదనను ఉంచానని చెప్పుకొచ్చారు. అయితే, పెళ్లి ఇప్పుడే వద్దని, కొంత సమయం కావాలని ఆమె కోరిందని, ఆమె ఒప్పుకుంటే పెళ్లి చేసుకునేందుకు తనకు అభ్యంతరం లేదని అన్నారు. తన పెళ్లి ప్రస్తుతానికి ప్రతిపాదనల వద్దే ఉందని ఇమ్రాన్ ఖాన్ చెప్పారు.

ప్యాంటు వేసుకోకుండా రైలు ప్రయాణం



న్యూయార్క్ : 'పిచ్చి పిచ్చి పిచ్చి... రకరకాల పిచ్చి..' అంటూ భానుమతి ఓ సినిమాలో పాట పాడినట్టు ఇప్పుడు విదేశాల్లో ఓ కొత్తరకం పిచ్చి పట్టుకుంది. దీనికి ముద్దుగా 'ట్రెండ్' అనే పేరు పెట్టుకున్నారు. అంటే ప్యాంట్లు లేకుండా సబ్‌వే రైలులో ప్రయాణించాలన్న మాట. ఆదివారం పలు దేశాల్లో ఇది ఇప్పుడు ట్రెండ్ అయింది. ఈ ఈవెంట్‌కు ఓ కారణం అంటూ ఏమీ లేదు. ఊరికే సరదా కోసం చేయడమే! మొదటి సారిగా 2002లో ఈ ఈవెంట్ ప్రారంభమైంది. ఓ ఏడుగురు వ్యక్తులు ప్యాంట్ లేకుండా వివిధ స్టేషన్లలో సబ్‌వే రైలు ఎక్కారు. ఎవరైనా ప్రశ్నిస్తే ప్యాంట్ వేసుకోవడం మరచిపోయినట్లుగా సమాధానం చెప్పారు. అలా వాళ్లు ఏడుగురు అప్పట్లో బాగా ఫేమస్ అయ్యారు. దీనిని 'ఇంప్రూవ్ ఎవ్రీవేర్' అనే సంస్థ తీసుకుని బాగా ప్రచారం కల్పించింది. ప్రతి ఏడాది చలికాలం విపరీత స్థాయిలో ఉండే జనవరి నెలలో ఒక రోజును ఈ విధంగా జరుపుకోవాలని ప్రచారం చేసింది. ఏ రోజున జరుపుకోవాలో డిసెంబర్ నెలలో సూచించడం ప్రారంభించింది. ఈ లెక్కన ఇప్పటి వరకు దాదాపు 17 ఏళ్లుగా ఈ ఈవెంట్‌ను ప్రపంచవ్యాప్తంగా కొనసాగేలా చర్య తీసుకుంటున్నారు. అందులో భాగంగానే జనవరి 7, ఆదివారం రోజు అడిలైడ్, ఆమ్‌స్టర్‌డామ్, అట్లాంటా, బెర్లిన్, బోస్టన్, బ్రిస్‌బేన్, షికాగో, కోపెన్‌హేగన్, జెరూసలెం, లండన్, మాంట్రియల్, మ్యూనిచ్, జ్యూరిచ్, వాషింగ్టన్ డీసీ వంటి నగరాల్లో ఈ ఈవెంట్‌ను విజయవంతం చేశారు. తాము ప్యాంట్ లేకుండా ప్రయాణించిన వీడియోలు, ఫోటోలను పాశ్చాత్య నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

పత్రికా స్వేచ్ఛకు కట్టుబడి ఉన్నాం: కేంద్రం



న్యూఢిల్లీ : ఆధార్ కార్డుల వివరాలు గోప్యత గురించి వార్త రాసిన విలేకరి పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చడంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం స్పందించింది. పత్రికా స్వేచ్ఛకు తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ఈ మేరకు ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ట్విటర్‌లో పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛకు తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తెలిపారు. అదే సమయంలో భారత అభివృద్ధికి దోహదం చేసే ఆధార్ గోప్యత, పవిత్రతను కాపడడం తమ బాధ్యత అని తెలిపారు. కేవలం గుర్తు తెలియని వ్యక్తులపై మాత్రమే ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేసినట్లు వెల్లడించారు. అంతకు ముందు ఆధార్ కార్డుల వివరాలు గోప్యంగా లేవంటూ 'ది ట్రైబ్యూన్' పత్రిక వెలువరించిన పరిశోధనాత్మక కథనానికి సంబంధించి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) డిప్యూటీ డైరెక్టర్ బి.ఎం. పట్నాయక్ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఆధార్ వివరాలను తెలుసుకోగల ఓ సేవను పత్రిక కొనుగోలు చేసిందంటూ తమకు సమాచారం అందిందని, ఇది ఆధార్ గోప్యతను అతిక్రమించడమేనని పట్నాయక్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పత్రికకు కథనం అందించిన విలేకరి రచనా ఖైరా పేరును కూడా ఎఫ్‌ఐఆర్‌లో చేర్చామని, అయితే, ఎవరినీ నిందితులుగా పేర్కొనలేదని పోలీసులు స్పష్టం చేశారు. విలేకరిపై ఎఫ్‌ఐఆర్ నమోదు కావడంతో కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆధార్ వివరాల గోప్యతకు భంగం కలిగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవడానికి బదులుగా లోపాలను బయటపెట్టినవారిపై చర్యలకు ఉపక్రమించడమేమిటని ఆ పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సింగ్ సూర్జేవాలా ప్రశ్నించారు. ఎఫ్‌ఐఆర్ నమోదుపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆధార్ గోప్యత అతిక్రమణ అంశంపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపించాలని కోరింది.

ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బీజేపీ నేతకు ఘోర అవమానం

- మెడలో చెప్పుల దండ
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్లిన దినేశ్ శర్మ
- చెప్పులను దండగా వేసిన వోటర్
- నీటి సమస్యను పరిష్కరించనందుకే ఈ సత్కారమట



భోపాల్ : మధ్య ప్రదేశ్‌లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్లిన బీజేపీ నేత ఒకరికి ఘోర అవమానం ఎదురైంది. థామ్‌నోడ్ అనే ప్రాంతంలో దినేశ్ శర్మ అనే నేత ఇంటింటి ప్రచారానికి వెళ్లి వోట్లు అడుగుతుంటే, ఓ వ్యక్తి వచ్చి చెప్పుల దండను ఆయన మెడలో వేశాడు. దీంతో హుషారుగా ప్రచారం నిర్వహిస్తున్న ఆయన షాక్‌కు గురై ఆ వెంటనే తేరుకున్నాడు. తొలుత చెప్పులను పక్కకు పడేసేందుకు ప్రయత్నించిన శర్మ ఆ వక్తి తన ప్రయత్నాన్ని మానకపోవడంతో దండ వేయించుకోవాల్సి వచ్చింది. ఆపై ఆయన మాట్లాడుతూ, తాను ప్రజల బిడ్డనని, తన నుంచి వారు ఏదో కోరుకుంటూ, తమలోని అసంతృప్తిని ఇలా వెల్లడించాడని చెప్పడం గమనార్హం. ఇక తాగు నీటి సమస్య అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో సమస్యను పరిష్కరించాలని ఎన్ని సార్లు విన్నవించుకున్నా ప్రయోజనం కలగలేదని, అందుకే ఈ పని చేశానని చెప్పుల దండను తెచ్చిన వ్యక్తి చెప్పాడు.

ఆధార్ సీఈఓ పేరుతో నకిలీ ట్విట్టర్ అకౌంట్



న్యూఢిల్లీ : యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ)కి కొత్త సమస్య వచ్చింది. సీఈఓ అజయ్ భూషణ్ పాండే పేరుతో ట్విట్టర్‌లో ఓ కొత్త అకౌంట్ పుట్టుకొచ్చింది. తమను తాము ఆధార్ సీఈఓ పేరడీ అకౌంట్‌గా ఈ ఖాతాను సృష్టించినవారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఆధార్ సంస్థ యూఐడీఏఐ అధికారిక ఖాతా గురించి స్పష్టత ఇస్తూ ట్వీట్ చేసింది. అధికారికంగా చర్య తీసుకుంటామని యూఐడీఏఐ హెచ్చరించడంతో అప్పటి వరకు అజయ్ భూషణ్ పాండే పేరుతో ఉన్న ఖాతాను డాక్టర్ చుల్బుల్ పాండేగా మార్చారు. ఈ రెండు అకౌంట్ల ఖాతాల హ్యాండిళ్లలో ఒక్క అండర్‌స్కోర్ తేడా మాత్రమే ఉండడం గమనార్హం. ఈ నకిలీ ఖాతా ద్వారా ప్రారంభమైన ఒక్క రోజులోనే దాదాపు 350కి పైగా ట్వీట్లు వచ్చాయి. దాదాపు 237 మంది ఫాలోయర్లు కూడా ఉన్నారు. ఆధార్ నియమాలను, విధానాలను అవహేళన చేస్తూ ఇందులో ట్వీట్లు ఉన్నాయి.

త్యాగరాజస్వామి కీర్తన మధ్యలో వాణిజ్య ప్రకటన

- దూరదర్శన్‌పై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం
- పంచరత్న కీర్తనల మధ్యలో బ్రేక్
- కాసేపు కూడా ఆగలేరా అని అసహనంతో ట్వీట్
- స్పందించిన ప్రసార భారతి
- పొరపాటు జరిగిందని వివరణ



న్యూఢిల్లీ : దూరదర్శన్‌పై రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అసహనాన్ని ట్విట్టర్ ద్వారా తెలిపి దూరదర్శన్‌కు అక్షింతలు వేశారు. ఇంతకీ ఏమి జరిగిందంటే.. తమిళనాడులోని తిరువయ్యారులో జరుగుతున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలను శనివారం డీడీలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. పంచరత్న కీర్తనలను మంత్రి ఎంతో ఆసక్తిగా టీవీలో వీక్షిస్తూ మంచి కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారంటూ ట్విట్టర్ ద్వారా డీడీని అభినందించారు. అయితే, అంతలోనే ప్రసారాన్ని నిలిపివేసి ప్రకటనలు వేసింది. ఇష్టంగా చూస్తున్న పంచరత్న కీర్తలనలకు మధ్యలో బ్రేక్ రావడంతో మంత్రి సీతారామన్ ఒకింత అసహనానికి గురయ్యారు. ట్విట్టర్ ద్వారా దూరదర్శన్‌కు తన అసహనాన్ని తెలియజేశారు. దూరదర్శన్‌ను ట్యాగ్ చేస్తూ 'యో డీడీ నేషనల్ ఏమిటిది? కీర్తన పూర్తయ్యే వరకు ఆగలేరా? కీర్తన మధ్యలో ఈ ప్రకటన లేమిటి?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ట్వీట్‌కు స్పందించిన ప్రసార భారతి సీఈవో ఎస్ఎస్ వేంపాటి వివరణ ఇస్తూ.. ఇది అనుకోకుండా జరిగిన పొరపాటని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని బదులు ఇచ్చారు.

స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణిస్తున్న సెక్షన్‌ను సమీక్షించనున్న సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ : స్వలింగ సంపర్కాన్ని నేరంగా పరిగణిస్తున్న ఐపీసీలోని సెక్షన్ 377ను సమీక్షించేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. 2013 సంవత్సరంలో స్వలింగ సంపర్కాన్ని నేరంగా పేర్కొంటూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించిన విషయం విదితమే. ఢిల్లీ హైకోర్టు నేరం కాదంటూ ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు నాడు పక్కన పెట్టేసింది. అయితే, వ్యక్తిగత గోప్యత అన్నది ప్రాథమిక హక్కులో భాగమేనని ఇటీవలే ఆధార్ విషయంలో సుప్రీం కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో దీన్ని ఆధారంగా చేసుకుని లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్ వర్గాలు (ఎల్జీబీటీక్యూ) తాజాగా సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. తాము సహజసిద్ధమైన లైంగిక అవసరాలు తీర్చుకునే విషయంలో పోలీసులను చూసి భయపడాల్సి వస్తోందని వివరించాయి. స్వలింగ సంపర్కాన్ని నేరమంటున్న సెక్షన్‌ను కొట్టేయాలని కోరాయి. దీంతో సుప్రీం కోర్టు స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌ను రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించింది.

రూ. 4.5 కోట్లకు ముంచేసిన నిత్య పెళ్లి కొడుకు!

- వరుసపెట్టి 8 పెళ్లిళ్లు చేసుకున్న ఘనుడు
- కోట్లలో ముంచేసి పరారీ
- ఇప్పటికే 18 మోసం కేసులు నమోదు
- నిత్య పెళ్లికొడుకు కోసం గాలిస్తున్న పోలీసులు



కోయంబత్తూరు : వరుసగా ఎనిమిది పెళ్లిళ్లు చేసుకుని ఆ భార్యలను రూ. 4.5 కోట్ల మేర ముంచిన నిత్య పెళ్లికొడుకు ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం, తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులోని వెల్లలూరుకు చెందిన బి. పురుషోత్తమన్ (57), ఉషారాణి భార్యాభర్తలు. వారికి 18 ఏళ్ల కుమార్తె ఉంది. ఉషారాణి చాలా ఏళ్ల క్రితమే మరణించింది. ఈ క్రమంలో కోయంబత్తూరులో పెళ్లి సంబంధాలు కుదిర్చే ఏజెన్సీని నిర్వహిస్తున్న మోహన్, వనజ కుమారితో పరిచయం పెంచుకున్న పురుషోత్తమన్ తన ప్రణాళికలను అమలు చేశాడు. విడాకులు తీసుకున్నవారు, వితంతువులను లక్ష్యంగా చేసుకుని వరుస పెట్టి ఎనిమిది మందిని పెళ్లిళ్లు చేసుకున్నాడు. చెన్నైకి చెందిన ఇందిరా గాంధీ (45) అనే లెక్చరర్‌ను మాయమాటలతో పెళ్లాడిన పురుషోత్తమన్ ఆమెను పూర్తిగా తన మాయలో పడేశాడు. ఆమెకు చెన్నైలో ఉన్న ఇల్లును అమ్మేసి కోయంబత్తూరులో కొనుక్కుందామని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన ఆమె ఇల్లు అమ్మగా వచ్చిన రూ. 1.5 కోట్లను పురుషోత్తమన్ చేతిలో పెట్టింది. డబ్బులు చేతిలో పడడమే ఆలస్యం పురుషోత్తమన్ మాయమయ్యాడు. బాధితురాలు ఇందిరా గాంధీ లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించడంతో పురుషోత్తమన్ నిజ స్వరూపం బయటపడింది. పోలీసుల విచారణలో బయటపడిన విషయాలు తెలిసి ఇందిరా గాంధీ విస్తుపోయింది. తన కంటే ముందు ముగ్గురిని, తన తరువాత మరో నలుగురిని పెళ్లాడాడని తెలిసి అవాక్కయింది. తాను పెళ్లాడిన 8 మంది నుంచి మొత్తంగా రూ. 4.5 కోట్లను అతను దండుకున్నట్టు తేలింది. కాగా, పురుషోత్తమన్‌పై ఇప్పటికే 18 మోసం కేసులు ఉండడం గమనార్హం. కాగా, బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఒక్క రూపాయి నాణెం రద్దు చేశారు!



రాంపూర్ : యాచకులకు ఒక్క రూపాయి నాణెంను దానంగా వేస్తున్నారా? అయితే ఇక నుంచి వాటిని వారు స్వీకరించరట. ఉత్తర ప్రదేశ్‌లోని రాంపూర్‌లో యాచకుల గ్రూప్ ఒక్క రూపాయి నాణెంను ఇక మీదట దానంగా అంగీకరించకూడదని నిర్ణయించింది. ఈ నాణెంను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద నోట్ల చలామణీని రద్దు చేసినట్టుగానే, ఇక మీదట తాము కూడా ఒక్క రూపాయి నాణెంను రద్దు చేస్తున్నామని, దీని సైజు 50 పైసల మాదిరి ఉందని యాచకుడు శుక్ర మణి చెప్పాడు. ఈ కాయిన్లను తమ వద్ద నుంచి స్వీకరించవద్దని దుకాణాదారులకు, రిక్షావారిని కూడా కోరినట్టు యాచకులు చెప్పారు. ఇక నుంచి యాచకులకు ఎవరు దానం చేయాలన్నా ఒక్క రూపాయి కంటే ఎక్కువ ఇవ్వాల్సిందే.

ఐ లవ్ ముస్లిమ్స్ అన్నందుకు...



బెంగళూరు : 'ఐ లవ్ ముస్లిమ్స్' అని వాట్సాప్‌లో మెసేజ్ చేసినందుకు 20 ఏళ్ల అమ్మాయిని వేధించి ఆత్మహత్యకు పాల్పడేలా చేసిన ఘటన చిక్‌మగళూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ కేసులో స్థానిక బీజేపీ నాయకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ధన్య శ్రీ (20) చిక్‌మగళూరుకు చేరువలో గల ముడిగెరె పట్టణంలో బీకాం చదువుతోంది. శనివారం తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సంతోష్ అనే స్నేహితుడితో వాట్సాప్‌లో చెలరేగిన వివాదమే ఇందుకు కారణమని తెలుస్తోంది. చాట్‌లో కులం, మతాల ప్రస్తావన రావడంతో ఇరువురి మధ్య గొడవ చెలరేగినట్లు పోలీసులు తెలిపారు. సంతోష్ అడిగిన ఓ ప్రశ్నకు బదులుగా 'నేను ముస్లింలను ప్రేమిస్తున్నాను' అని ధన్య సమాధానం ఇచ్చినట్లు వెల్లడించారు.

దాంతో కోపోద్రేకుడైన సంతోష్ ముస్లింలతో ఎలాంటి సంబంధమూ పెట్టుకోవద్దని హెచ్చరించాడని చెప్పారు. అనంతరం ధన్యతో జరిగిన సంభాషణ స్క్రీన్ షాట్లను స్థానిక భజరంగ్ దళ్, విహెచ్‌పీ సభ్యులకు పంపినట్లు తెలిపారు. ఆ స్క్రీన్ షాట్లు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ధన్య మానసికంగా కుంగిపోయినట్లు చెప్పారు. ధన్య ఇంటికి వెళ్లిన ముడిగెరె పట్టణ బీజేపీ యువ మోర్చా అధ్యక్షుడు అనిల్ రాజ్ ముస్లింలతో స్నేహంగా ఉండడంపై తల్లిదండ్రులను హెచ్చరించినట్లు తెలిపారు. ఆ మరుసటి రోజే ధన్య శ్రీ ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు. ఈ ఘటన తన జీవితాన్ని, చదువును నాశనం చేసిందని ధన్య శ్రీ సూసైడ్ నోట్‌లో రాసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న సంతోష్, మరి ముగ్గురి కోసం వెతుకుతున్నట్లు చెప్పారు.


బంగ్లాదేశ్‌లో భారత నకిలీ కరెన్సీ

ఢాకా : బంగ్లాదేశ్‌లోని ఓ ప్రింటింగ్ ప్రెస్ అది. ఎక్కడ ఉందో తెలియదు గానీ, అక్కడ ఏమి ముద్రిస్తారన్న విషయాన్ని తెలుసుకుంటే, ప్రతి భారతీయుడూ ఆందోళన చెందాల్సిందే. భారత నకిలీ కరెన్సీని అక్కడ ముద్రిస్తున్నారు. రెండు వేలు, 500 నుంచి 50 రూపాయల నోట్ల వరకూ అక్కడ గుద్దేస్తున్నారు. అవి కూడా అచ్చం ఒరిజినల్ మాదిరిగానే కనిపిస్తున్నాయి. కొన్ని వేల కోట్ల రూపాయల విలువైన కరెన్సీని సరిహద్దులు దాటించి, భారత్‌లో ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయడమే వాటిని ప్రింట్ చేస్తున్న వారి ఉద్దేశమని వేరే చెప్పనక్కరలేదుగా. ఈ వీడియోను ఎవరు తీశారో, ఎవరు తొలుత సోషల్ మీడియాలో పోస్టు చేశారన్న సమాచారం లేదు గానీ, ఇది ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది.

'సీఎంపై నోరెత్తితే నాలుక కోస్తా'

భోపాల్ : కాంగ్రెస్ నేత జ్యోతిరాదిత్య సింధియాపై బీజేపీ నాయకుడు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. మధ్య ప్రదేశ్‌లోని కొలారస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ నేత రాధే శ్యామ్ ధకడ్ కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి పరుష వ్యాఖ్యలు చేశారు. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌పై వేలెత్తి చూపిన వారి చేతులు నంకుతామని, గొంతెత్తితే నాలుక కోస్తామని రాధే శ్యామ్ హెచ్చరించారు. సీఎం చౌహాన్ కుమారుడు కార్తికేయ చౌహాన్ సమక్షంలో జ్యోతిరాదిత్య సింధియాను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమైంది. జ్యోతిరాదిత్య సింధియా తమ వర్గం గురించి, తమ సీఎం గురించి అభ్యంతరకరంగా మాట్లాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. రాజకీయ కోణంలోనే తమ వర్గానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని దండిస్తామనే ధోరణిలో ఈ వ్యాఖ్యలు చేశానని సమర్ధించుకున్నారు. జ్యోతిరాదిత్య సింధియాతో తనకెలాంటి వ్యక్తిగత శత్రుత్వమూ లేదని ఆయన చెప్పుకొచ్చారు.

మహాత్మా గాంధీ హత్య కేసులో పునర్విచారణ అవసరం లేదు



- సుప్రీం కోర్టుకు అడ్వకేట్ అమరేందర్ శరణ్ నివేదిక!
- నాలుగో బుల్లెట్ ఉందంటూ వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని వ్యాఖ్య
- విదేశీ నిఘా సంస్థల ప్రమేయం లేదని స్పష్టీకరణ
- సుప్రీం కోర్టుకు నివేదిక అందజేసిన అమరేందర్ శరణ్

న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ హత్య కేసులో పునర్విచారణ అవసరం లేదని స్పష్టం చేస్తూ సుప్రీం కోర్టు అమికస్ క్యూరీ (కోర్టు సహాయకుడు)గా సీనియర్ అడ్వొకేట్ అమరేందర్ శరణ్ సుప్రీం కోర్టుకు తన నివేదిక సమర్పించారు. గాంధీ హత్యకు సంబంధించిన అనుమానాలను, ఆరోపణలను ఈ నివేదిక ద్వారా ఆయన ఖండించారు.

మహాత్మా గాంధీని గాడ్సేనే హతమార్చాడని, ఇందులో విదేశీ నిఘా సంస్థల వ్యక్తుల ప్రమేయం లేదని స్పష్టం చేశారు. నేషనల్ ఆర్కైవ్స్ నుంచి అవసరమైన పత్రాలు, నివేదిక క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే ఈ నివేదికను రూపొందించినట్లు అమరేందర్ వెల్లడించారు. నాలుగో బుల్లెట్ గాంధీ ప్రాణం తీసిందన్న ఆరోపణను కూడా ఆయన తోసిపుచ్చారు. గాంధీ హత్య కేసు విషయమై పునర్విచారణ కోరుతూ ముంబైకి చెందిన పరిశోధకుడు, అభినవ్ భారత్ సంస్థ ట్రస్టీ పంకజ్ ఫడ్నవీస్ సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, గాంధీ హత్య విషయంలో జోక్యం చేసుకొనే హక్కు పంకజ్‌కు లేదని గాంధీ మునిమనవడు తుషార్ వాదించారు. దీంతో ఈ కేసు గురించి పూర్తి వివరాల కోసం సుప్రీం కోర్టు అమరేందర్ శరణ్ సహాయం కోరింది.

వానాకాలం పంటకు తుమ్మిళ్ల లిఫ్ట్ నీళ్లు : హరీశ్ రావు

జోగులాంబ గద్వాల జిల్లా: రాజోలిబండ డైవర్షన్ స్కీం(ఆర్డీఎస్) ఆయకట్టుకు జీవం పోసే తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, మర్రి జనార్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిన తర్వాత తుమ్మిళ్ల ఎత్తిపోతలకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ఇవాళ తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ అయ్యేది కాదు. పాలమూరు జిల్లాలో 12 సంవత్సరాల నుంచి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రాజెక్టులు పూర్తి అవుతున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం మీకు నీళ్లు అందేలా పనిచేస్తుంది. మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ ప్రాజెక్టు రీ డిజైన్ చేసినట్లు హరీశ్ తెలిపారు. సీఎం కేసీఆర్, ఎంపీ పట్టుదలతో తుమ్మిళ్ల లిఫ్ట్ ముందుకు పోతుంది. కల్వకుర్తి కింద రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. తెలంగాణ వచ్చిన తర్వాత నాలుగున్నర లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు మహబూబ్‌నగర్ జిల్లాలో వచ్చింది. ఆర్డీఎస్ కోసం కేసీఆర్ 2003లో పాదయాత్ర చేశారు. సమైక్య పాలకుల నిర్లక్ష్యంతో ఆర్డీఎస్ కింద 65 టీఎంసీల నుంచి 5 టీఎంసీలకు తగ్గింది. తెలంగాణ ప్రభుత్వం రూ.783 కోట్లతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నం. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టు అంటే 10 ఏండ్లు పట్టేంది. టీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిళ్ల లిఫ్ట్‌ను ఆరు నెలల్లో పూర్తి చేసి చూపిస్తామన్నారు. సీఎం కేసీఆర్‌తో లిఫ్టును ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే వానాకాలం పంటకు నీరు అందిస్తామని తెలిపారు. అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో 2 లక్షల 13వేల క్వింటాళ్ల ఉల్లిగడ్డ కొనుగోలు చేసినం. అలంపూర్ నియోజకవర్గంలో 30వేల మెట్రిక్ టన్నుల గోదాంలు నిర్మించినామని తెలిపారు. ఆర్డీఎస్ ఆనకట్ట పెంచాలని కర్ణాటక మంత్రికి తెలియజేసినామన్నారు. అందుకు కావాల్సిన డబ్బులు కూడా ఇస్తామని చెప్పినం.

నవ్యాంధ్రలో పోల‘రణం’

- పోలవరాన్ని మేమే ప్రారంభిస్తామంటున్న కాంగ్రెస్
- మూడు రోజుల పాటు కొనసాగనున్న పాదయాత్ర
- అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సీఎం చంద్రబాబు
- ట్రాన్స్‌ట్రాయ్ యంత్రాలను సీజ్ చేసిన బ్యాంకు అధికారులు
- దేనా బ్యాంక్‌కు రూ.120 కోట్ల ఎగ్గొట్టిన యాజమాన్యం
- కోర్టు అనుమతితో చర్యలు ప్రారంభించిన దేనా బ్యాంకు



(పోలవరం నుంచి ‘సూర్య’ ప్రత్యేక ప్రతినిధి) : ‘నవ్యాంధ్ర ప్రజలకు జీవనాడిగా ప్రభుత్వం భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై రణం మొదలైంది. గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతుండగా తామే ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు చెబుతున్నారు. మరోవైపు పోలవరం కోసం మహాపాదయాత్ర పేరిట కాంగ్రెస్ పార్టీ ధవళేశ్వరం కాటన్ విగ్రహం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు పాదయాత్రను ప్రారంభించింది. పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కేవీపీ రామచంద్రరావు, కనుమూరి బాపిరాజు వంటి వారు ఇందులో పాల్గొంటున్నారు. తాజాగా సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాజెక్టులో భాగంగా కొన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ‘సూర్య’ ప్రత్యేక కథనం ఇది.

పోలవరం ప్రాజెక్టుకు అడుగడుగునా అడ్డంకులు...పనుల నిలిపివేత... యంత్రాల స్వాధీనం వంటి అంశాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం, కేంద్ర మంత్రి గడ్కరీ స్వయంగా ఈ ప్రాజెక్టును పర్యవేక్షిస్తుండడం వంటి అంశాలతో పనులు మందగించాయి. ప్రభుత్వం చెబుతున్నట్లుగా 2019లోగా ప్రాజెక్టు పనులు పూర్తవుతాయా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రధాన నిర్మాణ సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ గడువులోగా దీనిని పూర్తి చేయకుంటే వచ్చే పరిణామాలు ఏంటన్న చర్చ కూడా సాగుతోంది. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం కాంట్రాక్టు సంస్థను మార్చాలని కోరినా కేంద్రం ఒప్పుకోలేదు. దీంతో చాలా వరకు పనులు స్తంభించాయి. మళ్లీ ప్రస్తుతం పనులు ప్రారంభించినా త్వరితగతిన అవి పూర్తవుతాయా ? లేదా అన్న చర్చ కూడా జోరుగా సాగుతోంది. మరోవైపు పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అని కేంద్ర మాజీ మంత్రి ఎం.పల్లంరాజు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం పీసీసీ అధ్యక్షుడు ఎం.రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ప్రారంభమైన పాదయాత్ర పట్టణానికి చేరుకుంది. సుమారు 15కిలోమీటర్ల మేర సాగిన యాత్ర రోడ్డు కం రైలు వంతెన నుంచి పట్టణంలోకి ప్రవేశించి టోల్‌గేట్, విజయవిహార్ మీదుగా మెయిన్‌రోడ్డు చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు మాట్లాడుతూ ఎంతో పట్టుదలతో, పార్టీలకు అతీతంగా ప్రాజెక్టును సంపూర్ణంగా పూర్తిచేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఒక వరం పోలవరమని అభివర్ణించారు. కాంగ్రెస్ హయాంలోని పదేళ్ల కాలంలో రూ.5,200కోట్ల రాష్ట్ర నిధులు ఖర్చు పెట్టి కాలువల తవ్వకాలు పూర్తి చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని సంపూర్ణ చిత్తశుద్ధి భావనతో, కార్యదీక్షతో ప్రాజెక్టును పూర్తి చేస్తామన్న సంకేతాన్ని రాష్ట్ర ప్రజలకు అందించేందుకు ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోనే ప్రాజెక్టు పూర్తి కాగలదనే విశ్వాసాన్ని ఆయన వెలిబుచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు జేడీ శీలం, పనబాక లక్ష్మి, వట్టి వసంత్‌కుమార్, కనుమూరి బాపిరాజు, కేవీపీ రామచంద్రరావు, ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షులు పంతం నానాజి, ఎండీ రఫీయుల్లాబేగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ట్రాయ్ యంత్రాలు సీజ్ : కోట్లాది రూపాయల రుణం తీసుకొని, తిరిగి చెల్లించకుండా మొండికేయడంతోపాటు నోటీసులు ఇచ్చినా స్పందించని పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థ ట్రాన్స్‌ట్రాయ్‌పై దేనా బ్యాంకు అధికారులు చర్యలు ప్రారంభించారు. నిర్మాణ సంస్థకు చెందిన మూడు యంత్రాలను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యనేత ఆదేశాలతో ముఖ్యమంత్రి కార్యాలయ(సీఎంవో) అధికారులు రంగంలోకి దిగి, ట్రాన్స్‌ట్రాయ్‌పై చర్యలు తీసుకోకుండా బ్యాంకు అధికారులను అడ్డుకోవడం గమనార్హం.

కోర్టు అనుమతితోనే చర్యలు : హైదరాబాద్‌లోని దేనా బ్యాంకులో ట్రాన్స్‌ట్రాయ్ తన ఆస్తులను తనఖా(మార్టిగేజ్) పెట్టి 2015లో రూ.87 కోట్ల రుణం తీసుకుంది. అసలు, వడ్డీతో కలిపి గత నవంబర్ నాటికి అది రూ.120 కోట్లకు చేరింది. రుణం చెల్లించాలని ట్రాన్స్‌ట్రాయ్‌కు నోటీసులు జారీ చేశామని, అయినా స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించామని దేనా బ్యాంకు అధికారులు తెలిపారు. కోర్టు అనుమతితో ట్రాన్స్‌ట్రాయ్ వాహనాలు, యంత్రాలను సీజ్ చేసేందుకు బ్యాంకు సిబ్బంది పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతానికి చేరుకున్నారు. మూడు తవ్వకం యంత్రాలను సీజ్ చేశారు. ఆ మేరకు యంత్రాలపై నోటీసులు అంటించారు. ట్రాన్స్‌ట్రాయ్ సంస్థకు చెందిన జీఎం ప్రకాశ్‌రావు అక్కడికి చేరుకున్నారు. 64 యంత్రాలు, వాహనాలను సీజ్ చేసేందుకు అనుమతి ఉందని బ్యాంకు అధికారులు తెలిపారు. సెక్షన్ 14 సర్‌ప్లస్ యాక్ట్ ప్రకారం కోర్టు అనుమతితో ట్రాన్స్‌ట్రాయ్‌పై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

రైతు శ్రేయోభిలాషి కాంగ్రెస్ పార్టీ : పీసీసీ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి కాంగ్రెస్ పార్టీ రైతు శ్రేయోభిలాషి అని పీసీసీ ఉపాధ్యక్షుడు ఎన్.తులసీరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు సవతితల్లి ప్రేమను కనబరుస్తున్నారని, అందుకు నిదర్శనం తొమ్మిదేళ్ల తన పాలనలో ఒక పైసా కూడా కేటాయించకపోవడమేనన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి జ్యేష్ఠ సతీష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మటపర్తి రామ్మోహనరావు, బీవీఆర్ చౌదరి, దాసరి కుటుంబరావు, గన్నిన రామారాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్లలో ఏం అభివృద్ధి సాధించారు

★ పాండిచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి : గత కాంగ్రెస్ సీఎం అంజయ్య ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తే డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇందిరా పోలవరం సాగర్‌గా నామకరణం చేసి ప్రాజెక్టు పనులను వేగవంతం చేశారని పాండిచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. వై.ఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సుమారు రూ.5,200 కోట్లతో కుడి, ఎడమ కాల్వల నిర్మాణాలు పూర్తి చేస్తే నేటి ముఖ్యమంత్రి అంతా తన ఘనతే అని చాటుకోవడం హాస్యాస్పదం అన్నారు. ఈ మూడేళ్లలో ఏ మేరకు అభివృద్ధి సాధించారంటూ ప్రశ్నించారు. 2019లో తాము తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టును తామే ప్రారంభిస్తామన్నారు.

కాంగ్రెస్ మానస పుత్రిక పోలవరం

★ ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి : రాష్ట్ర విభజన సమయంలోనే జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి కేంద్రం నిర్మించాల్సి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సిన అవసరం ఏముందని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. పోలవరం కాంగ్రెస్‌కు మానసపుత్రిక అని, నాణ్యతతో కూడిన పనులతో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు పోరాడతాం అన్నారు.

భద్రాద్రి ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి



హైదరాబాద్, మేజర్‌న్యూస్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సీతారామచంద్ర స్వామి దేవస్థానం రూపొందించిన 2018 సంవత్సరపు క్యాలెండర్‌ను సోమవారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆవిష్కరించారు. గచ్చిబౌలిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో భద్రాద్రి ఆలయ ఈవో కె. ప్రభాకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సేవలో రతన్ టాటా



తిరుమల, సూర్య బ్యూరో : తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని ప్రముఖ పారిశ్రామిక వేత్త, టాటా ట్రస్టు ఛైర్మన్ రతన్ టాటా దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో రతన్‌టాటాతో పాటు టాటా గ్రూప్ సంస్థల ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని స్వామివారి సేవలో పాల్గొన్నారు. వీరికి తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు స్వాగతం పలికి శ్రీవారి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారిని దర్శించుకున్న వారిలో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయ్‌సాయిరెడ్డి కూడా ఉన్నారు.

వాళ్లు ఛీకొడితే అంబటి ఇక్కడకు వచ్చాడు
టీడీపీ యువనేత కోడెల శివరాం



గుంటూరు, సూర్య బ్యూరో : వైసీపీ నేత అంబటిపై టీడీపీ నేత కోడెల శివరాం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం కోడెల శివరాం ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి అభివృద్ధిని అడ్డుకుంటున్న అంబటిని తరిమికొట్టాలని ఆయన పిలువునిచ్చారు. అంబటి పుట్టిన ఊరు, నమ్మిన గ్రామస్తులను మోసం చేసి ఇక్కడకు వచ్చి కుల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. సొంత గ్రామ ప్రజలు చీకొడితే అంబటి ఇక్కడికి వచ్చి బతుకుతున్నారుని, సత్తెనపల్లితో గానీ, పల్నాడుతో గానీ అంబటికి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. సత్తెనపల్లిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని కోడెల హెచ్చరించారు.

విధులు సంతృప్తినిచ్చాయి
నవీన్‌మిట్టల్‌కు ఐఅండ్ పీఆర్ వీడ్కోలు



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధి: సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనరుగా పనిచేసిన కాలం తనకు సంతృప్తిని ఇచ్చిందని, కళాశాల విద్య,సాంకేతిక విద్యా శాఖ కమిషనరు నవీన్ మిట్టల్ అన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనరుగా పనిచేసి బదిలీపై వెళ్ళిన ఆయనను సోమవారం సమాచార శాఖ అధికారులు, సిబ్బంది మాసాబ్ ట్యాంక్ లోని సమాచారభవన్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాచార శాఖ సిబ్బంది సంపూర్ణ సహకారం వలననే తాను కమీషనరుగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళగలిగానని అన్నారు, ఈ శాఖ చాలా కీలకమైనదని, అన్ని శాఖలకు సంబంధం కలిగి ఉందని అన్నారు. నేను కమిషనరుగా బాధ్యతలను స్వీకరించినపుడు ఇక్కడి అధికారులు, సిబ్బంది ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖతో పోల్చి, తమకు తక్కువ సౌకర్యాలు ఉన్నాయని అనేవారు, కానీ ఇపుడు తెలంగాణా సమాచార శాఖ పనితీరుతో ఆంధ్రప్రదేశ్ అధికారులు పోల్చుకుంటున్నారని అన్నారు. సమాచార శాఖలో మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చడం వలన సిబ్బంది పనితీరు మెరుగు పడిందని అన్నారు. నవంబర్, 2015 నుండి ఈ శాఖలో పనిచేశానని, సిబ్బంది సమిష్టి కృషితో ఇది సాధ్యమైందని అన్నారు.

ఆనందంతో చెరువులో ఈత కొట్టిన పల్లె రఘునాథ్ రెడ్డి



అనంతపురం,సూర్యబ్యూరో: జిల్లాలో అతి పెద్ద చెరువు బుక్కపట్టణం చెరువు. చిత్రావతినదిపై రాయల కాలంలో నిర్మించిన ఈ చెరువు ఎప్పుడూ నీళ్లు లేక కనిపించేది. పదేళ్లకు పైగా నీళ్లు లేక ఎడారిలా తలపించింది. దీంతో చెరువు కింద ఆయుకట్టు రైతులు పంటలపై ఆశలు వదులుకుని పొరుగు ప్రాంతాలకు వలసబాట పట్టారు. ఈ తరుణంలో కృష్ణమ్మ కరుణించింది. బుక్కపట్నం చెరువు నిండింది. ఇది చూసి పులకించిన చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి చిన్నపిల్లాడిలా మురిసిపోయారు. అదే ఆనందంలో చెరువులోకి దిగి ఈత కొట్టారు.మూడు మండల కేంద్రాలకు మధ్యన చిత్రావతి నదిపై ఉన్న ఈ చెరువును 500 ఏళ్ల క్రితం నిర్మించారు. ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన ఈ చెరువును దగ్గర నుంచి చూస్తే సముద్రాన్ని తలపిస్తోంది. కర్నాటకలో పుట్టిన చిత్రావతి నదిపై అక్రమ కట్టడాలు అధికమవ్వడంతో ఈ చెరువు నిండడం గగనమైంది. పదేళ్ల నుంచి చుక్క నీరు లేకుండా పోయింది. ఈ క్రమంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలించడంతో చెరువు జలకళ సంతరించుకుంది.

శివారు ప్రాంతాలు పచ్చగా ఉండాలె

- ఔటర్ రింగ్ రోడ్డుపై సీఎం ఓ ఎస్డీ ఆకస్మిక పర్యటన
- కంపెనీలు, సంస్థలు పచ్చదనంలో భాగస్వామ్యం కావాలి
- జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులతో కలిసి పచ్చదనం చర్యల పరిశీలన
- సరిగ్గా పనిచేయని కాంట్రాక్టర్లపై చర్యలు
- సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్



హైదరాబాద్, సూర్యప్రధానప్రతినిధిః నగరానికి వడ్డానంగా ఉన్న అవుటర్ రింగ్‌రోడ్డు చుట్టూర పచ్చదనం పరుచుకోవాలని సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ తెలిపారు. హరితహారంలో భాగంగా ఔటర్ వెంట చేపట్టిన పచ్చదనం పనుల పరిశీలించారు. మేడ్చల్ కండ్లకోయ జంక్షన్ నుంచి కీసర మీదుగా పెద్ద అంబర్‌పేట్, విజయవాడ జాతీయ రహదారి వెంట మొక్కల ఎదుగుదలను స్వయంగా పరిశీలించారు. కీసర జంక్షన్ లో నాటిన మొక్కలను పరిశీలించిన ప్రియాంక, ఔటర్ వెంట రోడ్డుతో పాటు ప్రధాన జంక్షన్ల లో, సర్వీస్ రోడ్ల వెంట మరిన్ని మొక్కలు నాటాలని, ఇప్పటికే ఉన్న మొక్కలకు రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కలకు నీటి సౌకర్యంపై ఆరా తీశారు. ఔటర్ తో పాటు విజయవాడ జాతీయ రహదారిపై కొన్ని ప్రైవేట్ కంపెనీలు మొక్కలను దత్తత తీసుకుని పెంచుతున్నారు. అక్కడ మంచి ఫలితాలు రావటంపై ప్రియాంక వర్గీస్ సంతోషం వ్యక్తం చేశారు. ఔటర్ వెంట ఉన్న మరిన్ని కంపెనీలు, సంస్థలు పచ్చదనం పెంపుతో ప్రభుత్వ చర్యలకు బాసటగా నిలవాలని కోరారు. ఆయా సంస్థలు స్వచ్ఛందంగా కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి మొక్కలకు నీటి సౌకర్యం, ట్రీ గార్డుల ఏర్పాటు చేయాలన్నారు. త్వరలోనే సీఎం స్వయంగా ఔటర్ పై ప్రయాణించి పచ్చదనం పరిశీలిస్తారని, ఔటర్ రింగ్ రోడ్డు మొత్తం 158 కిలో మీటర్ల పొడవునా చక్కటి గ్రీనరీ ఉండాలన్నదే సీఎం ఆశయం అన్నారు. ఎండిన మొక్కల స్థానంలో తక్షణం మంచి ఎత్తు ఉన్న మొక్కలు నాటాలని ఆదేశించారు. పనుల్లో అలసత్వం, పర్యవేక్షణ లోపం ఉన్న కాంట్రాక్టర్లను పక్కన పెట్టాలని ఆదేశించారు.

కోహ్లీసేన పరాజయం

- దక్షిణాఫ్రికా చేతిలో పరాభవం
- రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుదేలు
- ఆరు వికెట్లతో చెలరేగిన ఫీలాండర్
- 72 పరుగుల తేడాతో ఓటమిపాలు
- సత్తా చాటని విరాట్ కోహ్లీ
- అదే బాటలో ద్విశతకాల వీరుడు రోహిత్‌శర్మ
- యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు ఏమైందో?
- కనిపించిన ఉపసారథి అజింక్య రహానే లేని లోటు



కేప్‌టౌన్: అందివచ్చిన అవకాశాన్ని కోహ్లీసేన చేజార్చుకుంది. కాస్తంత ఓపికగా ఆడిన పక్షంలో మూడు టెస్టుల సిరీస్‌లో తొలి విజయం భారత్ ఖాతాలో పడేది! ఛేదించాల్సిన లక్ష్యం 208 పరుగులు. ఇది టీమిండియాకు అంత కష్టమైందేమీ కాదు. ఇంకా ఐదు సెషన్ల సమయం మిగిలి ఉంది. ఓవర్‌కు రెండు పరుగులు చేసినాచాలు. తేలిగ్గా విజయం కోహ్లీ సేన ఖాతాలో పడేది. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా పేరొందిన సారథి విరాట్ కోహ్లీ ఏమాత్రం సత్తాచాటలేదు. ద్విశతకాల వీరుడు రోహిత్‌శర్మ ఆ దరిదావులకే రాలేదు. యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు అదృష్టం పారిపోయింది. విదేశాల్లో ఎదుర్కొన్న తొలి పరీక్షలోనే టీమిండియా ఘోరంగా విఫలమైంది! రెండో ఇన్నింగ్స్‌లో 135 పరుగులకే కుదేలైంది. 72 పరుగుల తేడాతో ఆతిథ్య దక్షిణాఫ్రికా చేతిలో ఓడింది. దక్షిణాఫ్రికా సహా విదేశాల్లో మెరుగైన రికార్డున్న ఉపసారథి అజింక్య రహానె తుది జట్టులో ఉంటే ఫలితం మరోలా ఉండేదేమో! ఫిలాండర్.. మోర్కెల్.. రబాడాను అతను అడ్డుకొని ఉండేవాడేమో! గతి తప్పకుండా సరైన స్థానాల్లో విసిరిన చురకత్తుల్లాంటి బంతులు ఆపి నాలుగో బ్యాట్స్‌మన్‌గా వికెట్ల పతనాన్ని అడ్డుకొని ఉండేవాడేమో! ఒక్క సిరీస్‌లో ఫామ్‌లో లేదని అతడిని తుది జట్టులోంచి తొలగించడం టీమిండియాకు తీవ్ర నష్టమే చేసింది! అతడు లేని ప్రస్తుత వ్యూహం బెడిసికొట్టింది! నాలుగో రోజు మొత్తం చేసిన పరుగులు 200లే. మూడోరోజు ఆట వర్షార్పణం అయిన సంగతి తెలిసిందే. దీంతో నాలుగో రోజు, సోమవారం దక్షిణాఫ్రికా 52/2 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగింది. షమి (3/28), బుమ్రా (3/39), భువి (2/33) దెబ్బకు స్వల్ప పరుగుల తేడాతో ఎనిమిది వికెట్లు చేజార్చుకుంది. డివిలియర్స్ ఒక్కడే కాస్త పోరాడాడు. అతడికి అండగా నిలిచే వారే లేకపోయారు. 41.2 ఓవర్లకు 130 పరుగులకు ఆలౌట్ అయింది. సోమవారం చేసింది 65 పరుగులే. దాంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని టీమిండియాకు 208 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. ఛేదనకు దిగిన కోహ్లీసేనను దక్షిణాఫ్రికా బౌలర్ ఫిలాండర్ (6/42) ఊహించని దెబ్బకొట్టాడు. మురళీ విజయ్ (13), విరాట్ కోహ్లీ (28; 40 బంతుల్లో 4x4), రోహిత్ శర్మ (10), రవిచంద్రన్ అశ్విన్ (37; 53 బంతుల్లో 5x4), మహ్మద్ షమి (4), బుమ్రా (0)ను వైవిధ్యమైన బంతులు విసిరి పెవిలియన్ పంపించాడు. అతడి ధాటికి 82 పరుగులకే టీమిండియా 7 వికెట్లు చేజార్చుకుంది. భువి సాయంతో అశ్విన్ కాసేపు పేసర్ల త్రయాన్ని ఎదుర్కొన్నాడు. 49 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఆశలు కల్పించాడు. కానీ ఫిలాండర్ వాటిని అడియాసలు చేశాడు. 43వ ఓవర్‌లో మూడు వికెట్లు తీసి కథ ముగించాడు. అంతకు ముందు మోర్నీ మోర్కెల్ (2/39) శిఖర్ ధావన్ (16), పుజారా (4)ను ఔట్ చేశాడు. రబాడా ఏమో సాహా (8), పాండ్య (1) పని పట్టాడు.

హైదరాబాద్ నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు
సంక్రాంతికి 220 బస్సుల ఏర్పాటు



తూర్పుగోదావరి,సూర్యబ్యూరో: సంక్రాంతిని పురస్కరించుకుని హైదరాబాద్ నుంచి జిల్లాకు 200లకు పైగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చింతా రవికుమార్ తెలిపారు. సోమవారం సూర్యబ్యూరోతో మాట్లాడుతూ రద్దీని దృష్టిలో ఉంచుకుని మరో 20 బస్సులను కూడా నడుపుతున్నట్లు చెప్పారు. జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ, రావులపాలెం, అమలాపురం ప్రాంతాలకు హైదరాబాద్ నుంచి ఈ బస్సులు వస్తాయన్నారు. అన్నీ నాన్‌స్టాప్ సర్వీస్‌గా నడువుతున్నామన్నారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 15 నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.మొదటి రోజు 10 బస్సులు ఆ తర్వాత నుంచి ప్రతిరోజు 30 బస్సులు నడుపుతామన్నారు. 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయని చెప్పారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2-293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO 22, DOOR NO.8-2- 293/82/A/22, ROAD NO. 5, JUBILEE HILLS HYDERABAD-33, TELANGANA. PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.22, DOOR NO. 8-2- 293/82/A/22,ROAD NO. 5, JUBILEE HILLS, HYDERABAD-33, TELANGANA. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044·